www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 4-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 188 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: విదియ తె. 5.31 తదుపరి తదియ; నక్షత్రం: చిత్ర రా. 6.38 తదుపరి స్వాతి వర్జ్యం: రా. 12.54-2.42; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.18, మ. 12.27-1.14; అమృతఘడియలు: ఉ. 11.24-1.12; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 5.57 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్‌లు

దక్షిణాఫ్రికా X వెస్టిండీస్
మధ్యాహ్నం 3.30 నుంచి

భారత్ X న్యూజిలాండ్
రాత్రి 7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

అభిమన్యు భారీ శతకం

- రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్ 289/4
- ముంబై మొదటి ఇన్నింగ్స్ 537



లఖ్‌నవూ: ముంబైతో జరుగుతున్న ఇరానీ ట్రోఫీలో రెస్టాఫ్ ఇండియా దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (151 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించగా, గురువారం ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 289 పరుగులు చేసింది. ముంబై కన్నా ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది. అభిమన్యుకు జతగా క్రీజులో ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) ఉన్నాడు. ఇషాన్ (38), సాయి సుదర్శన్ (32) ఫర్వాలేదనిపించారు. పేసర్ మోహిత్ అవస్థికి రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన ముంబై కేవలం మూడు ఓవర్లు మాత్రమే ఆడి తొలి ఇన్నింగ్స్‌ను 537 పరుగులు వద్ద ముగించింది. సర్ఫరాజ్ (222 నాటౌట్) అజేయంగా మిగిలాడు. పేసర్ ముకేశ్‌కు ఐదు, యష్ దయాళ్.. ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

ఖుషీకి కాంస్యం



జూ. వరల్డ్ చాంపియన్‌షిప్

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ ఖుషీ కాంస్యం సాధించింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో నాటకీయ రీతిలో ఫైనల్‌కు అర్హత సాధించిన ఖుషీ 447.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. కాగా, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఖుషీ 585 పాయింట్లతో ఏడో స్థానం దక్కించుకుంది. మరో ముగ్గురు కూడా ఆమెతో సమానంగా స్కోరు చేశారు. దీంతో ఇన్నర్ 10లో ఎక్కువ పాయింట్లు సాధించిన ఖుషీ, అన్నా స్కియవాన్ (ఇటలీ) ఫైనల్‌కు అర్హత సాధించారు. అయితే, కౌంట్ బ్యాక్‌లో స్కియవాన్‌ను వెనక్కునెట్టిన ఖుషీ ఏడో స్థానం సొంతం చేసుకొంది. త్రీ పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో సాక్షి, మెల్వీనా జోయల్, ప్రాచీ గైక్వాడ్ త్రయం 1757 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు భారత్ మొత్తం 15 (10 స్వర్ణ, రజత, 4 కాంస్య) పతకాలతో టాప్‌లో కొనసాగుతోంది.

నేడు కివీస్‌తో భారత్ తొలి పోరు | మహిళల టీ20 వరల్డ్ కప్

ఆరంభం అదరాలి



దుబాయ్: చాలాకాలంగా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని ఈసారి ఎలాగైనా దక్కించుకోవాలని పట్టుదలగా ఉన్న భారత మహిళల జట్టు..టీ20 వరల్డ్ కప్‌లో తొలి సమరానికి సిద్ధమైంది. గ్రూప్ 'ఎ'లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న టీమిండియా శుక్రవారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఎదుర్కోనుంది. అయితే కప్పు కలను నెరవేర్చుకోవాలంటే మాత్రం జట్టులోని సీనియర్ క్రికెటర్లు అంచనాల మేర రాణించాల్సిందే. ప్రతి టోర్నీలో భారత్ బలంగానే కనిపిస్తున్నా..కీలక తరుణాల్లో మానసికంగా దృఢంగా లేకపోవడం దెబ్బ తీస్తోంది. దాంతో ఈసారి మెగా టోర్నమెంట్ సన్నాహకాల్లో హర్మన్ సేన ఈ విషయంపై ప్రధానం దృష్టి నిలిపింది. జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగిన శిబిరంలో జట్టుకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించారు. కివీస్‌తో పోరులో హర్మన్, మంధాన, జెమీమా, షఫాలీ, దీప్తి శర్మ బ్యాటింగ్‌లో అదరగొట్టాలి. షఫాలీ, స్మృతి అద్భుత ఫామ్‌లో ఉండడం కలిసి రానుంది. చివరి ఐదు టీ20లలో మంధాన ఐదు హాఫ్ సెంచరీలతో సత్తా చాటింది. తీవ్రమైన వేడి పరిస్థితుల నడుమ యూఏఈ పిచ్‌లపై పరుగులు రాబట్టడం ఆషామాషీకాదు. అయితే మందకొడి వికెట్లపై భారత స్పిన్నర్లు ప్రభావం చూపే అవకాశాలున్నాయి. దాంతో ముగ్గురు పేసర్లు..రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డిలలో ఇద్దరితోనే భారత్ బరిలో దిగే చాన్సుంది. స్పిన్నర్లు దీప్తిశర్మ, శ్రేయాంక పాటిల్, ఆశా శోభన, రాధా యాదవ్ సత్తా చాటితే మనోళ్లకు తిరుగుండదు. మరోవైపు అనుభవజ్ఞులు, కొత్తవారితో న్యూజిలాండ్ సమతూకంగా ఉంది. సోఫీ డివైన్ కెప్టెన్సీలో సీనియర్ ఆల్‌రౌండర్ సుజీ బేట్స్, వెటరన్ పేసర్లు లియా తహుహు, లీగ్ కాస్పెరెక్‌తో కివీస్ జట్టు సవాలు విసురుతోంది.

జట్లు

భారత్ హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతీ మంధాన, షఫాలీ వర్మ, దీప్తిశర్మ, జెమీమా, రిచా (కీపర్), యాస్తిక, వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకాసింగ్, హేమలత, ఆశ, రాధా యాదవ్, శ్రేయాంక, సజన

న్యూజిలాండ్ : సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీ బేట్స్, అమీలియా కెర్, కార్సన్, ఇసబెల్లా గేజ్ (కీపర్), లియా తహుహు, మ్యాడీ గ్రీన్, బ్రూక్ హాలీడే, ఫ్రాన్ జొనాస్, లీ కాస్పెరెక్, జాస్ కెర్, రోస్‌మేరీ, మోలీ పెన్‌ఫోల్డ్, జార్జియా ప్లిమెర్, హనా రో.

9 మందికి రెండేళ్ల కాంట్రాక్ట్ !

వెస్టిండీస్ బోర్డు సంచలన నిర్ణయం

సెయింట్ జాన్స్ (ఆంటిగ్వా): జాతీయ జట్టును పటిష్ఠం చేసేందుకు క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) సంచలన నిర్ణయం తీసుకొంది. పురుషులు, మహిళల జట్లలోని టాప్ క్రికెటర్లలో 9 మందికి ఏకంగా రెండేళ్ల కాంట్రాక్ట్‌లిచ్చి సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రతిభ గల క్రికెటర్లు ఫ్రాంచైజీ లీగ్‌లవైపు మొగ్గుచూపుతుండడంతో దీన్ని అరికట్టి ఆటగాళ్లకు మరింతగా ఆర్థిక భరోసా కల్పించేందుకు విండీస్ బోర్డు ముందడుగేసింది. పురుషుల్లో మొత్తంగా 15 మందికి సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వగా.. వారిలో ఆరుగురికి రెండేళ్ల డీల్ ఇచ్చినట్టు బోర్డు తెలిపింది. 2023-24 ప్రదర్శన ఆధారంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొంది. వన్డే టీమ్ కెప్టెన్ షాయ్ హోప్‌తోపాటు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్, కింగ్, మోటీ, సీల్స్‌కు కాంట్రాక్ట్ దక్కింది. మహిళల కెప్టెన్ హేలీ మాథ్యూస్‌తోపాటు క్యాంప్‌బెల్, స్టెఫానీ టేలర్‌లకు రెండేళ్ల కాంట్రాక్ట్ లభించింది.

ఆనంద్-కార్ల్‌సన్ గేమ్ డ్రా

లండన్: ఇద్దరు దిగ్గజ చెస్ ఆటగాళ్ల నడుమ జరిగిన గేమ్ డ్రాగా ముగిసింది. గ్లోబల్ చెస్ లీగ్‌లో భాగంగా మాజీ వరల్డ్ చాంపియన్లు విశ్వనాథన్ ఆనంద్-మాగ్నస్ కార్ల్‌సన్ మధ్య జరిగిన గేమ్‌లో ఫలితం తేలలేదు. గురువారం ప్రారంభమైన లీగ్ తొలి రౌండ్‌లో గ్యాంగెస్ గ్రాండ్ మాస్టర్స్ తరఫున ఆనంద్-ఆల్‌పైన్ పైపర్స్ నుంచి కార్ల్‌సన్ తలపడ్డారు. అయితే 40 ఎత్తుల అనంతరం ఆనంద్-కార్ల్‌సన్ డ్రాకు అంగీకరించారు. ఇక..ఈ మ్యాచ్‌లో ఆల్‌పైన్ 6-11తో గ్యాంగెస్‌పై నెగ్గింది. అమెరికన్ గ్యాంబిట్స్ 11-6తో ముంబై మాస్టర్స్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో అలాస్కన్ నైట్స్ 15-3తో డిఫెండింగ్ చాంపియన్ త్రివేణి కాంటినెంట్ నైట్స్‌కు షాకిచ్చింది.

వాన్సిక్ డబుల్ ధమాకా

వరల్డ్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్

ముంబై: వరల్డ్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు వాన్సిక్ అదరగొట్టాడు. పురుషుల సింగిల్స్‌లో స్వర్ణం సాధించిన వాన్సిక్.. మరో పసిడి, రెండు రజతాలు నెగ్గడంలో భాగస్వామిగా ఉన్నాడు.

ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది

రోహిత్



న్యూఢిల్లీ: గతేడాది భారత్‌లోనే జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ సేన వరుసగా పది విజయాలు సాధించి ఫైనల్‌లో అడుగుపెట్టింది. కానీ తుది పోరులో ఆసీస్ చేతిలో భంగపడాల్సి వచ్చింది. దీంతో కోట్లాది భారత అభిమానులతో పాటు జట్టు ఆటగాళ్లు కూడా తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అయితే ఈ ఏడాది అద్భుత ప్రదర్శనతో టీ20 వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకోగలిగింది. 'ఈ మెగా టోర్నీని గెలిచేందుకు మూడు నాలుగు నెలలుగా చక్కటి ప్రణాళికలతో ముందుకెళ్లాం. చివరకు గెలిచాం. దీంతో నాకైతే తిరిగి ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది' అని తన క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవంలో రోహిత్ తెలిపాడు.



అజర్‌కు తాజా సమన్లు

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అవినీతి ఆరోపణలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజరుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా సమన్లు జారీచేసింది. అజర్ అధ్యక్షుడిగా పనిచేసిన 2020-2023 మధ్యకాలంలో హెచ్‌సీఏలో రూ.20 కోట్లకు పైగా అవినీతి జరిగినట్టు ఆరోపణలున్నాయి. మధ్యంతర ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా గతేడాది హెచ్‌సీఏ సీఈఓ సునీల్ ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని ఈడీ మనీ లాండరింగ్ చట్టం కింద అజర్‌కు సమన్లు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం విచారణకు హాజరు కావాల్సివుంది. అయితే ఈడీ ముందు విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం కావాలని అజర్ కోరాడు. దీంతో ఈనెల 8న హాజరు కావాల్సిందిగా తాజా సమన్లు జారీ చేశారు. క్రికెట్ బంతులు, జిమ్ సామగ్రి, ఉప్పల్ స్టేడియం పైకప్పు, కుర్చీలు, అగ్నిమాపక పరికరాలు, డీజిల్ జనరేటర్ల కొనుగోలులో భారీ అక్రమాలు జరిగినట్టు ఆడిట్‌లో తేలింది.

సౌతాఫ్రికా బోణీ

అబుధాబి: ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో సౌతాఫ్రికా బోణీ చేసింది. మొదటి మ్యాచ్‌లో 139 పరుగులతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. సఫారీలు తొలుత 50 ఓవర్లలో 271/9 స్కోరు చేశారు. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (91), స్టబ్స్ (79) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఛేదనలో ఐర్లాండ్ 31.5 ఓవర్లలో 132 పరుగులకే కుప్పకూలింది.

పాక్ బౌలర్ల తడాఖా



శ్రీలంకపై ఘనవిజయం
మహిళల టీ20 వరల్డ్‌కప్

షార్జా: మహిళల టీ20 వరల్డ్‌కప్ సంచలన ఫలితంతో ఆరంభమైంది. గ్రూప్ 'ఎ'లో మ్యాచ్‌లో పాకిస్థాన్ బౌలర్లు విశేష ప్రతిభ చూపడంతో, ఆసియా చాంపియన్స్ శ్రీలంకపై 31 పరుగులతో సంచలన విజయం సాధించింది. కొత్త కెప్టెన్ ఫాతిమా సనా (30; 2/10) ఆల్‌రౌండ్‌షో కనబర్చింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 116 పరుగులు మాత్రమే చేసింది. 84/8 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టు చివర్లో ఫాతిమా ఆటతో కాస్త కోలుకుంది. ఆటపట్టు, సుగంధిక, ప్రబోధనిలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఇక ఇటీవలి కాలంలో పాక్‌పై ఆధిక్యం చూపుతున్న శ్రీలంక ఈ స్వల్ప ఛేదనను అవలీలగా ముగిస్తుందనే అంతా భావించారు. కానీ పాక్ స్పిన్నర్లను ఎదుర్కోలేక 20 ఓవర్లలో 9 వికెట్లకు 85 రన్స్ మాత్రమే చేసి ఓడింది. సదియాకు మూడు.. నష్రా, ఒమైమాలకు రెండేసి వికెట్లు దక్కాయి.

దశాబ్దం తర్వాత బంగ్లా గెలుపు: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పదేళ్ల తర్వాత టీ20 మహిళల వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ జట్టు గెలుపు రుచి చూసింది. 2014 నుంచి బరిలోకి దిగిన ప్రతీసారి ఓటమితో వెనుదిరిగిన ఈ జట్టు ఎట్టకేలకు గురువారం తమ ఆరంభ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌ను 16 పరుగుల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 20 ఓవర్లలో 119/7 పరుగులు మాత్రమే చేసింది. సస్కియాకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బంగ్లా బౌలర్లు విశేషంగా రాణించడంతో స్కాట్లాండ్ 20 ఓవర్లలో 103/7 స్కోరుకే పరిమితమైంది. రీతూకు రెండు వికెట్లు దక్కాయి.

బెంగళూరుకు పాలోమీ ఎస్టేట్స్

రూ.800 కోట్లతో రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ అభివృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ పాలోమీ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. బెంగళూరు మార్కెట్లోకి అడుగుపెడుతోంది. ఉత్తర బెంగళూరు, తనిసంద్రలోని మాన్యత ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఫేజ్-2లో 9 ఎకరాల విస్తీర్ణంలో రూ.800 కోట్ల పెట్టుబడితో ప్రీమియం హై రైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పాలోమీ ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడించారు. మొత్తం 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఫేజ్-1, ఫేజ్-2లో ఒక్కోటి రెండు టవర్లతో నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. 35 అంతస్తులతో కూడినఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 850 రెసిడెన్షియల్ ఫ్లాట్లు ఉంటాయన్నారు. కాగా ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ తొలి దశను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా తొలిసారిగా బెంగళూరు రియల్టీ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రశాంత్ రావు చెప్పారు.

హైదరాబాద్‌లో 2 కొత్త ప్రాజెక్టులు: హైదరాబాద్‌లో కంపెనీ ఇప్పటి వరకు 6 ప్రీమియం రెసిడెన్షియల్, రెండు కమర్షియల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసిందని ప్రశాంత్ చెప్పారు. కాగా హైదరాబాద్ కోకాపేట్‌లో రూ.1,100 కోట్లతో పల్లాజో, ఇన్ఫినిటీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో పల్లాజో రెసిడెన్షియల్ ప్రాజెక్టు 2026 నాటికి అందుబాటులోకి రానుండగా, ఇన్ఫినిటీ కమర్షియల్ ప్రాజెక్ట్ వచ్చే ఏడాది జూలై నాటికి రెడీ అవుతుందని చెప్పారు.

అ ఇ క్కడ వార్.. బేర్ర్..!

కుప్పకూలిన మార్కెట్ సూచీలు

- 25,250 స్థాయికి నిఫ్టీ
- చిన్న కంపెనీల షేర్లూ విలవిల
- రూ.10 లక్షల కోట్ల సంపద ఫట్
- విదేశీ ఇన్వెస్టర్లూ చైనాకు జంప్
- ముడి చమురు మళ్లీ భగ భగ

సెన్సెక్స్ 1,769 పాయింట్లు డౌన్



ముంబై: పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్‌నూ కుదిపేశాయి. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చవచ్చన్న ఆందోళనలతో ఈక్విటీ ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోయారు. ఇందుకు తోడు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మన మార్కెట్లోని పెట్టుబడులను పెద్దఎత్తున చైనాకు మళ్లిస్తుండటం, ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకడం, ఎఫ్ అండ్ ఓ నిబంధనలను సెబీ కఠినతరం చేయడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి. దాంతో మదుపరులు ఆయిల్, బ్యాంకింగ్, వాహన రంగ షేర్లలో భారీగా అమ్మకాలు జరపడంతో ప్రామాణిక సూచీలు కుప్పకూలాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ ఏకంగా 1,769.19 పాయింట్లు (2.10 శాతం) పతనమై మూడు వారాల (సెప్టెంబరు 11) కనిష్ఠ ముగింపు స్థాయి 82,497.10 వద్దకు జారుకుంది. నిఫ్టీ సైతం 546.80 పాయింట్లు (2.12 శాతం) క్షీణించి 25,250.10 వద్ద క్లోజైంది. సూచీలకు గడిచిన 2 నెలల్లో ఇదే అతిపెద్ద పతనం.

అంతేకాదు, సూచీలు నష్టపోవడం వరుసగా ఇది నాలుగో రోజు. మార్కెట్లోని ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లలోనూ అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ 2.27 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.84 శాతం క్షీణించాయి. యుద్ధ భయాలతో మార్కెట్ బేర్‌మనడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.9.78 లక్షల కోట్లు తగ్గి రూ.465.07 లక్షల కోట్లకు (5.54 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ మినహా అన్నీ నష్టపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ మళ్లీ కొండెక్కుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.66 శాతం పెరుగుదలతో 75.13 డాలర్ల వద్దకు చేరింది.

కేఆర్ఎన్ బంపర్ లిస్టింగ్

మార్కెట్ భారీగా నష్టపోయినప్పటికీ, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ లిస్టింగ్ మాత్రం దుమ్మురేపింది. ఐపీఓ ధర రూ.220తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 113.63 శాతం ప్రీమియంతో రూ.470 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 125.90 శాతం ఎగబాకినప్పటికీ, తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు 117.48 శాతం లాభంతో రూ.478.45 వద్ద స్థిరపడింది.

14 నుంచి హ్యుండయ్ రూ.25,000 కోట్ల ఐపీఓ

దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుండయ్‌కి భారత అనుబంధ విభాగమైన హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.25,000 కోట్ల మెగా ఐపీఓ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఐపీఓలో భాగంగా హ్యుండయ్ తన మాతృసంస్థ వాటాకు చెందిన 14,21,94,700 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. దేశంలో ఇదే

సెన్సెక్స్ 50, బ్యాంకెక్స్ వీక్లీ కాంట్రాక్టులకు స్వస్తి

సెన్సెక్స్ 50, బ్యాంకెక్స్ వీక్లీ ఇండెక్స్ డెరివేటివ్ కాంట్రాక్టులను నిలిపివేయనున్నట్లు బీఎస్ఈ ప్రకటించింది. వచ్చే నెల 14 నుంచి సెన్సెక్స్ 50 ఇండెక్స్ కాంట్రాక్టులకు, 18 నుంచి బ్యాంకెక్స్ కాంట్రాక్టులను నిలిపివేయనున్నట్లు గురువారం విడుదల చేసిన సర్క్యులర్‌లో బీఎస్ఈ స్పష్టం చేసింది. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తాజా ఆదేశాలకు అనుగుణంగా స్టాక్ ఎక్స్ఛేంజీ ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు సెబీ మంగళవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఎక్స్ఛేంజీలు ఒక ఇండెక్స్‌లో మాత్రమే వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టులను ఆఫర్ చేసేందుకు అనుమతించనున్నట్లు సెబీ స్పష్టం చేసింది. కాంట్రాక్టుల ముగింపు తేదీన స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నిరోధించడంతో పాటు మార్కెట్లో ఊగిసలాటలను తగ్గించేందుకు నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకుంది.

రూ.320 కోట్లతో మనాక్సియా కోటెడ్ మెటల్స్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీ మనాక్సియా కోటెడ్ మెటల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎంసీఎంఐఎల్) కార్యకలాపాల విస్తరణకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా రూ.320 కోట్ల పెట్టుబడితో గుజరాత్, కచ్‌లోని గాల్వనైజ్డ్ స్టీల్ కాయిల్స్, ప్రీ-పెయింటెడ్ స్టీల్ కాయిల్స్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ అగర్వాల్ వెల్లడించారు. విస్తరణలో భాగంగా గాల్వనైజ్డ్ స్టీల్ కాయిల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 1,32,000 ఎంటీపీఏ నుంచి 1,80,000 ఎంటీపీఏకు, ప్రీ-పెయింటెడ్ స్టీల్ కాయిల్స్ ఉత్పత్తిని 80,000 ఎంటీపీఏ నుంచి 2,36,000 ఎంటీపీఏకు పెంచుకోనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే రూ.30 కోట్లతో 8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన క్యాప్టివ్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా కంపెనీ మొత్తం విక్రయాల్లో ఎగుమతుల వాటా 35 శాతంగా ఉందని. తాజాగా యూరోపియన్ కంపెనీ నుంచి రూ.200 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు చెప్పారు. ఆర్డర్‌లో భాగంగా ప్రీమియం ప్రీ-పెయింటెడ్ స్టీల్ కాయిల్స్, అలు జింక్ కోటెడ్ స్టీల్ కాయిల్స్ సహా గాల్వనైజ్డ్ స్టీల్ ప్రొడక్స్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని అగర్వాల్ తెలిపారు.

బిజినెస్

పెరిగిన సిమెంట్ ధర

బస్తాపై రూ.30 వరకు పెంపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణాది రాష్ట్రాల్లో సిమెంట్ ధరల పెరుగుదల ప్రారంభమైంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 50 కిలోల బస్తా సిమెంట్ ధర.. కంపెనీ, బ్రాండ్‌ను బట్టి రూ.250 నుంచి రూ.300 వరకు ఉండేది. గురువారం నుంచి ఇది మరో రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగింది. తమిళనాడు మార్కెట్లోనూ బస్తా సిమెంట్ ధర రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగింది. కొన్ని కంపెనీలు మాత్రం ఈ ధరల పెంపునకు దూరంగా ఉన్నట్టు సమాచారం. డిమాండ్ ఇంకా అంతంత మాత్రంగానే ఉన్నందున ఈ కంపెనీలు మరికొద్ది రోజులు వేచి చూసి నవంబరు నుంచి ధరలు పెంచడం మేలని భావిస్తున్నట్టు సమాచారం.


చిన్న నగరాల్లోనూ రోబోటిక్ సర్జరీలు

కిమ్స్ హాస్పిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) రోబోటిక్ సర్జరీల కార్యక్రమాల్ని చిన్న నగరాలకూ విస్తరిస్తోంది. ఇందుకోసం ఇన్‌ట్యూటివ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా కిమ్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, మహారాష్ట్రల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 25 రోబోటిక్ సర్జరీ కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది.

'అపోలో క్లినిక్స్'కు ఐఎఫ్‌సీ గుడ్‌బై !

ముంబై: అనుబంధ సంస్థ అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) ఈక్విటీలో కొంత వాటాను విక్రయించాలని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) భావిస్తున్నట్టు సమాచారం. ఏహెచ్ఈఎల్ అపోలో క్లినిక్స్ పేరుతో కొన్ని క్లినిక్స్, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు నిర్వహిస్తోంది. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఈ కంపెనీ ఈక్విటీలో ప్రస్తుతం ప్రపంచ బ్యాంక్ అనుబంధ సంస్థ ఐఎఫ్‌సీకి 31 శాతం వాటా ఉంది. ఈ వాటాతో పాటు ఏహెచ్ఈఎల్ కూడా తన వాటాలో కొద్ది మొత్తాన్ని విక్రయించేందుకు వివిధ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,560 ▲	71,100 ▲	1,01,000 ▲
ముంబై	75,615 ▲	69,263 ▲	90,671 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	



ఫామ్‌గేట్ ధర | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	118
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	113
కర్నూలు	112	నెల్లూరు	113
విశాఖపట్నం	112	అనంతపురం	113
గోదావరి	118		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


శుక్రవారం | 4-10-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 188 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

వైవాహిక అత్యాచారం నేరం కాదు

భార్య అనుమతి లేకుండా జరిపే శృంగారాన్ని క్రిమినల్ చర్యగా పరిగణించలేం 2

నేరంగా గుర్తిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం

వైవాహిక అత్యాచారంపై ఇతర చట్టాల ప్రకారం కేసులు పెట్టొచ్చు.. సుప్రీంకోర్టులో కేంద్రం





సురేఖపై నాగార్జున పరువు నష్టం

క్రిమినల్ చర్య తీసుకోవాలని కోర్టులో దావా

సురేఖ వ్యాఖ్యలపై పలువురు సినీ ప్రముఖుల ఆగ్రహం

ఇక్కడితో ముగింపు పలకండి: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విజ్ఞప్తి

కేటీఆర్ కించపరిచేలా మాట్లాడినందువల్లే నేను అలా అనాల్సి వచ్చింది.. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

అనుకోకుండా ఒక కుటుంబం గురించి మాట్లాడాను

నా వ్యాఖ్యలు వారిని నొప్పించాయని తెలిసి బాధపడ్డా

సమంత మనోభావాల్ని దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు: సురేఖ

వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తనపైన, తన కుటుంబంపైన, నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపైన వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై నటుడు అక్కినేని నాగార్జున పరువు నష్టం దావా వేశారు. నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో ఒక ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. సెక్షన్ 222 ఆర్/డబ్ల్యూ, 223 బీఎన్ఎస్ఎస్, 356 బీఎన్ఎస్ కింద ఆయన ఈ పిటిషన్ వేశారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఎంతో పేరుగాంచిన తమ (అక్కినేని) కుటుంబంపై మంత్రి చేసిన అసత్య వ్యాఖ్యల వల్ల

మిగతా 12వ పేజీలో...

సురేఖపై ట్రోలింగ్.. కేటీఆర్, హరీశ్ మీద సైబర్ క్రైం కేసు

పేదలను కవచంగా వాడుకుంటున్నారు

ఫాంహౌస్‌లు కూలుతాయన్న భయంతోనే.. వెనుకడుగు వేసేదే లేదు

కేటీఆర్, హరీశ్, సబిత కుమారుల ఫాంహౌస్‌లు కూల్చొద్దా?

హైడ్రాపై అసెంబ్లీలో చర్చ పెడితే బీఆర్ఎస్ నోరు మెదపలేదేం?

ఇప్పుడు మొసలి కన్నీరా? ప్రజలంతా గమనిస్తున్నారు

చెరువుల్లో, మూసీలో ప్లాట్లు చేసి కోట్లు సంపాదించుకున్నరు

నిర్వాసితులకు ఇల్లు, రూ.25 వేలు ఇవ్వడం తప్పంటారా?

బురదలో కూరుకుపోతున్న హైదరాబాద్‌ను మేం కాపాడుతుంటే బావా బావమరుదులు విషం కక్కుతారా?

అఖిలపక్షం పెడతాం.. కేటీఆర్, హరీశ్ వచ్చి సలహాలివ్వాలి

ప్రధాని మోదీకి ఈటల రాజేందర్ ఊడిగం చేస్తున్నారు

మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకోవచ్చుగానీ.. ఇక్కడ మూసీ సుందరీకరణ వద్దా?: ముఖ్యమంత్రి రేవంత్

ఒకే రాష్ట్రం-ఒకే కార్డు పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం ప్రారంభం

అన్ని సంక్షేమ పథకాలకు ఇకపై ఇదే కార్డు అని సీఎం వెల్లడి



'ఒకే రాష్ట్రం-ఒకే కార్డు' కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి తదితరులు

సికింద్రాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మించుకున్న తమ ఫాంహౌస్‌లు కూలుతాయన్న భయంతోనే బీఆర్ఎస్ నేతలు పేదలను రక్షణ కవచంగా వాడుకుంటూ నాటకాలాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. నల్ల చెరువులో, సున్నం చెరువులో, మూసీ ఒడ్డున ప్లాట్లు చేసి ప్రజలకు విక్రయించి, రూ.కోట్లు సంపాదించింది బీఆర్ఎస్ నాయకులు కాదా? నగరం

మిగతా 13వ పేజీలో...

భవిష్యత్తులో మొత్తం సన్నాల సాగే!

ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్... 48 గంటల్లో జమ

కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం

హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

13 'సీఎం కప్'లో రేవంత్

ఎమ్మెల్యేల అనర్హత కేసు..

అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టులో స్వల్ప ఊరట

డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకునే వరకూ కోర్టుధిక్కరణ చర్యల నుంచి రక్షణ

సింగిల్ జడ్జి ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరుతూ కార్యదర్శి అప్పీలు 13

ఇవ్వలేమన్న ధర్మాసనం.. 24న తుది విచారణ చేపడతామని వెల్లడి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ మారినవారు సహా ప్రతివాదులందరికీ నోటీసులు

రాష్ట్రంలో డీజేల మోత బంద్!

వేడుకలు, ర్యాలీల్లో డీజే వాడకంపై నిషేధం

ప్రభుత్వానికి పోలీసు శాఖ ప్రతిపాదన 3

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు రాగి జావ

వారంలో 3 రోజుల పాటు.. సర్కారు ఆదేశాలు



లక్ష కోట్ల వ్యవసాయం

2 సాగు పథకాలకు కేంద్రం ఆమోదం

పీఎం రాష్ట్రీయ కృషి వికాస్, కృషోన్నతి.. అన్ని వ్యవసాయ స్కీంలూ వీటి కిందికే

వంట నూనెల్లో స్వయం సమృద్ధి సాధనకు రూ.10 వేల కోట్లతో మిషన్ ఏర్పాటు

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

మరాఠీ, బెంగాలీ, అస్సామీ, పాళీ, ప్రాకృతి భాషలకు ప్రాచీన హోదా

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు 2

వీఆర్‌కు ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలు

ఇసుక రవాణా కట్టడిలో అలసత్వం

మల్టీ జోన్-2 పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులపై ఐజీ చర్యలు

నిఘా విభాగం నివేదిక ప్రకారం.. 12

పేదల ఇళ్ల జోలికొస్తే సర్కారు కూలుతుంది 11

డ్రైనేజీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం చూపండి

అది లేకుండా మూసీ సుందరీకరణా?

బుల్డోజర్లు దింపితే బీజేపీ చూస్తూ ఊరుకోదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఛత్తీస్‌గఢ్‌లో ఉత్తుత్తి బ్యాంకు!

- ఎస్బీఐ పేరుతో రాత్రికి రాత్రే నకిలీ బ్యాంకు
- కొలువుల పేరుతో లక్షల్లో వసూలు
- తెరిచిన 10రోజుల్లోనే గుట్టురట్టు

రాయ్‌పూర్, అక్టోబరు 3: వినోదం సినిమా గుర్తుందా? అందులో రాత్రికి రాత్రే 'ఉత్తుత్తి బ్యాంక్' పెట్టేసి.. కోటా శ్రీనివాసరావు నుంచి డిపాజిట్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బును స్వాహా చేయడం! తెర మీద ఈ సీన్ నవ్వులు పూయించినా ఛత్తీస్‌గఢ్‌లో నిజంగానే కొందరు ఉత్తుత్తి బ్యాంక్ తెరవడం స్థానికులను నోరెళ్లబెట్టేలా చేసింది. ఆ నకిలీ బ్యాంకుకు ఏకంగా ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ ఎస్బీఐ పేరు తగిలించారు! ఆ బ్యాంకులోకి వెళితే అద్భుతమైన ఫర్నిచర్, ఇంటీరియర్‌తో మేనేజర్ క్యాబిన్, క్యాషియర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మార్కెటింగ్ మేనేజర్ల కోసం కళ్లు చెదిరేలా ఉన్న ఏర్పాట్లు చూస్తే అసలది నకిలీ బ్యాంకు అని అనుమానం వస్తే ఒట్టుండాలి! ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి 250 కిలోమీటర్ల దూరంలో శక్తి జిల్లా చపోరా గ్రామంలో ఓ నలుగురు కేటుగాళ్లు కలిసి సెప్టెంబరు 17న ఈ 'నకిలీ ఎస్బీఐ బ్యాంకు'ను తెరిచారు. ఓ భవనాన్ని నెలకు రూ.7వేల అద్దెకు తీసుకున్నారు. బాజాప్తాగా ఎస్బీఐ బ్యాంకు లోగోతో పెద్దగా బోర్డు పెట్టారు. పైగా నెలకు రూ35వేల చొప్పున జీతమిస్తామని చెబుతూ ఉద్యోగాల పేరుతో యువతీయువకుల నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల దాకా వసూలు చేశారు. వారికి శిక్షణ కూడా ఇచ్చారు. పూర్తిస్థాయిలో లావాదేవీలు మొదలయ్యాక బ్యాంకు రుణాలు ఇస్తామని చెప్పడంతో స్థానిక రైతులు సంతోషించారు. మరి.. మరికొన్నాళ్లయితే ఆ ఊరోళ్లు.. సమీప గ్రామాల ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు రూపంలో కేటుగాళ్లు కొల్లగొట్టేవారేమో! అయితే తెరిచిన పది రోజుల్లోనే ఈ నకిలీ బ్యాంకు గుట్టు రట్టయింది. ఈ నకిలీ బ్యాంకుకు ఐఎఫ్ఎస్‌సీ నంబరు లేకపోవడంతో చపోరా గ్రామంలోని కొందరికి ఈ బ్యాంకుపై అనుమానం వచ్చింది. సమీపంలోని దబ్రా గ్రామంలో ఎస్బీఐ శాఖ ఉండటంతో వారు అక్కడికి వెళ్లి కొత్తగా పుట్టుకొచ్చిన ఈ బ్యాంకు గురించి ఆరా తీశారు. ఆ బ్యాంక్ మేనేజర్ తన వెంట పోలీసులను కూడా తీసుకొచ్చాడు. లోపలికి వెళ్లి మేనేజర్ కాని ఆ మేనేజర్‌ను ప్రశ్నించడంతో అంతా బట్టబయలైంది. మేనేజర్ స్థానంలో ఉన్న వ్యక్తి సహా నలుగురు ఈ 'నకిలీ బ్యాంకు' వెనుక సూత్రధారులు అని పోలీసులు నిర్ధారించారు. నిందితులను అరెస్టు చేశారు.

వైద్యం కోసం వచ్చి వైద్యుడిని చంపిన టీనేజర్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: ఢిల్లీలో దారుణం జరిగింది. ఇద్దరు టీనేజర్లు వైద్యం కోసమంటూ వచ్చి వైద్యుడినే చంపేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 16 ఏళ్ల వయసున్న ఇద్దరు అబ్బాయిలు బుధవారం అర్ధరాత్రి దాటాక కాలి గాయాలకు డ్రస్సింగ్ చేయించుకోవడం కోసమంటూ కాళింది కుంజ్ ప్రాంతంలోని నిమా అనే ఆస్పత్రికి వచ్చారు. చికిత్స తీసుకున్న అనంతరం వైద్యుడు జావేద్ అక్తర్ క్యాబిన్‌కు వెళ్లి ఆయనపై కాల్పులు జరిపారు. కాల్పుల శబ్దానికి అక్కడికి వచ్చిన ఆస్పత్రి సిబ్బందికి జావేద్ రక్తపుమడుగులో విగత జీవిగా కన్పించారు. వ్యక్తిగత కక్షల కారణంగానే పథకం ప్రకారం వైద్యుడిని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

లోకం తీరు



హరియాణాలో ముగిసిన ప్రచారం

- రేపు రాష్ట్రంలోని 90 నియోజకవర్గాలకు పోలింగ్



చండీగఢ్, అక్టోబరు 3: రైతుల ఉద్యమాలు.. రెజ్లర్ల ఆందోళనలతో తరచూ వార్తల్లో నిలిచిన హరియాణాలో అత్యంత కీలకమైన ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ.. కచ్చితంగా గెలవాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్ హోరాహోరీగా తలపడుతున్న ఈ రాష్ట్రంలో శనివారం పోలింగ్ జరగనుంది. మొత్తం 90 స్థానాలకూ ఒకే విడతలో ఓటింగ్ నిర్వహించనున్నారు. 20,269 పోలింగ్ బూత్‌లలో కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సభలో చివరి రోజు అన్ని పార్టీల నేతలు ప్రచారాన్ని హోరెత్తించారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధానంగా పోటీ ఉన్నా వీటికి తిరుగుబాటు అభ్యర్థుల నుంచి తలనొప్పి ఎదురవుతోంది. కాంగ్రెస్‌తో సీట్ల పంపకం కుదరకపోవడంతో ఆప్ ఒంటరిగా బరిలో దిగింది. కాగా, సీనియర్ నాయకుడు, శిర్సా మాజీ ఎంపీ అశోక్ తన్వర్ అనూహ్యంగా బీజేపీకి రాజీనామా చేసి మహేంద్రగఢ్ జిల్లాలో అగ్ర నేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకు కొన్ని గంటల ముందు వరకు కూడా తన్వర్ సఫీదన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేయడం గమనార్హం.

కుమారస్వామి 50 కోట్లు డిమాండ్ చేశారు

- రియల్టర్ విజయ్ టాటా ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కుమారస్వామి తనను రూ.50 కోట్లు అడిగారని బెంగళూరుకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి విజయ్‌టాటా సంచలన ఆరోపణలు చేశారు. కుమారస్వామితో పాటు జేడీఎస్ నేత రమేశ్‌గౌడపై అమృతహళ్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. 'జేడీఎస్ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ మా ఇంటికి వచ్చారు. చన్నపట్టణ ఉప ఎన్నికల్లో నిఖిల్ పోటీ చేస్తున్నారని తెలిపారు. అదే సమయంలో కుమారస్వామితో ఫోన్‌లో మాట్లాడించారు. ఎన్నికల కోసం రూ.50 కోట్లు ఇవ్వాలని అడిగారు. నేను ఇవ్వలేనని చెప్పడంతో కుమారస్వామి కోపగించుకున్నారు. వదిలేది లేదని బెదరించారు' అని అన్నారు. ఫిర్యాదుపై పోలీసులు నాన్ కాగ్నిజబుల్ రిపోర్ట్(ఎన్‌సీఆర్) నమోదు చేశారు.

దుర్గా పూజపై బంగ్లాదేశ్‌లో ఆంక్షలు

- జిజియా పన్ను చెల్లించాలని నిర్వాహకులకు హుకుం

ఢాకా, అక్టోబరు 3: బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనుస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి మైనార్టీలపై హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు ఇప్పుడు దుర్గాపూజోత్సవాలపై ఆంక్షలు విధించారు. పూజలు నిర్వహించుకోవాలంటే రూ.5 లక్షలు జిజియా పన్ను చెల్లించాలని అజాన్, నమాజ్ సమయంలో సంగీత వాయిద్యాలు వాయించరాదని కూడా హుకుం జారీ చేశారు. చాలా చోట్ల అనుమతి కూడా నిరాకరిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని డెయిలీ స్టార్ పత్రిక కథనం ప్రకారం దుర్గా పూజలు నిర్వహించుకోవాలంటే రూ.5 లక్షలు జిజియా పన్ను చెల్లించాలంటూ నిర్వాహక కమిటీలకు బెదిరింపు లేఖలు అందాయి. దీనికి సంబంధించి ఖుల్నాలోని డకోప్ ప్రాంతంలో పలు హిందూ దేవాలయ ప్రతినిధులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌నుంచి ఆదేశ హై కమిషనర్ ముస్తఫిజుర్ రెహమాన్‌ను వెనక్కి పిలిపించుకుంది. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ తౌహిద్ హుసేన్‌తో భారత హై కమిషనర్ ప్రణయ్ వర్మ చర్చలు జరిపిన మరుసటి రోజే ఈ నిర్ణయం తీసుకుంది.

కారాగారాల్లో కుల వివక్ష సరికాదు

- జైళ్ల నిబంధనలు మార్చాలని సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: జైళ్లలో కులం ఆధారంగా ఖైదీలకు పనులు కేటాయించడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చింది. కులాల ఆధారంగా ఖైదీలను ప్రత్యేక వార్డుల్లో ఉంచడం, పనుల కేటాయింపులోనూ కుల వివక్ష చూపడంపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న పలు రాష్ట్రాల తీరును తప్పుపట్టింది. ఇలాంటి వివక్షను అడ్డుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. జైళ్లలో కుల వివక్ష చూపుతున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కారాగారాల్లో కులం ఆధారంగా ఊడవడం, మురుగు శుభ్రం చేయడం వంటి పనులు అప్పగిస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల వారికి మురుగు శుభ్రం చేయడం, ఊడవడం వంటి పనులు చెబుతున్నారని.. అగ్రవర్ణాల వారికి వంట పనులు వంటివి అప్పగిస్తున్నారని తెలిపారు. జైళ్లలో కుల వివక్ష సరికాదని, అది రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది. కుల వివక్షను అడ్డుకోవడంలో రాష్ట్రాలు సానుకూల దృక్పథంతో పనిచేయాలని తీర్పులో స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రాలు జైళ్ల నిబంధనల్లో మార్పులు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అందుకు మూడు నెలల గడువు ఇచ్చింది.

వైవాహిక అత్యాచారం నేరం కాదు

- భార్య అనుమతి లేకుండా జరిపే శృంగారాన్ని క్రిమినల్ చర్యగా పరిగణించలేం.. సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: భార్య అనుమతి లేకుండా భర్త ఆమెతో శారీరక సంబంధం పెట్టుకోవడాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించాలన్న వినతిని గురువారం కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దాన్ని కూడా రేప్‌గా గుర్తించి అందుకు అనుగుణంగా శిక్ష వేస్తే అది అత్యంత తీవ్రమైన చర్య అవుతుందని తెలిపింది. దీన్ని 'వైవాహిక అత్యాచారం'గా భావించవచ్చని, కానీ క్రిమినల్ నేరంగా గుర్తించలేమని పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను సమర్పించింది. భార్య సమ్మతిలేని శారీరక సంబంధాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లకు సమాధానంగా కోర్టుకు ఆ అభిప్రాయాన్ని తెలిపింది. వైవాహిక అత్యాచారం సామాజిక సమస్య అని, చట్టపరమైన అంశం కాదని పేర్కొంది. ఒకవేళ దీన్ని క్రిమినల్ నేరంగా గుర్తిస్తే అది సమాజంపై ప్రభావం చూపిస్తుందని తెలిపింది. అలాంటి సమస్య తలెత్తితే ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారమే శిక్షించే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. గృహ హింసపై చట్టం కింద కేసు పెట్టవచ్చని తెలిపింది. రాష్ట్రాలు, భాగస్వాములు, అన్ని వర్గాలతో తగిన చర్చలు లేకుండా ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోలేమని స్పష్టం చేసింది. వివాహం కాకముందు మహిళ సమ్మతి లేకుండా శారీరక సంబంధం పెట్టుకోవడం తీవ్రమైన నేరమని, అదే వివాహ వ్యవస్థలో పరిస్థితి వేరుగా ఉంటుందని తెలిపింది. అయితే వివాహిత అనుమతి తీసుకోవాల్సిన పనిలేదన్న భావన సరికాదని, ఒకవేళ అలాంటి చర్యకు పాల్పడితే శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. భర్త ద్వారా కలిగిన అవాంఛిత గర్భాన్ని తొలగించే విషయమై 2022లో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ తొలిసారిగా 'వైవాహిక అత్యాచారం' అన్న భావనను ప్రస్తావించింది. దీనిని నేరంగా గుర్తిస్తూ గర్భస్రావానికి అనుమతి ఇచ్చింది. దానినీ రేప్‌లాగానే తీవ్రమైన నేరంగా పరిగణించాలని కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి.

లక్ష కోట్ల వ్యవ'సాయం'

రెండు సాగు పథకాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ, అక్టోబరు 3: దేశంలో సుస్థిర వ్యవసాయానికి ప్రోత్సాహం.. ఆహార భద్రత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. రూ.లక్ష కోట్లపైగా వ్యయంతో రెండు వ్యవసాయ పథకాల అమలుకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన గురువారం క్యాబినెట్ సమావేశమైంది. ఇందులో.. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పీఎంఆర్కేవీవై), కృషోన్నతి యోజన (కేవై)లకు పచ్చజెండా ఊపింది. కేంద్ర వ్యవసాయ శాఖ కింద అమలవుతున్న దాదాపు 18 పథకాలను హేతుబద్ధీకరించి ఇకపైన రెండు కొత్త పథకాల పరిధిలోకి తీసుకురానున్నారు. పీఎంఆర్కేవీవై సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించినది. కేవై.. ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధికి నిర్దేశించినది. మొత్తం 1,01,321 కోట్లతో అమలు చేయనున్నారు. దీంట్లో కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వ్యయం రూ.69,088 కోట్లు కాగా, రాష్ట్రాలది రూ.32,232 కోట్లు. రూ.57,074 కోట్లను ఆర్కేవీవై కింద, రూ.44,246 కోట్లను కేవీ కింద కేటాయించనున్నారు. పాత 18 పథకాలనూ కలిపి కొత్త స్కీంల కింద రాష్ట్రాల ద్వారా అమలు చేస్తారు. తద్వారా ఇప్పటికే ఉన్న పథకాల ప్రయోజనాలను కొనసాగించినట్లు అవుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. పథకాల హేతుబద్ధీకరణ ద్వారా రాష్ట్రాల వ్యవసాయ రంగానికి సంబంధించి సమగ్ర వ్యూహ పత్రాన్ని సిద్ధం చేసేందుకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొంది. ఒకే విధమైన రెండు పథకాల (డూప్లికేషన్)కు ఇకపై ఉండదని వివరించింది.

ఐదు భాషలకు ప్రాచీన హోదా

త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర ప్రజలు మాట్లాడే మరాఠీతో పాటు బెంగాలీ, అస్సామీ, పాళీ, ప్రాకృతి భాషలకు కేంద్రం ప్రాచీన హోదా కల్పించింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, సంస్కృతం, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు ఈ హోదా ఉంది. మోదీ ప్రభుత్వం వచ్చాక ప్రాంతీయ భాషలకు ప్రాచీన హోదా ఇవ్వడం ఇదే తొలిసారి. 2004లో తమిళానికి తొలిగా, చివరగా 2014లో ఒడియాకు ఈ హోదా ఇచ్చారు. కాగా, దేశీయంగా వంట నూనె గింజల ఉత్పత్తి పెంపు, స్వయం సమృద్ధి సాధనకు రూ.10,103 కోట్లతో జాతీయ వంట నూనెలు- నూనె గింజల మిషన్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రస్తుతం మన దేశం 50 శాతం పైగా వంట నూనెలను దిగుమతి చేసుకుంటోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు జాతీయ మిషన్ ఉపయోగపడనుంది. ఏడేళ్ల కాలావధికి దీనిని అమలు చేయనున్నారు. ప్రస్తుతం 39 మిలియన్ టన్నులుగా ఉన్న వంట నూనె గింజల ఉత్పత్తి 2030-31 నాటికి 69.7 మిలియన్ టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం అదనంగా 40 లక్షల హెక్టార్లలో వంట నూనె గింజల సాగును ప్రోత్సహించనున్నారు.

రైల్వే ఉద్యోగులకు బోనస్ బొనాంజా

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పండుగ బోనస్‌ను ప్రకటించారు. 11.71 లక్షల మంది రైల్వే సిబ్బందికి రూ.2028.57 కోట్లను ఉత్పాదక అనుసంధానిత బోనస్‌గా చెల్లించనున్నారు. వీటితో పాటు చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశ మూడు కారిడార్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 118.9 కిలోమీటర్ల మార్గంలో 128 స్టేషన్లతో కూడిన ఈ కారిడార్లలో.. మాధవరం-సిప్‌కాట్ (45.8 కి.మీ. 50 స్టేషన్లు), లైట్ హౌస్-పూనమల్లి బైపాస్ (26.1 కిలోమీటర్లు-30 స్టేషన్లు), మాధవరం-షోలింగనల్లూర్ (47 కి.మీ.-48 స్టేషన్లు) ఉన్నాయి. రూ.63,246 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును 2027 నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం. ప్రధాన పోర్టులు, డాక్ లేబర్ బోర్డు ఉద్యోగుల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంలో మార్పులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2020-21 నుంచి 2025-26 అమల్లో ఉండనుంది. 20,704 మందికి దీని ద్వారా ప్రయోజనం చేకూరనుంది. అంతర్జాతీయ ఇంధన హబ్‌లో చేరే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో 16 దేశాల కూటమిలో ప్రవేశించనుంది. వ్యూహాత్మక ఇంధన విధానాలు, సరికొత్త పరిష్కారాలకు ఇది అవకాశం కల్పిస్తుంది.

కేకుల్లో క్యాన్సర్ కారకాలు

- బ్లాక్ ఫారెస్ట్, రెడ్ వెల్వెట్‌లు ప్రమాదకరం
- బెంగళూరులో 235 శాంపిళ్లను పరీక్షించిన ప్రభుత్వం
- 12 శాంపిళ్లలో హానికర పదార్థాలు ఉన్నట్లు వెల్లడి

బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేకులంటే మీకు ఇష్టమా? బ్లాక్ ఫారెస్ట్, రెడ్ వెల్వెట్ వంటి కంటికి ఇంపుగా కనిపించే కేక్స్ చూస్తే తినకుండా ఉండలేని బలహీనత మీకు ఉందా? అయితే మీ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లే. మీకు క్యాన్సర్ వచ్చే చాన్స్ ఎక్కువ అవుతున్నట్లే. కర్ణాటక ఆహార భద్రత, నాణ్యత శాఖ ఈమేరకు గురువారం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రజలు అత్యధికంగా ఇష్టపడే కేకుల్లో అనారోగ్య కారకాలైన రసాయనాలు ఉన్నట్లు పేర్కొంది. కాటన్ క్యాండీ, గోబీ మంచూరియాల్లో వాడే 'రోడమైన్ బీ' వంటి కృత్రిమ రంగుల్లో ఆరోగ్యానికి హాని చేసే కారకాలు ఉన్నాయంటూ కర్ణాటక ప్రభుత్వం వాటిపై నిషేధం విధించింది. తాజాగా బెంగళూరు నగరంలో వివిధ బేకరీల నుంచి 235 కేక్ శాంపిళ్లను అధికారులు సేకరించారు. వాటిని ల్యాబ్స్‌లో పరీక్షించారు. వాటిలో 12 కేకు శాంపిళ్లలో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. రెడ్ వెల్వెట్, బ్లాక్ ఫారెస్ట్ కేకుల్లో వాడే కంటికి ఇంపైన రంగులు ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య శాఖ పేర్కొంది. బేకరీలు ఆరోగ్య భద్రతా ప్రమాణాలను పాటించాలని, కేకుల్లో అల్లూరా రెడ్, సన్‌సెట్ యెల్లో ఎఫ్‌సీఎఫ్, పోన్సెయూ 4 ఆర్, టార్ట్రాజైన్, కార్మోయిసన్ వంటి రంగులు వాడవద్దని హెచ్చరించింది. ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల విభాగం మార్గదర్శకాలను బేకరీలు పాటించాలని అధికారులు ఆదేశించారు.

భారత్ వాంటెడ్‌కు పాక్ వెల్‌కమ్

- 2016నుంచి పరారీలో జకీర్ నాయక్
- హఠాత్తుగా పాకిస్థాన్‌లో జకీర్ ప్రత్యక్షం
- హిందువులు, సాధువులు ఎద్దుమాంసం తింటారంటూ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: పలు కేంద్ర సంస్థల విచారణను ఎదుర్కొంటూ, అరెస్టును తప్పించుకోవడానికి 2016లో దేశం విడిచి మలేసియా పారిపోయిన వివాదాస్పద ఇస్లామ్ మత ప్రబోధకుడు జకీర్ నాయక్‌కు పాకిస్థాన్ స్వాగతం పలకడం తీవ్ర కలకలం రేపుతోంది. భారత్‌పై నోరు పారేసుకునే సిక్కు ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నట్టేగానే, ముస్లింలను రెచ్చగొట్టడానికి జకీర్ నాయక్‌ను కూడా పాకిస్థాన్ తన దేశంలోకి ఆహ్వానించిందని భారత ఉన్నత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. "పలు కేసుల్లో ఈడీ, ఎన్ఐఏ వెతుకుతున్న నేరగాడు పాకిస్థాన్‌కు అతిథి అయ్యాడు. నెల రోజుల ఆయన పర్యటన కోసం ప్రభుత్వ భద్రతను కల్పించారు. పరారీలో ఉన్న వ్యక్తిని పాక్ ప్రధాని స్వయంగా కలుస్తుండటం ఇంకా ఆశ్చర్యంగొలిపే విషయం. పాక్ గూఢచార్య సంస్థ ఐఎస్ఐ అనుమతితోనే ఆయన అక్కడ పర్యటనకు వెళ్లారు" అని ఈ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పాకిస్థాన్ మీడియాకు జకీర్ నాయక్ ఇస్తున్న ఇంటర్వ్యూలను, అందులో హిందువులు, సాధువులపై చిమ్ముతున్న విషాన్ని నిఘా వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. "భారత్‌లో హిందువులు కూడా ఎద్దు మాంసం తింటారు. ఆ విషయం వాళ్ల గ్రంథాల్లోనే రాసుకున్నారు. చివరకు హిందువులు పూజించే గురువులు, సాధువులు సైతం ఎద్దు, మేక మాంసం తింటారు" అని పాక్ మీడియాకు జకీర్ తెలిపారు.

యువతలో నైపుణ్యాభివృద్ధికి..

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభం

రూ.800 కోట్ల అంచనా వ్యయంతో పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం.. ఐదేళ్లలో 21-24 వయసులోని కోటి మందికి శిక్షణ

- టాప్-500 కంపెనీల్లో పని నేర్చుకునే చాన్స్
- అక్టోబరు 12నుంచి వివరాల నమోదు
- నెలకు రూ.5 వేల చొప్పున స్టైపెండ్
- వన్ టైమ్ గ్రాంట్ కింద మరో రూ.6వేలు



న్యూఢిల్లీ, అక్టోబరు 3: పెద్ద పెద్ద చదువులు చదివినా ఉద్యోగాలు రావట్లేదని వాపోతారు నిరుద్యోగులు! 'మా దగ్గర బోలెడన్ని ఉద్యోగాలున్నాయి.. కానీ, తగిన నైపుణ్యాలున్న అభ్యర్థులే దొరకట్లేదు' అంటా యి కంపెనీలు! చదివిన చదువుకు వాస్తవ ఉద్యోగ/వ్యాపార వాతావరణానికి పొంతన లేకపోవడం.. యువతలో ఆయా ఉద్యోగాలు చేసేంత నైపుణ్యాలు లేకపోవడమే ఈ సమస్యకు కారణం. ఈ నేపథ్యంలో యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఈ సమస్యను పరిష్కరించే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన 'పీఎం ఇంటర్న్‌షిప్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం పైలట్ ప్రాతిపదికన ప్రారంభించింది. వచ్చే ఐదేళ్లలో 21-24 సంవత్సరాల వయసులో ఉన్న కోటి మంది యువతీయువకులకు.. టాప్-500 కంపెనీల్లో ఏడాదిపాటు క్షేత్రస్థాయిలో పని నేర్చుకునే అవకాశం కల్పించడమే ఈ పథకం లక్ష్యం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద.. గడిచిన మూడేళ్లలో చేసిన వ్యయం ఆధారంగా టాప్-500 కంపెనీలను కేంద్రం గుర్తించి, వాటి ద్వారా యువతకు ఈ పథకం కింద ఇంటర్న్‌షిప్ సౌకర్యాన్ని కల్పించనుంది. ఇంటర్న్‌గా ఉన్న సమయంలో అభ్యర్థులకు నెలకు రూ.5000 చొప్పున స్టైపెండ్, దానికి అదనంగా వన్‌టైమ్ గ్రాంట్ కింద రూ.6000.. మొత్తం కలిపి ఏడాదికి రూ.66 వేల ఆర్థికసాయం అందుతుంది. ఇంటర్న్‌లకు ప్రతి నెలా ఇచ్చే రూ.5 వేలల్లో రూ.4,500ను కేంద్రం భరిస్తుంది. ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో అభ్యర్థి ఖాతాలో వేస్తుంది. మిగతా రూ.500, శిక్షణకు సంబంధించిన ఖర్చులను ఆయా కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి ఇస్తాయి. అలాగే, ఇంటర్న్‌షిప్‌లో చేరగానే ఇచ్చే వన్‌టైమ్ గ్రాంట్ రూ.6వేలను కూడా కేంద్రమే ఇస్తుంది. రూ.800 కోట్ల ఖర్చుతో ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్ కింద 2025 మార్చి 31తో ముగిసే ఈ ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల మందికి డిసెంబరు 2 నుంచి ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించనున్నారు.

- ఆశావహులు.. అక్టోబరు 12 నుంచి 25 దాకా ఈ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. 26న తుదిజాబితా ప్రకటిస్తారు.
- అక్టోబరు 27 నుంచి నవంబరు 7 దాకా.. కంపెనీలు ఆ తుది జాబితాలో నుంచి తమకు తగిన అభ్యర్థులను ఎంచుకుంటాయి.
- ఏడాది మొత్తానికీ ప్రతి ఇంటర్న్‌కూ పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన కింద బీమా సౌకర్యాన్ని ఉంటుంది.

తెలంగాణలో ఒక జిల్లా..

పని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న యువతకు ఈ పథకం కింద ఆ అవకాశం కల్పించేందుకు.. ఇప్పటికే మూడు కంపెనీలు (అలెంబిక్, మహీంద్ర అండ్ మహీంద్ర, మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్) నాలుగు రాష్ట్రాల్లోని ఏడు జిల్లాల్లో 1,077 ఆఫర్లు ఇచ్చాయి. ఆ జిల్లాల్లో ఒకటి తెలంగాణ నుంచి ఉండడం గమనార్హం.


ఎవరు అర్హులు?

హైస్కూల్, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యలో ఉత్తీర్ణులైనవారు, ఐటీఐ సర్టిఫికెట్ ఉన్నవారు, పాలిటెక్నిక్ విద్యాసంస్థల నుంచి డిప్లొమా పొందినవారు, బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఫార్మా వంటి డిగ్రీలు పొందిన పట్టభద్రులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కాగా, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కుటుంబాలకు చెందినవారు, ఆదాయపన్ను చెల్లించే కుటుంబాలకు చెందినవారు, వార్షిక ఆదాయం రూ.8 లక్షలు మించిన కుటుంబాల నుంచి వచ్చినవారు పథకానికి అనర్హులు. ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్ వంటి ఉన్నతస్థాయి విద్యాసంస్థల్లో చదివినవారు, సీఏ, సీఎంఏ చేసినవారు అనర్హులు.

హిజ్బుల్లాకు మరో దెబ్బ..

ఐడీఎఫ్ దాడుల్లో నస్రల్లా అల్లుడి మృతి

- అతని ద్వారానే హిజ్బుల్లాకు ఫండింగ్
- సిరియాపై దాడుల్లో హతం
- ఐఆర్‌జీసీ సలహాదారు కూడా



ఖాసిర్ | మాజిద్ దివానీ | ముస్తాహ

టెల్‌అవీవ్, అక్టోబరు 3: హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థకు మరో భారీ దెబ్బ తగిలింది. గురువారం సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) జరిపిన క్షిపణి దాడుల్లో.. హిజ్బుల్లాకు ఆయుధాల సరఫరా, నిధుల సమీకరణ వ్యవహారాలను పర్యవేక్షించే హసన్ జాఫర్ అల్-ఖాసిర్ మృతిచెందాడు. ఇటీవల బీరుట్‌లో జరిపిన దాడుల్లో మృతి చెందిన హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాకు ఈయన అల్లుడు. సిరియాలోని ఇస్లామిక్ స్టేట్(ఐఎస్), గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హిజ్బుల్లాతోపాటు.. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్(ఐఆర్‌జీసీ)కి ఖాసిర్ ప్రధాన సంధానకర్త కావడం గమనార్హం.! ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు ఆయుధాలను సరఫరా చేసేది కూడా ఖాసిరేనని ఐడీఎఫ్ చెబుతోంది. అటు నస్రల్లా, ఇటు ఖాసిర్ మృతితో.. హిజ్బుల్లాకు దిశానిర్దేశంచేసే నేతలు కరువయ్యారని ఐడీఎఫ్ భావిస్తోంది. డమాస్కస్‌పై రెండ్రోజుల క్రితం జరిపిన క్షిపణి దాడిలో ఐఆర్‌జీసీ సలహాదారు మాజిద్ దివానీ హతమైనట్లు ప్రకటించింది. మాజిద్ మరణంతో ఇరాన్ మరోమారు ఇజ్రాయెల్‌పై దాడులుచేసే ప్రమాదముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బీరుట్‌లోని హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్, ఇన్ఫర్మేషన్ కార్యాలయాలను వైమానికదాడుల్లో నేలమట్టం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఈఘటనల్లో 9మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. మరోవైపు.. మూణ్నెల్ల క్రితం సెంట్రల్ గాజాలో తాము జరిపిన క్షిపణి దాడిలో హమాస్ అప్రకటిత ప్రధాని రావ్హీ ముస్తాహ మృతిచెందినట్లు ఐడీఎఫ్ గురువారం నిర్ధారించింది.

ఇజ్రాయెల్‌లో 12 మంది మృతి

లెబనాన్ నుంచి హిజ్బుల్లా ప్రయోగించిన క్షిపణులను చాలా వరకు తమ ఐరన్‌డోమ్ వ్యవస్థ అడ్డుకున్నా.. ఓ మిసైల్ గోలన్‌హైట్స్‌లోని మజ్దల్ షమ్స్ ప్రాంతంలో పడిందని ఐడీఎఫ్ వివరించింది. ఈ ఘటనలో 12 మంది చిన్నారులు, యువకులు మృతి చెందినట్లు ప్రకటించింది. ఈ దాడికి కారకుడైన ఉగ్రవాదిని హతమార్చినట్లు వెల్లడించింది.

ఇరాన్ హిట్‌లిస్ట్..!

ఇరాన్ హిట్‌లిస్ట్ పేరుతో సోషల్ మీడియాలో ఓ పోస్టర్ హల్‌చల్ చేస్తోంది. ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీతోపాటు.. ఐఆర్‌జీసీకి చెందిన పలువురు కమాండర్లు ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.! తాజాగా.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గలాంట్, ఆర్మీ చీఫ్ జనరల్ హెర్జీ హలేవి, డిప్యూటీ చీఫ్ ఆమిర్ బరమ్, ఇతర అధికారులు ఇరాన్ హిట్‌లిస్టులో ఉన్నట్లు సోషల్ మీడియాలో పోస్టర్లు చక్కర్లు కొడుతున్నాయి.

రోగ నిరోధక కణాలకు

చిక్కదు.. దొరకదు!

- కాండిడా ఫంగస్ గుట్టు విప్పిన సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు

హైదరాబాద్, అక్టోబరు 3: ఆరోగ్యంగా ఉండే వ్యక్తుల నోరు, చిన్న లేదా పెద్ద ప్రేగులు, మూత్ర కోశంలో ఉండే వ్యాధికారకమైన కాండిడా గ్లాబ్రాటా అనే శిలీంధ్రం (ఫంగస్) రోగనిరోధక కణాలు చంపకుండా ఎలా తప్పించుకోగలుగుతుందో శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. హైదరాబాద్‌లోని డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)లోని బ్రిక్ సెంటర్ శాస్త్రవేత్తలు ప్రాణాంతకమైన ఈ శిలీంధ్రం పై పరిశోధనలు చేశారు. కాండిడా గ్లాబ్రాటా కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా25 లక్షల మంది మరణిస్తున్నారు. ఈ ఫంగస్ రోగనిరోధక శక్తి తక్కువున్న రోగుల రక్తప్రవాహం, అంతర్గత అవయవాలకు అంటువ్యాధులను వ్యాపింపజేస్తుంది. ఇతర ప్రధాన వ్యాధికారక ఫంగస్‌లకు భిన్నంగా ఇది వ్యవహరిస్తుందని పరిశోధకులు రూపీందర్ కౌర్, సందీప్ పాత్రా తేల్చారు. ఐఎల్-8 అనే సైటోకైన్ ఉత్పత్తిని అణచివేయడం ద్వారా రోగనిరోధక కణాల దాడి నుంచి అది తప్పించుకుని రోగి శరీరంలో తిష్టవేస్తుందని గుర్తించారు.

వర్గీకరణ అమలుపై రేవంత్ మాట తప్పారు

- 9న నిరసన ప్రదర్శన.. 15న రాష్ట్ర సదస్సు..

ఉద్యమ కార్యాచరణ ప్రకటన: మంద కృష్ణ

పంజాగుట్ట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని, మరో సారి మాదిగలను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణ అమలు చేస్తామని, ఉద్యోగ నియామకాల్లో వెంటనే వర్తింపజేస్తామని చెప్పి.. విస్మరించారని దుయ్యబట్టారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మంద కృష్ణ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును అందరికన్నా ముందు స్వాగతించింది రేవంతేనని గుర్తు చేశారు. ప్రస్తుత ఉద్యోగ నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేసేందుకు ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. '9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామని, అదే రోజు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పైనున్న అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ప్రదర్శన చేపడతామని తెలిపారు. ఈ నెల 15న ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని మంద కృష్ణ మాదిగ తెలిపారు.

రాష్ట్రంలో డీజేల మోత బంద్!

వేడుకలు, బరాత్‌లు, ర్యాలీల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వాడకంపై నిషేధం

- ప్రభుత్వానికి పోలీసు శాఖ ప్రతిపాదన
- త్వరలో వెలువడనున్న అధికారిక ప్రకటన
- హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఇప్పటికే నిషేధం అమలు



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పండగ, పుట్టిన రోజు, పెళ్లి బరాత్, వినాయక నిమజ్జన ఊరేగింపు, రాజకీయ పార్టీ ర్యాలీ.. కార్యక్రమం ఏదైనా సరే ఇటీవల డీజే సౌండ్ బాక్సుల మోత సాధారణమైపోయింది. బాక్సులు బద్దలయ్యేలా, చెవులు దద్దరిల్లేలా, గుండెలు అదిరేలా డీజే సౌండ్ సిస్టమ్‌ల ద్వారా వచ్చే పాటలు, సంగీతానికి చిన్నాపెద్దా తేడా లేకుండా స్టెప్పులేసే సంస్కృతి అధికమైంది. అయితే, ఈ డీజేల మోత ఇకపై బంద్ అవ్వనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు, బరాత్‌లు, ర్యాలీల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం అమలు కానుంది. డీజేల వినియోగంపై పదేళ్లుగా ఉన్న ఆంక్షలను కచ్చితంగా అమలు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. డీజే వాడకం విధానంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న శబ్ద కాలుష్యం, మితిమీరిన చప్పుడుతో మనుషుల ఆరోగ్యంపై దుష్ప్రభావం తదితర కారణాలతో డీజే మోతలను ఆపాలని పోలీసు శాఖ నిర్ణయించింది. డీజేల వాడకం వల్ల తలెత్తే సమస్యలు, శాంతిభద్రతల పరంగా ఎదురయ్యే ఇబ్బందులు, నిషేధంపై తీసుకోవాల్సిన నిర్ణయానికి సంబంధించి పోలీసు శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక పరిశీలన అనంతరం డీజేల వాడకంపై నిషేధానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయనుంది. నిబంధనల ప్రకారం నివాస సముదాయాలు ఉన్న ప్రాంతంలో పగటిపూట 55 డెసిబుల్స్, రాత్రి వేళ 45 డెసిబుల్స్ శబ్దం వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ నిబంధనను ఇకపై కచ్చితంగా అమలు చేయనున్నారు. నిజానికి వినాయక చవితి అనంతరం అన్ని వర్గాల వారితో సమావేశమైన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డీజేల వాడకంపై నిషేధం విధించారు. ఆ తర్వాత రాచకొండ, వరంగల్ కమిషనర్లు కూడా వేర్వేరుగా అదే తరహా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు భవిష్యత్తు పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయనున్నారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...

పరిమితికి మించిన శబ్దం ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుంది. డీజే సౌండ్ సిస్టమ్స్ చప్పుళ్ల మధ్య డ్యాన్సులు చేస్తూ పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆరోగ్యంగా ఉన్న మనిషి 45 -55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకుమించి శబ్దం వింటే మానసిక ఆందోళన, అధిక రక్తపోటు, గుండె పనితీరు అదుపు తప్పడం, నాడీ వ్యవస్థపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డీజేలు ఉపయోగించడం వల్ల సాధారణంగానే 100-150 డెసిబుల్స్ శబ్దం ఉత్పత్తి అవుతుంది. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న డీజే ఉపకరణాలతో ఈ శబ్దం స్థాయి మరింత అధికంగా ఉంటుంది. డీజే శబ్దంలో గంట, రెండు గంటలు ఉన్న వారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. డీజే శబ్దం వల్ల ఇతరులతో పోలిస్తే గర్భిణీలకు అధిక ముప్పు.

డీజేలతో అనవసర ఇబ్బందులు

ఉత్సవాలు, ఊరేగింపులు, శుభకార్యాల్లో డీజే వాడకం వల్ల అనవసర సమస్యలు తలెత్తుతున్నాయి. వేడుకల్లో అనుకోని ఘటనలు జరిగితే పరిస్థితిని అదుపు చేయడం కష్టంగా మారుతుంది. డీజే వాడకంపై పదేళ్లుగా నిషేధం ఉంది. ఈ నిషేధాన్ని ఇక పక్కాగా అమలు చేస్తాం.

- జితేందర్, డీజీపీ




యాదాద్రి జిల్లా అనాజిపురంలో కూలిన మామిడి చెట్లు, ఖమ్మం జిల్లా గుర్వాయిగూడెంలో నేలకొరిగిన వరి పంట

రైతన్న కష్టం.. వర్షార్పణం!

- గాలివానకు వందలాది ఎకరాల్లో పంట నష్టం
- దెబ్బతిన్న వరి చేలు, మామిడి, నిమ్మతోటలు
- ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో గగ్గోలు పెడుతున్న రైతులు
- పాలమూరులో కొట్టుకుపోయిన 50 క్వింటాళ్ల మొక్కజొన్న

కూసుమంచి, జడ్చర్ల, నల్లగొండ, అక్టోబరు 3: ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులు రైతన్నకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వందలాది ఎకరాల్లో వరి పంటలతో మామిడి, నిమ్మతోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని కూసుమంచి, గుర్వాయిగూడెం, పాలేరు, జుజ్జులరావుపేట, రాజుపేట, పెరికశింగారం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. ఇప్పటికే సెప్టెంబరు 1న సంభవించిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన కూసుమంచి మండల రైతాంగానికి ఈ పరిస్థితి గోటిచుట్టుపై రోకటిపోటుగా తయారైంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో మామిడి, నిమ్మతోటల్లో చాలా చెట్లు కూకటి వేళ్లతో సహా పైకి లేచి కూలాయి. మరో వారం, 10 రోజుల్లో కోతకు రానున్న వరిచేలు పూర్తిగా నేలవాలాయి. అనాజిపురంలో మామిడి, వేప, ఇతర చెట్లు కూడా కూలిపోయాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో మామిడి, నిమ్మతోటలు ధ్వంసమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి మార్కెట్‌కు రైతులు గురువారం 6700 క్వింటాళ్ల మొక్కజొన్నను తీసుకువచ్చారు. మార్కెట్‌లో పూర్తి స్థాయిలో షెడ్‌లు లేకపోవడంతో ఆరుబయట కుప్పలుగా పోశారు. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా కురిసిన వర్షంతో కుప్పలుగా పోసిన మొక్కజొన్న దాదాపు 50 క్వింటాళ్ల వరకు వర్షం నీటికి కొట్టుకుపోయింది.

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం
అచ్చంపేట పురపాలక సంఘం, నాగర్‌కర్నూల్ జిల్లా (తెలంగాణ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై 3 పనులు (అంచనా వ్యయం రూ.21.50 లక్షలు) కొరకు టెండరుకు పిలుపునిచ్చారు. బిడ్ల దాఖలు ప్రారంభ తేది:04.10.2024న ఉ. 10.00 గం.లకు, బిడ్ దాఖలు ముగింపు తేది: 05.10.2024న ఉ.11.00 గం.లకు. తదుపరి వివరాలు: ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in ను చూడగలరు, బిడ్లను కోరు కార్యాలయం, కమిషనర్, అచ్చంపేట పురపాలక సంఘం తెలంగాణ రాష్ట్రం. ఫోన్:9398573135, 8639579279.

సం/- కమిషనర్, అచ్చంపేట పురపాలక సంఘం

DIPR RO No.4882-PP/CL/ADVT/1/2024-25, తేది: 03.10.2024

వరంగల్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండరు ప్రకటన నం. EE-IV/GWMC/CTN-10/e-proc/2024, తేది:03.10.2024

పనుల సారాంశం: Mpl జనరల్ ఫండ్ క్రింద 20 నం.ల పనులు: రూ.82.84 లక్షలకు ఎలక్ట్రికల్ 20 నం.ల పనులు. 1 రోజు టెండరు - 20 నం.ల పనుల కొరకు డౌన్‌లోడింగ్‌కు చివరి తేది: 04.10.2024న ఉ.11.00గం.ల వరకు. బిడ్లు తెరుచుట: 04.10.2024న ఉ.11.10గం.లకు. సంప్రదింపు వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - IV, GWMC, వరంగల్, ఇ-మెయిల్ ee.elec.gwmc@gmail.com. తదుపరి వివరాలు ఈ "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ ఈ www.eprocurement.gov.in లో చూడగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల డౌన్‌లోడ్ 30.09.2024 నుండి ప్రారంభమౌతుంది.

సం/- కమిషనర్, వరంగల్ మహానగరపాలక సంస్థ

DIPR RO No:4886-PP/CL/ADVT/1/2024-25, Dt:03.10.2024

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం, రాజన్న సిరిసిల్ల.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.06-07/DPRE/RS/Tenders/2024-25, తేది:30.09.2024

దిగువ సంతకందారు రాజన్న సిరిసిల్ల జిల్లా యొక్క వేములవాడ, బోయినపల్లి మండలాల్లో (02) నం.ల పనులు కోరుచున్నారు. మొత్తం ECV: రూ.19.00 లక్షలు. బిడ్ అప్‌లోడ్ ప్రారంభ తేది: 07.10.2024 నుండి ముగింపు తేది: 14.10.2024. తదుపరి వివరాలు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందగలరు.

సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల.

DIPR RO No.4891-PP/CL/ADVT/1/2024-25, తేది: 03.10.2024

దేవాదాయ ధర్మాదాయ శాఖ
నిజామాబాద్ జిల్లా
ప్రకటన

లేఖ నెం. ఏ/1548/2024 తేది: 03.10.2024

శ్రీయుత ఉప కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్‌గారిచే జారీ చేయబడిన ఈ క్రింద తెలియపరిచిన దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండలి నియామకము చేయుటకు నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ఇట్టి క్రమ సంఖ్య 1 మరియు 6 దేవాలయాల ధర్మకర్తల మండలికి గాను ఆసక్తి గలవారు తేది: 30.09.2024 నుండి (20) రోజులలోపు తమ తమ దరఖాస్తులను శ్రీయుత సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ నిజామాబాద్ గారికి దరఖాస్తు చేసుకోగలరని కోరుచున్నాము. దేవాలయాల పేర్లు.

1. శ్రీ వీరేశ్వరస్వామి దేవాలయము, రాచాపూర్ గ్రామం, బిక్కనూర్ మండలము, కామారెడ్డి జిల్లా
2. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయము, తిప్పాపూర్ గ్రామం, బిక్కనూర్ మండలము, కామారెడ్డి జిల్లా
3. శ్రీ పంచముఖి హనుమాన్ & ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము కామారెడ్డి పట్టణము
4. శ్రీ శివరామ మందిరము, దోమకొండ గ్రామం మరియు మండలము, కామారెడ్డి జిల్లా
5. శ్రీ వీర హనుమాన్ & వేంకటేశ్వర స్వామి దేవాలయము, మాచారెడ్డి గ్రామం మరియు మండలము
6. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయము, దోమకొండ గ్రామం మరియు మండలము

సం/- ఉప కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్

DIPR RO.No 4898-PP/CL/ADVT/1/2024-25 తేది.03.10.2024

తెలంగాణ ప్రభుత్వం
షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ
టెండరు ప్రకటన

టెండరు నోటీసు నెం. B1/101/2024-25 తేది: 03.10.2024

జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, కరీంనగర్ జిల్లా పరిధిలోని (22) ప్రీ మెట్రిక్ మరియు (09) పోస్ట్ మెట్రిక్ వసతి గృహములకు ఈ క్రింద పేర్కొనబడిన సామాగ్రి సరఫరా చేయుటకు కరీంనగర్ జిల్లా తరఫున టెండర్ విడివిడిగా కోరబడుచున్నవి.

వివరములు:
1. స్కూల్ బ్యాగ్స్ 2. స్వెటర్స్ విత్ మంకీ క్యాప్ 3. లెదర్ షూ (బ్లాక్) 4. స్పోర్ట్స్ షూ 5. సాక్స్ (3)Pair Set 6. ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ 100 లీ॥ 7. ఉడెన్ బ్యాంకెట్స్ 8.Inverter Exide Battery

పదవ తరగతి విద్యార్థులకై స్టడీ మెటీరియల్స్ వివరములు:
9. ఆల్ ఇన్ వన్ మెటీరియల్ (తె/ఇ) మీడియం 10. పరల్ ఆటాస్ మ్యాప్ బుక్ 11. బాల్ పెన్స్ (నలుపు రంగు) 5 సెట్ ప్యాకెట్ 12. బాల్ పెన్స్ (బ్లూ కలర్) 5 సెట్ ప్యాకెట్ 13. పరీక్ష ప్యాడ్ (Printed) 14. Geometry Box 15. స్టడీ చేర్ విత్ ప్యాడ్ 16. Pencil Box 17. Big Scale

ఆసక్తి గల టెండర్ దారులు, టెండరులో పాల్గొనుటకు టెండరు షెడ్యూల్ ఖరీదు రూ. 3,000/- (అక్షరాల మూడు వేల రూపాయలు) డి.డి.ని The Deputy Director, SCDD కరీంనగర్ గారి పేరున డి.డి. (SBI Bank) ద్వారా చెల్లించగలరు. టెండరు ఫారములు తేది: 04.10.2024 నుండి తేది: 15.10.2024 మ. 1.00 గం.ల వరకు పొందగలరు మరియు పూర్తి చేసిన టెండర్ ఫారములను తేది: 15.10.2024 మ. 03.00 గం.లలో సమర్పించవలయును. పని దినాలలో మాత్రమే టెండర్‌ప్రక్రియ జరుగును.

1. బిడ్ టెండర్ ఫారములను సమర్పించుటకు చివరి తేది: 15.10.2024 మ. 3.00 గం.ల వరకు.
2. సీల్డ్ టెండర్లు జిల్లా సంయుక్త కలెక్టర్ / చైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, కరీంనగర్ జిల్లా గారి ఛాంబర్‌లో తేది: 15.10.2024 రోజున సా. 05.00 గం.లకు తెరువబడును.

ఇతర వివరములకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, కరీంనగర్ జిల్లా గారి కార్యాలయము నందు సంప్రదించగలరు మరియు బిడ్ టెండర్ షెడ్యూలు వాయిదా లేదా రద్దు పరచు అధికారం ఈ క్రింది సంతకందారునకు కలదు.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్/చైర్మన్ తరఫున జిల్లా కొనుగోలు కమిటీ, కరీంనగర్ జిల్లా

DIPR RO.No 4903-PP/CL/ADVT/1/2024-25 తేది.03.10.2024

వ్యాధి నిరోధక ఔషధ సంస్థ ప్రజారోగ్య ప్రయోగశాలలు మరియు ఆహార (ఆరోగ్య) పరిపాలన సంచాలకుల కార్యాలయం, నారాయణగూడ, హైదరాబాద్, తెలంగాణ
సంక్షిప్త టెండరు ప్రకటన

డైరెక్టర్, వ్యాధి నిరోధక ఔషధ సంస్థ ప్రజారోగ్య ప్రయోగశాలలు మరియు ఆహార (ఆరోగ్య) పరిపాలన, నారాయణగూడ, హైదరాబాద్ - 500029, తెలంగాణ వారిచే డయాగ్నోస్టిక్స్ కిట్ల కొరకు 17.10.2024న లేదా ఆలోగా సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలకు టెండరుదారులు వెబ్‌సైట్ http://ipm.telangana.gov.in దర్శించగలరు. దిగువ హెడ్ అకౌంట్‌లో చలాన్ ద్వారా రూ.500/- చెల్లించి పైన పేర్కొన్న సదరు కార్యాలయం నుండి షెడ్యూల్‌తో పాటు టెండరు ఫారాలను పొందవచ్చును. **హెడ్ అకౌంట్:** 0210- మెడికల్ & పబ్లిక్ హెల్త్, 04-పబ్లిక్ హెల్త్, 800-ఇతర రసీదులు, 81-ఇతర రసీదులు లేదా ఇతర ఐటమ్‌లు: 001- ___. IPM స్టోర్స్ & పర్చేజ్ సెక్షన్, నారాయణగూడ, హైదరాబాద్ వారి వద్ద పనిదినాలలో 08.10.2024 నుండి 15.10.2024 వరకు టెండరు ఫారాలు విక్రయించబడును. పూరించిన టెండరు ఫారాల దాఖలుకు చివరి తేది 17.10.2024న సా.5.00 గం.కు. వ్యాధి నిరోధక ఔషధ సంస్థ ఆవరణలో 24.10.2024న మ.12.00 గం.కు దిగువ సంతకందారు ద్వారా టెండర్లు తెరువబడును.

సం/- సంచాలకులు (I/C)

DIPR Ro No. 4909-PP/CL/ADVT/1/2024-25. తేది: 03.10.2024

OFFICE OF THE NARAYANPET MUNICIPALITY
QUOTATIONS INVITING NOTICE

Quotation Notice No. E1/130/NRPT/BC-P/N-SSR-I/2024-25 Date: 03/10/2024

The Commissioner Narayanpet Municipality is inviting sealed Quotations for Non-SSR Items, for various developmental works in Narayanpet Municipality and the details are as follows:

1. Supply and delivery of Plants such
   i. Banana Palm tree (30"x30")
   ii. Bignonia mega Potamica (Tabebuia barteroi) (30"x30")
   iii. Alocasia Macrorrhizos (15"x15")
   iv. Christmas tree (21"x21")
   v. Dracaena mahatma (15"x15")
   vi. Chaina ball (8"x12")
   vii. Fox Tail Palm (30"x30")
   viii. legestronia (21"x21")
   ix. RK palm (21"x21")
2. Manufacture, Supply, Delivery and fixing at site for Ready made RCC Precast rings of 1.50M dia 300mm height including all cost of materials, labour charges and all incidental and operational charges ect complete as directed by the departmental engineer for finished items of work.
3. Supply & Deliver of RCC Pre cast Cement Rings top Cover frame of size 1.50 m dia
4. Designing of RCC shiva statue of height 15 feet using skilled workers includes hiring charges, transportation, accommodation including cost and conveyance of all materials like cement, sand, coarse aggregate water, bricks, steel, binding wire etc., to site, on all materials, labour charges and fabrication, scaffolding for mixing laying concrete, finishing up to top surface to the required level and curing etc., complete for finished item of work & shaping of statue with pure cement up to desired structure for twenty five days and curing daily for final finished works using sand paper and materials for desired structure of sculpture.
5. Painting for shiva statue using desired colours of Asian Royal paints with Weather coat Stone shield Primer of high quality of two coats, to Make sure it is dry and free of all dust, contaminants and fungal growth. acrylic exterior colours & designed to provide a base smooth coatings for sculpture. The finish is fortified with high-quality quartz aggregates, making the finish both long-lasting, and great looking includes cost & labour charges for painting.
6. Manufacture, Supply, Delivery and fixing at site for Readymade RCC Precast rings of 1.00M dia 300mm height including all cost of materials, labour charges and all incidental and operational charges ect complete as directed by the departmental engineer for finished items of work.
7. Supply and fixing of 1.00mtr dia RCC pre cast Top cover

Quotation Submission Start Date & Time: 04/10/2024 11:00 AM
Quotation Submission Closing Date & Time: 07/10/2024 04:30 PM

For more Further details visit Narayanpet Municipality, Narayanpet Dist., Telangana. Ph: 9618099288,9618099244.

Sd-/ (V. Sunitha) Commissioner
Narayanpet Municipality

DIPR RO.No 4896-PP/CL/ADVT/1/2024-25 Date: 03.10.2024

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మురుగు మాటలు

మురికినోళ్లను ఫినాయిల్‌తో కడుక్కోవాలని తెలంగాణ అధికార, ప్రతిపక్ష నేతలు ఒకరికొకరు సలహా ఇచ్చుకుంటున్నారు. ఇంత నీచమైన భాష మాట్లాడతారా అంటూ ప్రశ్నిస్తూనే, అదే నీచమైన భాషలో సవాళ్లు విసురుతున్నారు. మూసీ నదిని అంటారు కానీ, రాజకీయ శ్రేణులలోనే మురుగునీరు ఉరకలెత్తుతున్నది. శుద్ధి అంటూ చేసుకోవలసి వస్తే, వింటున్న చూస్తున్న ప్రజానీకమే తమ ఆరోగ్యం కోసం ఆ పని చేసుకోవాలి.

కొంతకాలం కిందట తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఇట్లా ఉండేవి కావు. కనీసం, రాజకీయ భాష ఇంత దుర్భాషగా ఉండేది కాదు. మనసుల్లో ఏమి ఉన్నా, జనాంతికంగా ఏమి మాట్లాడినా, వేదికలెక్కినప్పుడు, చట్టసభల్లోను, బహిరంగ స్థలాల్లోనూ పద్ధతిగా మాట్లాడాలని ఒక పట్టింపు ఉండేది. బహుశా, దాన్నే సంస్కారం అని అంటారు. ఎందుకో, ఆ మర్యాదలు తగ్గిపోతూ వచ్చాయి. రాజకీయ ప్రత్యర్థిని విమర్శించడం కాదు, అతను లేదా ఆమె మతాన్ని, కులాన్ని, కుటుంబాన్ని అందరినీ తమ హీన వ్యక్తీకరణల్లోకి లాగడానికి ఇవాళ ఎవరికీ సంకోచాలు ఉండడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో పోయిన ప్రభుత్వ హయాంలో, నాటి అధికారపార్టీ తరఫున ఇద్దరు ముగ్గురు బూతు నిపుణులు ఉండేవారు. వాళ్ల పని, అనర్గళంగా వ్యక్తిగతంగా బూతులు తిట్టడమే. సామాజిక మాధ్యమాలలో మాత్రం అక్కడ అధికార పార్టీ, ప్రతిపక్షం అని తేడా ఏమీ లేదు. అందరూ, పోటాపోటీ బూతు వీరులే!

రాష్ట్ర అవతరణ తరువాత, తెలంగాణ ముఖ్యమంత్రే, సరిహద్దులు లేని భాషను అధికారభాష చేశారు. అదేమంటే ఇదే ఉద్యమభాష, ప్రాంతపు భాష అంటూ ఉద్యమాన్ని, ప్రాంతాన్ని బదనాం చేశారు. అయితే, కేసీఆర్ భాష పరుషంగాను, కఠినంగాను ఉండేది కానీ, బూతులు ఉండేవి కావు. అమర్యాదగా ఉండేది కానీ, అసభ్యమని చెప్పలేము. కేసీఆర్ అనంతర ప్రభుత్వంలో తెలంగాణ కూడా కొత్త ప్రమాణాలను చేరుకుంది. రెండు రాష్ట్రాల్లోనూ తెలుగువారందరి రాజకీయభాష ఇప్పుడు ఒకే బూతు మాండలికంలోకి దిగింది.

సామాజిక మాధ్యమాలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నికల సమయం నుంచి హోరాహోరీ పోరాటం చేస్తున్నాయి. వైరల్ కావడమే ముఖ్యం, జనం నోళ్లలో నానడమే ముఖ్యం. పద్ధతీ పాడూ లేని వేదికల మీద ఎదుటివాళ్ల మీద ఎగబడడమే వ్యూహం. పరాకాష్టకు చేరిన ఆ హీన భాష, క్రమంగా అధికారిక వేదికల మీదికి కూడా ప్రవహించింది. అధికారపార్టీ ముఖ్యనేతలు, ప్రతిపక్షాల అధినేతలు ఇప్పుడు బాహాటంగా విసురుకునే సవాళ్లు, చేసే ఆరోపణలు ఏ పరిమితులనూ పాటించవు. వాటి వాటి సామాజిక మాధ్యమాలకైతే ఇక పట్టపగ్గాలు లేవు. ఈ నేపథ్యంలో భాగమే రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మీద బీఆర్ఎస్ అభిమానులో కార్యకర్తలో మొదలుపెట్టిన ట్రోలింగ్. అదొక జులాయి వ్యాఖ్యే అయినా, ఆ జులాయితనం క్షమార్హం కానిది, ఒక స్త్రీ మీద, సీనియర్ రాజకీయ మహిళ మీద, నిన్నటి దాకా తమతో ఉన్న సహచర పార్టీనేత మీద అటువంటి వ్యాఖ్య ఏ మాత్రం సహించలేనిది. అటువంటి క్షీణత తమ పార్టీలోకి ప్రవేశిస్తున్నందుకు బీఆర్ఎస్ కించపడాలి, పార్టీ శ్రేణులలో బలపడుతున్న సంస్కారరాహిత్యాన్ని ఒకసారి సమీక్షించుకోవాలి.

తన మీద జరిగిన అసభ్యతాదాడికి కొండా సురేఖ ప్రతిస్పందన, ఆమెమీద సానుభూతిని కాక, వ్యతిరేకతను ఆహ్వానించింది. కారణం, ఆమె కూడా అదే తరహా సంస్కారంతో స్పందించారు. గాయపడిన మనసుతో ఆమె రాజకీయ ప్రత్యర్థి మీద చేసిన ఆగ్రహ ప్రకటనను అర్థం చేసుకోవచ్చు. కానీ, బాధ్యత కలిగిన ప్రజానాయకురాలిగా ఆమె తన ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవడమూ అవసరం. అట్లా ఉండక పోవడమే కాక, ఈ రాజకీయ సంవాదంతో ఏ సంబంధమూ లేని వ్యక్తిని, వ్యక్తులను వ్యక్తిగత అంశాల ప్రస్తావనతో, కించపరిచారు. అవమానకరమైన ఆపాదనలు చేశారు. స్త్రీ అయి ఉండి, స్త్రీల విషయంలో చూపవలసిన సహానుభూతిని విస్మరించారు. వ్యక్తిగత గోప్యత తప్పనిసరిగా గౌరవించవలసిన విలువ అన్నది మరచిపోయారు. సురేఖ వ్యాఖ్యలను సమాజం హర్షించలేదు. తీవ్ర వ్యతిరేకతను చూసి ఆమె వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.

సురేఖపై జరిగిన ట్రోలింగ్‌ను ఖండించి, బీఆర్ఎస్ నేతలు మాట వరసకైనా తాము ఇటువంటి ధోరణులను అంగీకరించబోమని ప్రకటించారు. సురేఖ మాటల్లో వ్యక్తమైన విలువలను తాము అంగీకరించబోమని, ఆమె చేసింది తప్పు అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు కానీ, ముఖ్యమంత్రి కానీ ఇంతవరకు చెప్పలేదు. చెప్పి ఉంటే, ఆమెను మందలించి ఉంటే ఎంతో గౌరవంగా ఉండేది. సురేఖ కూడా తన మాటలను వెనుకకు తీసుకున్నారు తప్ప, క్షమాపణ అడగలేదు. అడిగి ఉంటే ఎంతో హుందాగా ఉండేది.

రాజకీయ సంవాదాన్ని తీవ్రమైన, పరుషమైన, అసభ్యమైన విలువలతో, భాషతో నింపితే, ఉభయపక్షాల్లోనూ స్త్రీలే బాధితులు అవుతారు. తెలుగు ప్రజలు ఇంతటి తక్కువరకం రాజకీయాలను ఇష్టపడకూడదు. గట్టిగా తమ వ్యతిరేకతను చెప్పాలి.

నల్లమలలో గద్దర్!



'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా, పోరు తెలంగాణమా...' అంటూ గద్దర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సాంస్కృతిక పునాది వేశాడు. తాను పాటయ్యాడు, తానే తెలంగాణ రాష్ట్రోద్యమ నినాదం అయ్యాడు. పొడుస్తున్న పొద్దు లాగానే తన విగ్రహాన్ని దక్కన్ పీఠభూమిలోని తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అటవీ ప్రాంతం ఆవిష్కరించుకోనున్నది. ఈ చారిత్రక సన్నివేశాన్ని వర్తమాన, భవిష్యత్ తరాల ముందు ఉంచబోతున్నది మట్టిమేధావి కొల్లూరి సత్తయ్య. వీరు అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి 'ఫూలే అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫీ అండ్ ఇంగ్లీష్ ట్రెయినింగ్' కేంద్రాన్ని హైదరాబాద్ కేంద్రంగా సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు, బుద్ధుడు, ఫూలే, అంబేద్కర్ బోధనలను పరిచయం చేస్తున్నారు. గద్దర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన స్ఫూర్తిని ముందుతరాల్లో నింపేలా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నారు.

గద్దర్ నల్లమలకు కొత్త కాదు. ఆయన పాటలూ కొత్త కాదు. ఆయన పాటల ప్రభావం తొలుత మైదాన ప్రాంతం కంటే అటవీ ప్రాంతంలోనే కన్పించింది, విన్పించింది. బుద్ధుని మార్గాన్ని, ఫూలే, అంబేద్కర్ల ఆలోచనా విధానాన్ని ఆయన అందిపుచ్చుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతానికి చాలా ప్రత్యేకతలున్నాయి. అందులో వీరశైవం అతి ప్రధానమైనది. దాని ప్రభావం గద్దర్ పాటలపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉన్నది. సర్వమానవ సమానత్వాన్ని బోధించింది బుద్ధుని తర్వాత బసవేశ్వరుల వారే. మహిళా చైతన్యాన్ని, స్త్రీ పురుష సమానత్వాన్ని బోధించిన బుద్ధుని, బసవేశ్వరుని మార్గంలోనే గద్దర్ పాటలు చాలా ఉన్నాయి. ఆయన అందించిన చైతన్యమూ ఉంది. అంతేకాదు గద్దర్ తల్లిదండ్రులు కూడా వీరశైవ ప్రభావంతో ఉన్నవారే. గద్దర్ తల్లి కూడా సావిత్రిబాయి ఫూలే గురించి, "మా ఊరి పెంట మీద మల్లే పుట్టిందో...." అంటూ రాగయుక్తంగా పాడే వారని గద్దర్ చెప్పేవారు.

ఇప్పుడు నల్లమల అటవీ ప్రాంతంలో గద్దర్ మరోసారి తన సామాజిక, దళిత, బహుజన ఆలోచనా స్రవంతుల చైతన్యపు మేళవింపులను ఈ నేలపై పారాడే తరంగాలకు అందించబోతున్నారు. సత్తయ్య గద్దర్ విగ్రహాన్ని కేవలం గద్దెలపైనే కాదు జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ శివారుల్లోని తెల్లాపూర్‌లో ఇరవై అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తూర్పు కనుమల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇట్లా తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల్లో గద్దర్ విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు సత్తయ్య 'గద్దర్ గళం' ఆధ్వర్యంలో శ్రమిస్తున్నారు.

– గోర్ల బుచ్చన్న, జర్నలిస్ట్

(రేపు నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూర్‌లో గద్దర్ విగ్రహ ఆవిష్కరణ)

హర్యానాలో 'నవ ధీర' పవనం



హర్యానా రాజకీయాలలోకి ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రవేశం ఒక ఆశాభావాన్ని కలిగిస్తోంది. పితృస్వామ్య విలువల ప్రభావం బలీయంగా ఉన్న ఆ సమాజంలో మార్పు పవనాలు వీస్తున్నాయన్న భావన అంకురిస్తోంది. ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్ పతకాన్ని గెలుచుకోలేకపోయినప్పటికీ అసంఖ్యాక హర్యాన్వీల ఆదరాభిమానాలను వినేశ్ గెలుచుకున్నారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

పురుషస్వామ్యం రాజ్యమేలుతున్న ప్రపంచమది. హర్యానా రాజకీయాల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ఆ పురుష లోకం ఎన్నడూ చూడని ఒక అపురూప దృశ్యాన్ని చూసింది. బలిష్ఠులైన జాట్ పురుష పుంగవులతో నిండిపోయిన ఆ హాలులో అందరి దృష్టి ఒక యువతిపైనే ఉన్నది! ఆమె, ఇటీవలే రాజకీయ రంగంలోకి ప్రవేశించిన ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అని మీరు ఊహించే వుంటారు. ఒక ప్రముఖురాలుగా తన విశేష ప్రాధాన్యం ఏమిటో ఆమెకు బాగా తెలుసు మరి. కనుకనే ఒక పెద్ద జన సమూహాన్ని శరదృతువు ఎండలో కొన్ని గంటల పాటు వేచి ఉండేలా చేసింది. ఆమె రాక ఎంత ఆలస్యమైనప్పటికీ ఎవరూ చికాకుపడలేదు. తీరుబడిగా సాయంపూట పొలం గట్టుకు వ్యాహాళికి వెళ్లే వృద్ధ రైతులు మొదలు ఉత్సాహ ఉద్వేగాలలో ఉన్న నవయవ్వన యువతీ యువకుల దాకా ప్రతి ఒక్కరూ వినేశ్ ఫొగాట్‌ను చూసేందుకు, ఆమె మాట వినేందుకు ఆత్రుతతో ఉన్నారు. ఎట్టకేలకు వినేశ్ రాగానే ఆమెకు ఒకరు సంప్రదాయక తలపాగా పెట్టారు. ఒక గ్రామ సర్పంచ్ ఆమెకు ఒక వెండి గదను బహూకరించడానికి ముందుకు వచ్చారు. ఇతరులు ఎంతో మంది ఆమెతో సెల్ఫీ దిగడానికి బారులు తీరారు. ఈ ఆత్మీయ సందడి ముగిసాక అందరినీ ఆకట్టుకునే చిరునవ్వుతో ఆమె ఒక చిన్న ఉపన్యాసమిచ్చారు. ఆ తరువాత అందరికీ అభివాదం తెలుపుతూ అక్కడ నుంచి మరో బహిరంగ సభాస్థలికి తరలివెళ్లారు. కుస్తీ బరి నుంచి రాజకీయ గోదాలోకి ఆమె పరివర్తన చాలా వేగంగాను, అసాధారణ ప్రభావశీలంగాను సంభవించింది.

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు చేరుకునే క్రమంలో వినేశ్ ఫొగాట్ ప్రస్తుత ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్ యూయి సుసాకిని ఓడించి ఆ క్రీడాభిమానులు అందరినీ అప్రతిభులను చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా స్వల్పస్థాయిలో ఎక్కువ బరువుగా ఉన్న కారణంగా తుది పోటీలో పాల్గొనడానికి ఆమె అనర్హురాలయ్యారు! పారిస్ దేదీప్యకాంతులకు హర్యానా జింద్ జిల్లాలోని గోధుమ క్షేత్రాలు, ఆవాల పొలాలు చాలా చాలా దూరం. అయితే నేమి ఫొగాట్ ప్రస్తుతం తలమునకలై ఉన్న పోటీ, పారిస్ పోటీ మాదిరిగానే అత్యంత కష్టమైనది. ఈ తాజా పోటీలో గెలిచేందుకు ఆవశ్యకమైన సామర్థ్యాలూ నైపుణ్యాలూ అంతకంటే తక్కువేమీ కాదు. హర్యానా ఝులనా శాసన సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పతాకం 15 ఏళ్ల క్రితం అవనతమయింది. అక్కడ దాన్ని మళ్లీ ఎగురవేయడం ఇంతవరకు కాంగ్రెస్ శ్రేణులకు సాధ్యం కాలేదు. వినేశ్ ఇప్పుడు ఆ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తున్నారు. నిజానికి ఒక ప్రధానస్రవంతి పార్టీ తరఫున ఏ మహిళ కూడా ఆ నియోజకవర్గం నుంచి ఇప్పటిదాకా పోటీ చేయనే లేదు. జాట్‌ల పూర్తి ప్రాబల్యమున్న ఆ నియోజకవర్గంలో వివిధ పార్టీల తరఫున ఒక డజన్ మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వినేశ్ విజయం సాధించగలిగితే ఝులనా నుంచి ఎన్నికైన మొట్టమొదటి మహిళా శాసన సభ్యురాలుగా ఆమె చరిత్రకెక్కుతారు.

రాజకీయ రంగంలోకి ప్రవేశించేందుకు వినేశ్ ఫొగాట్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ శ్రేణులకు మరొక పిచ్చాపాటీ అంశం అయింది. ఇటీవలి సంవత్సరాలలో అన్యరంగాలలో ప్రసిద్ధులూ రాజకీయ క్షేత్రంలోకి రాదలచుకున్నవారు దాదాపుగా అందరూ బీజేపీలో చేరడమే పరిపాటిగా ఉన్నది. గెలిచే పక్షానే ఉండడమే మానవ నైజం కదా. గత పది సంవత్సరాలుగా హర్యానాలోను, విశాల భారతదేశంలోనూ బీజేపీ బాగా బలోపేతమైన రాజకీయ పక్షంగా ఉన్నదన్న వాస్తవం విస్మరించలేనిది. వినేశ్ ఫొగాట్ ఆ సెలెబ్రిటీలకు భిన్నంగా కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా ఒలింపిక్ రెజ్లర్లు వీధికెక్కి తీవ్ర పోరాటం చేశారు. మహిళా రెజ్లర్లను ఆ బీజేపీ నేత లైంగిక వేధింపులకు గురిచేశాడన్నది వారి ఆరోపణ. అధికారంలో ఉన్న శక్తిమంతమైన ప్రభుత్వాన్ని ఒలింపిక్ రెజ్లర్లు సవాల్ చేసినట్టయింది. రెజ్లర్ల పోరుకు ప్రజల నుంచీ మద్దతు లభించింది. ఒక నిరంకుశ ప్రభుత్వాన్ని ధిక్కరిస్తున్న యోధురాలుగా వినేశ్ ఫొగాట్ ప్రజల దృష్టికెక్కారు. హర్యానా సామాజిక పరిస్థితుల నేపథ్యం నుంచి చూసినప్పుడు ఆమె నిజంగా ఒక నవ ధీర, సందేహం లేదు. హర్యానాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో ప్రజా వ్యతిరేకత నెదుర్కొంటున్నది. హర్యానా ఓటర్లు మార్పును కోరుకుంటున్నారు. వారి మనోభావాలకు ప్రాతినిధ్యం వహించగల ఒక జనసమ్మోహన నేత అవసరం ఉన్నది. 2024లో కాంగ్రెస్ శ్రేణులు తమకు అధికార ప్రాభవాన్ని కలిగించగల శక్తిని 30 ఏళ్ల ఒలింపియన్ మల్ల యోధురాలులో కనుగొన్నాయి.

హర్యానా వెలుపల వినేశ్ ఫొగాట్‌పై ప్రజాభిప్రాయం ఏకగ్రీవంగా లేదు. బీజేపీ సామాజిక మాధ్యమ సేనలు ఆమెపై నిత్యం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. రెజ్లింగ్ క్రీడ పట్ల ఆమె నిబద్ధతను ప్రశ్నిస్తున్నాయి. రాజకీయ జీవితానికి ఒక సోపానంగా బ్రిజ్‌భూషణ్ వ్యతిరేక నిరసనలను ఉపయోగించుకుంటున్నదని దుయ్యబడుతున్నాయి. పారిస్ ఒలింపిక్స్‌లో తుది పోటీలో పాల్గొనడానికి అనర్హురాలు అవడాన్ని కూడా ప్రశ్నిస్తున్నాయి. నిబంధనలు నిర్దేశించిన బరువు మాత్రమే ఉండేలా ఆమె ఎందుకు జాగ్రత్త పడలేదని ప్రశ్నిస్తున్నాయి. తన వైఫల్యానికి ఇతరులను కారకులను చేయడమేమిటని నిలదీస్తున్నాయి. అయితే వినేశ్ నిజంగా తన నియంత్రణలో లేని పరిస్థితులకు బాధితురాలు అని, విమర్శించడం కాకుండా సహానుభూతి చూపవలసిన అవసరమున్నదని ఆమెను సమర్థిస్తున్న వారూ చాలా మంది ఉన్నారు. ఏమైనా పారిస్‌లో చివరి క్షణంలో పోటీ నుంచి ఆమె నిష్క్రమించిన తీరును ఆమె జీవిత కథను మరింత ఆసక్తికరం చేసిందనడంలో సందేహం లేదు.

హర్యానాలోని చర్ఖి దాద్రి అనే కుగ్రామం నుంచి వినేశ్ ఫొగాట్ ప్రభవించారు. తండ్రి హర్యానా ఆర్టీసీ బస్ డ్రైవర్. వినేశ్ నవయవ్వన వయసులోకి ప్రవేశించక ముందే అతడిని మతిస్థిమితం లేని సమీప బంధువే కాల్చి చంపాడు. దృఢచిత్తురాలు అయిన వినేశ్ తల్లి తన బిడ్డలకు మెరుగైన జీవితాన్ని అందించడానికి సంకల్పించుకుంది. స్వగ్రామంలోని రెజ్లింగ్ అఖాడా వినేశ్‌కు కొత్త జీవితానికి దారి చూపింది. ఆ మల్ల యుద్ధ శిక్షణా కేంద్రంలోనే తన స్వతస్సిద్ధ ప్రతిభాపాటవాలను మెరుగుపరచుకుంది. కఠోర శ్రమ చేసింది. పురుషుల ప్రాబల్యం పూర్తిస్థాయిలో ఉన్న క్రీడ రెజ్లింగ్. మరి ఆ క్రీడలో ఒక మహిళా పెహెల్వాన్ విజయవంతమవ్వాలంటే శతాబ్దాలుగా ఉన్న సామాజిక దురహంకారాలను కూల్చివేయవలసి ఉన్నది. వినేశ్, ఆమె తరం రెజ్లర్లు సరిగ్గా అదే చేశారు. ప్రపంచ క్రీడా రేఖాపటంలో తమ ప్రతిభాపాటవాలతో హర్యానాకు ఒక సుస్థిర స్థానాన్ని కల్పించారు. రాజకీయ రంగంలోకి ప్రవేశించేందుకు నిర్ణయం తీసుకోవడంలో వినేశ్ ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్ కావాలన్న తన జీవితాశయాన్ని పక్కన పెట్టింది. అయితే పితృస్వామ్య విలువలు, వివక్షలు, దురభిప్రాయాలతో వర్ధిల్లుతున్న రాజకీయ వ్యవస్థకు ఒక బలమైన సవాల్‌ను విసిరింది.

హర్యానా రాజకీయాలలో రాజకీయ అధికార క్రమాలు, కుటుంబాల ప్రాబల్యాలు బాగా పాదుకుపోయి ఉన్నాయి. నిజానికి ఇవే పరిస్థితులు దేశమంతటా ఉన్నాయి. కనుకనే నేడు మన దేశంలో ఒకే ఒక్క మహిళా ముఖ్యమంత్రి మాత్రమే ఉన్నారు. అయితే మహిళల పట్ల రాజకీయ వివక్షలు బహుశా హర్యానాలో మరింత ప్రగాఢంగా వేళ్లూనుకుని ఉన్నాయని చెప్పక తప్పదు. 1966లో ఆవిర్భవించిన హర్యానాలో ఇప్పటివరకు కేవలం 87 మంది మహిళలు మాత్రమే రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. తమ సామాజిక హోదాలోను, రాజకీయ స్థాయిలోను హర్యానా మహిళలు పురుషుల కంటే చాలా చాలా వెనుకబడి ఉన్నారు. కేవలం గృహిణులుగా తక్కువ స్థాయికి చెందిన వారుగా ఉండేందుకు అంగీకరించక తప్పని దైన్యస్థితికి వారు నెట్టివేయబడ్డారు.

ఈ నేపథ్యంలో రాజకీయాలలోకి వినేశ్ ఫొగాట్ ప్రవేశం ఒక ఆశాభావాన్ని కలిగిస్తోంది. హర్యానా సమాజంలో మార్పు పవనాలు వీస్తున్నాయన్న భావన అంకురిస్తోంది. వినేశ్‌కు లభిస్తున్న ప్రజాదరణ ఆధారంగా తన విజయావకాశాలను మెరుగుపరచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అయితే వినేశ్ ప్రభావశీలత పార్టీ రాజకీయాల సంకుచిత పరిధులను అధిగమించింది. ఇటీవలి సంవత్సరాలలో రాజకీయ వ్యక్తుల కంటే క్రీడాయోధులే హర్యానాకు గర్వకారణంగా భాసిల్లుతున్నారు. మూర్తీభవించిన ఆత్మవిశ్వాసంగా కనిపించే మను బాకర్‌నే చూడండి. పారిస్‌లో రెండు ఒలింపిక్ పతకాలను గెలుచుకున్న ఈ షూటర్ నిత్యం ఏదో ఒక మీడియా కార్యక్రమంలో బిజీగా ఉంటున్నారు. తరం మార్పు నెమ్మదిగానే అయినప్పటికీ ప్రగతిశీలంగా సంభవిస్తోంది. సంప్రదాయ రీతిరివాజులు సడలిపోతున్నాయి. ఝులనా నుంచి ప్రప్రథమ మహిళా ఎమ్మెల్యేగా వినేశ్ ఎన్నికైన పక్షంలో సంప్రదాయ అవరోధాలను అధిగమించేందుకు అది ఎంతోమందికి స్ఫూర్తిదాయకమవుతుంది. భావితరాలకు తమను తాము ఆదర్శంగా తీర్చిదిద్దుకునేలా ఈ తరం యువతులను వినేశ్ విజయం పురిగొల్పుతుందనడంలో సందేహం లేదు. ఒలింపిక్ రెజ్లింగ్ ఛాంపియన్ పతకాన్ని గెలుచుకోలేకపోయినప్పటికీ అసంఖ్యాక హర్యాన్వీల ఆదరాభిమానాలను వినేశ్ గెలుచుకున్నారు. ఆమె వారి హృదయంలో ఒక సుస్థిర స్థానాన్ని సముపార్జించుకున్నారు. ఆ ఆదరాభిమానాలే వినేశ్‌కు ఎప్పటికీ ఒక పెద్ద వరం. ఆమె ఉజ్వల భవిష్యత్తుకు అవి ఒక తిరుగులేని అభయం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించడానికే 'జమిలి'

జమిలి ఎన్నికలను ప్రతిపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఇది అంతిమంగా అధ్యక్ష పాలనకు దారితీసి సమాఖ్య స్ఫూర్తినే దెబ్బతీసే అవకాశం ఉన్నది. కాబట్టి వాస్తవంగా ఇప్పుడు కావాల్సింది ఒకేసారి ఎన్నికలు కాదు. ప్రజాస్వామ్యం మరింతగా వర్ధిల్లే విధంగా, ధన ప్రలోభాలను గణనీయంగా తగ్గించి, ప్రజాభిప్రాయానికి చట్టసభల్లో తగు ప్రాతినిధ్యం లభించేందుకు ఉన్నంతలో మెరుగైన దామాషా పద్ధతి ఎన్నికల సంస్కరణలు కావాలి. అమెరికాలో అయితే దేశాధ్యక్ష ఎన్నికల్లో 50 రాష్ట్రాల్లో రెండు చోట్ల తప్ప మిగిలిన చోట్ల మెజారిటీ ఓట్లు తెచ్చుకున్న పార్టీకి అధ్యక్షుడిని ఎన్నుకొనే ఎలక్టోరల్ కాలేజీ ప్రతినిధులను మొత్తంగా కేటాయిస్తారు. కానీ మన దేశంలో నియోజకవర్గాల ప్రాతిపదిక విధానంలో డబ్బున్న పార్టీలే ప్రాతినిధ్యం పొందగలుగుతున్నాయి. కొన్ని పార్టీలకు వచ్చిన ఓట్ల మేరకు ప్రాతినిధ్యం ఉండటం లేదు. దామాషా ప్రాతినిధ్య విధానంలో డబ్బుతో ఓట్లు కొన్నప్పటికీ అలాంటివారు ఎన్నికయ్యే అవకాశం ఉండదు కనుక ఎవరూ డబ్బు పెట్టరు, నిజమైన ప్రజాభిప్రాయం వెల్లడి కావటానికి అవకాశాలు ఎక్కువ. ఇప్పుడు అధికారమే పరమావధిగా ఉన్న పార్టీలు, వ్యక్తులు డబ్బున్న వారికే పెద్దపీట వేస్తూ అధికారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. అందుకే ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వస్తే అన్ని సీట్లు కేటాయించే దామాషా ప్రాతినిధ్యం గురించి ఒక్క వామపక్షాలు తప్ప మిగిలిన పార్టీలేవీ మాట్లాడవు.

తరచూ ఎన్నికల వల్ల ప్రభుత్వాలు దీర్ఘకాలిక విధానాలను రూపొందించే అవకాశాలకు ఆటంకం కలుగుతుందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే ఇలాంటి అవకాశం ఉండదనేది కేంద్రంలో బీజేపీ వాదన. పాలకులు మారినా లక్ష్యాల నిర్దేశం, పథకాలు కొనసాగేందుకు ఏర్పాటు చేసిన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన పెద్దలు, దీర్ఘకాలిక విధానాల గురించి మాట్లాడటం హాస్యాస్పదం, జనాన్ని తప్పుదారిపట్టించే వ్యవహారమే. ప్రతిదానికీ ప్రజాస్వామ్య జపం చేసే వ్యక్తులు, శక్తులూ అభివృద్ధి, ఖర్చు తగ్గించాలనే పేరుతో ప్రజాస్వామిక సూత్రాలకే విఘాతం కలిగించే ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. ఇది ఫెడరల్ సూత్రాలకు, రాజ్యాంగ మౌలిక స్వభావానికే విరుద్ధం. ఇది ఏక వ్యక్తి ఆధిపత్యానికి దారితీస్తుంది. అందువల్ల ఇది ఇక్కడికే పరిమితం అవుతుందన్న హామీ ఏముంది? అసలు బీజేపీ ఈ ప్రతిపాదనను పదే పదే ఎందుకు ముందుకు తెస్తున్నది? పాలకపార్టీ, అధికార యంత్రాంగంలో జరుగుతున్న ఈ చర్య, కదలికల కారణంగానే అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు తమ జాగ్రత్తలు తాము తీసుకుంటున్నాయి.

దేశ అభివృద్ధి, ప్రయోజనాల గురించి తమకు తప్ప మరొకరికి పట్టదని, అలాగే దేశ భక్తి ఇతరులకు లేనట్లుగా, దేశద్రోహులకు మద్దతు ఇస్తున్నట్లు గత 10 సంవత్సరాలుగా ఒక పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నారు. కానీ జమిలి ఎన్నికల విధానాన్ని అనుసరించడం అంటే ప్రజాస్వామ్య మౌలిక తత్వానికి వ్యతిరేకమే అవుతుంది. సార్వభౌమాధికారం ప్రజలకు లేకుండా ఎన్నికలను కేవలం ఒక ప్రక్రియలా, తంతులా భావించినట్టు అవుతుంది. ఈ పద్ధతి అనుసరించడం అంటే ప్రజల బాధ్యత కేవలం అయిదేళ్లకు ఒకసారి ఓటు వేయడానికే పరిమితం చేసి ఆ తరవాత ప్రజలకు ఏ పాత్రా లేకుండా చేయడమే. తదుపరి వ్యవహారం అంతా కార్యనిర్వాహకవర్గం చేతిలోనే ఉంటుంది. క్రియాశీలంగా ఉండే ప్రజలు అయిదేళ్ల పాటు వేచి ఉండలేరు అని డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా చెప్పిన మాటను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ప్రజా ఉద్యమాలతో పాటు రాష్ట్రాలలో మామూలు పద్ధతుల్లో ఎన్నికలు జరుగుతూ ఉంటే ప్రజాస్వామ్య భావాలు వ్యక్తం చేయడానికి వీలుంటుంది. ప్రజాస్వామ్యానికి ఇది చాలా అవసరం. నిజానికి ఎన్నికల నిర్వహణ అంటే ప్రజల కార్యకలాపాల, అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం ఇవ్వడమే. ప్రజాస్వామ్య మనుగడకు ఇది అవసరం. జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తోయడం అంటే జనాభిప్రాయ వ్యక్తీకరణకు అవకాశం లేకుండా చేయడమే.

– నాదెండ్ల శ్రీనివాస్

అమ్మకు వందనం... అమెరికాకు అభివందనం

'మాతృదేవోభవ' అన్న దేశం మనది. ఇటీవల మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఒక్క రోజులోనే 41 ప్రసవాలు జరిగాయి. అందులో 30 మందికి శస్త్రచికిత్సలు జరిగాయి. ఈ మధ్య కాలంలో నేను అమెరికాలోని బెలార్‌స్కాట్ అండ్ వైట్ ఆస్పత్రి (ఫిస్కో)ని సందర్శించాను. అక్కడి డాక్టర్లు, ఇతర సిబ్బంది గర్భిణులకు సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకై ప్రయత్నాలు చేస్తారు. మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవం అయ్యేవరకు డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రినాటల్ కేర్, మెంటల్ హెల్త్ అవేర్‌నెస్, అల్ట్రాసౌండ్ గైడెన్స్, న్యూట్రిషనల్ గైడెన్స్, బర్త్ ప్లానింగ్, పోస్ట్‌పార్టం కేర్ తదితర విషయాలపై త్రికరణశుద్ధిగా సేవలు అందజేస్తారు. మన దేశంలో కూడా ఆశావర్కర్లు మొదలుకొని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలే కాకుండా, అరకొర వసతులున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సైతం గర్భిణులకు సేవలు అందిస్తున్నారు.

అమెరికాలో ప్రసవ సమయంలో గర్భిణులకు మానసిక స్థైర్యాన్ని ఇచ్చేందుకు భర్తను కూడా లేబర్ రూమ్‌లోకి అనుమతిస్తారు. ఇది అభినందించదగ్గ విషయం. ప్రసవానంతరం తల్లీబిడ్డల సంక్షేమానికి నవ్వుతూ వారు అందించే సేవలు కూడా అమోఘం. నవ్వడం ద్వారా ఎండార్ఫిన్ హార్మోన్ల ఉత్పత్తి ఫలితంగా ప్రసవవేదనకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నది శాస్త్రీయమైన విషయం. అలాగే మన దేశంలో కూడా వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నిర్దిష్ట సమయానికి గర్భిణులను ఆప్యాయతతో పలకరిస్తూ, మానసిక ప్రశాంతతను చేకూరుస్తూ సేవలు అందించి వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు అయ్యేలా చూస్తే బాగుంటుంది. అలాగే ప్రసవానంతర సేవలను కూడా త్రికరణశుద్ధిగా అందించి తల్లీబిడ్డల క్షేమానికి పాటుపడాలి.

– రామాచారి డింగరి
జర్నలిజం కౌన్సిలర్, కాకతీయ యూనివర్శిటీ

నలువైపులా సంకెళ్ళతో నేటి ఉపాధ్యాయుడు!

భారత ప్రభుత్వం జాతీయ విద్యా పాలసీ 2020లో మన దేశానికి ఒక మిలియన్ పైగా ఉపాధ్యాయుల అవసరం ఉన్నట్లు అంచనా వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో గణాంకాల ప్రకారం 2.5 లక్షల పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు నిర్ధారించారు. భారతదేశంలో సుశిక్షితులైన ఉపాధ్యాయుల కొరత దేశ అంచనాలకు మించి ఉన్నట్లు యునెస్కో 2021 రిపోర్టులో వెల్లడించింది. సుమారు 1.5 మిలియన్ పాఠశాలలు గల మన దేశంలో 1.1 లక్షల పాఠశాలలను ఒకే ఒక్క ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నాడు.



అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని 1994 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ, విశ్వవ్యాప్త ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (Education International) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ దినోత్సవాన్ని ఉన్నత విద్యను బోధించే అధ్యాపకులకు కూడా వర్తింపజేస్తూ 1997లో మరొక తీర్మానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని స్థాయిలలోనూ ఉపాధ్యాయ వర్గం మానవ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించడానికి, వారిని మరింత ప్రోత్సహించడానికి, వారి సమస్యలను చర్చించడానికి, భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించడానికి, వారిని ఉత్సాహపరచి కార్యోన్ముఖులను చేయడానికి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఒక సందర్భంగా పనికివస్తున్నది.

ప్రపంచంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానం బోధనా రంగంలోనూ పెనుమార్పులకు కారణమైంది. ఈ మార్పులతో వృత్తిని విజయవంతంగా నిర్వహించడం ఉపాధ్యాయులకు సవాలుగా మారింది. కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి తరచుగా ప్రత్యేక శిక్షణలు అవసరమవుతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో విస్తృతమైన విద్యారంగ లక్ష్యాలు సాధించడానికి ఉపాధ్యాయులకు కూడా బహుముఖీన ప్రతిభ అత్యావశ్యకమైంది. సాధారణ విద్యార్హతలతో ఉపాధ్యాయ వృత్తి నిర్వహించడం నేడు అత్యంత సంక్లిష్టంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాసంస్థలు ఆశిస్తున్న ఉన్నత ప్రమాణాలను అందుకోవడం వీరికి అసాధ్యంగా మారుతున్నది. ఉత్సాహవంతులైన యువకులు ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తితో విద్యారంగంలోకి అడుగుపెట్టినా అనివార్యమైన ఒత్తిళ్లకు లోనుకావటంతోపాటు ఆశించినంత వేతనం లభించకపోవడంతో నిరాశతో ఉద్యోగాలు వదిలి వెళ్తున్నారు.

ఉపాధ్యాయులు వారి పిల్లల్ని కూడా తమ ఉద్యోగాలకు ప్రోత్సహించలేని స్థితికి అధ్యాపక వృత్తి దిగజారిపోయింది. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, పదోన్నతులు లేని నిరాశాజనకమైన ఉద్యోగ భవిష్యత్తు, సరైన మౌలిక వసతులు లేని బోధనాలయాలు, తరగతి గదుల్లో పరిమితికి మించిన విద్యార్థులు, అధ్యయనం చేయని శిక్షణ పొందని సబ్జెక్టులను కూడా బోధించమనే ఒత్తిళ్లు లాంటి కారణాలతో ఉపాధ్యాయులలో వృత్తి పట్ల ఆసక్తి, అంకిత భావం సన్నగిల్లుతున్నాయని యునెస్కో భావిస్తున్నది.

విశ్వవ్యాప్తంగా సమర్థవంతమైన ఉపాధ్యాయ వ్యవస్థల నిర్మాణానికి యునెస్కో కృషి ప్రారంభించింది. విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులను కీలకమైన వనరుగా గుర్తిస్తూ వారి అవసరాలను, ఆకాంక్షలను అర్థం చేసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తూ 2030 నాటికి ప్రపంచంలో అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో యునెస్కో 2008లో టీచర్స్ టాస్క్‌ఫోర్స్‌ను స్థాపించింది. ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి టీచర్స్ టాస్క్‌ఫోర్స్ (TTF) విధివిధానాల రూపకల్పన చేశారు. ఈ సంస్థలో ఐక్యరాజ్యసమితి దాని అనుబంధ సంస్థలు, ప్రభుత్వాలు, ప్రభుత్వ–ప్రైవేటు విద్యాసంస్థలు, సభ్యులుగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి నుండి ప్రాంతీయ స్థాయి వరకు ఉపాధ్యాయుల సమస్యలను, బోధనాపరమైన ఇబ్బందులను పరిష్కరించడానికి ఈ సంస్థ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఆధునిక పద్ధతులలో బోధనా నైపుణ్యం, బహుభాషా బోధనలో తగినంత అనుభవంగల ఉపాధ్యాయులు అతి తక్కువగా ఉన్నారు. అగ్రరాజ్యాలు మొదలు బీదదేశాల వరకు ప్రపంచంలోని అన్ని దేశాలూ ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయి. అగ్రరాజ్యం అమెరికాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం పెద్ద సమస్యగా మారింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ విద్యా గణాంకాల కేంద్రం (National Center for Education Statistics – NCES) 2022 డిసెంబరు నివేదికలో అమెరికాలోని 44శాతం ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకుండానే విద్యాబోధన నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. 18శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి లేదా రెండు సబ్జెక్టులలో ఉపాధ్యాయుల అవసరం ఉంటే, 26 శాతానికి పైగా పాఠశాలల్లో మూడు అంతకన్నా ఎక్కువ సబ్జెక్టులలో ఉపాధ్యాయుల అవసరాన్ని NCES గుర్తించింది. 2023 విద్యా సంవత్సరంలో 55 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు కనుగొన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులలో 35 శాతం రానున్న రెండు సంవత్సరాలలో తమ ఉపాధ్యాయ ఉద్యోగాలను వదిలించుకుని అధిక వేతనాలనిచ్చే ఉద్యోగాల కొరకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు NCES సర్వేలో తెలిపారు. ఈ పరిస్థితులలో 2025 నాటికి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు మూడు లక్షల పైచిలుకు ఉపాధ్యాయుల అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అమెరికాలోనే కాదు ఐరోపాఖండంలో కూడా ఉపాధ్యాయుల సమస్యలు సజీవంగానే ఉన్నాయి. యూరప్ ఖండంలోని 44 దేశాలలో 24 దేశాలు తీవ్రమైన ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నట్లు యూరోపియన్ యూనియన్ తెలియజేసింది.

ప్రపంచ జనాభాలో ప్రథమ స్థానంలో ఉన్న భారతదేశం తన అవసరాలకు తగినన్ని విద్యాలయాలు, మౌలిక వసతులతో పాటు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులను నియమించుకోవలసి ఉంది. భారత ప్రభుత్వం జాతీయ విద్యా పాలసీ 2020 (NEP 2020)లో మన దేశానికి ఒక మిలియన్ పైగా ఉపాధ్యాయుల అవసరం ఉన్నట్లు అంచనా వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో గణాంకాల ప్రకారం 2.5 లక్షల పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు నిర్ధారించారు. భారతదేశంలో సుశిక్షితులైన ఉపాధ్యాయుల కొరత దేశ అంచనాలకు మించి ఉన్నట్లు యునెస్కో 2021 రిపోర్టులో వెల్లడించింది. సుమారు 1.5 మిలియన్ పాఠశాలలు గల మన దేశంలో 1.1 లక్షల పాఠశాలలను ఒకే ఒక్క ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న 69 శాతం పైగా పాఠశాలల్లో 19 శాతం పైబడిన ఉపాధ్యాయ ఖాళీలతో విద్యాబోధన తగిన స్థాయిలో జరగడం లేదు. గ్రామీణ పాఠశాలలలో కంప్యూటర్, ఇంటర్నెట్ లాంటి ఆధునిక వసతులను మెరుగుపరచి అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని యునెస్కో భారత ప్రభుత్వానికి సూచించింది. అధిక జనాభా కలిగిన భారతదేశంలో నాణ్యమైన విద్యా సేవలు అందరికీ అందాలంటే భారత ప్రభుత్వం ఉపాధ్యాయ బోధనను అత్యవసర సేవగా గుర్తిస్తూ వెనువెంటనే వారి నియామకాలు నిర్వహించాలని యునెస్కో సూచించింది.


భారతదేశంలోని ఎక్కువ శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయ నియామకాలు నిలిపివేసి ఆ బాధ్యతలను కాంట్రాక్టు ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నాయి. ఈ నియామకాలు నిరుద్యోగులకు తాత్కాలిక ఉపశమనంగా ఉన్నప్పటికీ విద్యావ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను చూపించలేకపోతున్నాయి. తక్కువ వేతనాలకు ఎక్కువ చాకిరి, సకాలంలో చెల్లించని జీతాలు, ఉద్యోగ అభద్రత, భారమైన బోధనేతర బాధ్యతలు లాంటి సమస్యలతో కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఉద్యమాలకు పూనుకుంటున్నారు. చదువులు సంతృప్తికరంగా కొనసాగక విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి మరింత ప్రాధాన్యత నిస్తూ, అవసరమైన ఆర్థిక వనరులను కేటాయించి మరిన్ని ఉపాధ్యాయ నియామకాలు చేయాలి.


ఆచార్యదేవోభవ! అంటూ ప్రణమిల్లి తల్లిదండ్రుల తరువాతి స్థానం ఉపాధ్యాయులకు కల్పించి భారతీయ సమాజం ఉపాధ్యాయ వ్యవస్థకు సమున్నత గౌరవాన్నిచ్చింది. కానీ నేడు ఆ సంస్కారం సమాజంలో సన్నగిల్లుతున్నట్లు ఉపాధ్యాయ వర్గం తరచుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది. ఆదర్శవంతమైన మేధావి వర్గంగా గుర్తించబడ్డ ఉపాధ్యాయులలో కూడా సామాన్య మానవుల్లో ఉండే బలహీనతలు, అవలక్షణాలు తరచుగా కనబడుతున్నాయి. మార్కుల కోసం, ర్యాంకుల కోసం విద్యార్థులను అక్రమాలకు ప్రోత్సహిస్తున్న వారు కొందరైతే లైంగిక వేధింపులకు, మానసిక–శారీరక చిత్రహింసలకు మరికొందరు ఉపాధ్యాయులు పాల్పడుతున్నారు.

అధ్యాపకులు లేని మానవ వికాసాన్ని ఊహించలేం. భావితరాలకు అమూల్యమైన భవిష్యత్తును ప్రసాదించే ఉపాధ్యాయ వృత్తికి ఆశించినంత భవిష్యత్తు లేకపోవడం విచారకం. తరతరాలుగా మానవ సమాజాన్ని విజ్ఞానకాంతిలో మున్ముందుకు నడిపిస్తున్న మన గురుదేవుడు సమస్యల చీకట్లో చిక్కుకోవడం శోచనీయం. అగచాట్ల అంధకారం నుండీ అతి త్వరలో బయటపడి ఉదయభానుడిలా ఆచార్యుడు అక్షరకాంతితో చిరకాలం వెలుగొందాలని కోరుకుందాం!

■ భరత్ వేదాంతం

(అక్టోబర్ 5: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం)






బాలత్రిపుర సుందరిగా
భద్రకాళి

బాల త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు

7

- వృషభ మృగాంక వాహనంపై ఊరేగిన అమ్మవారు
- వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- అమ్మవారికి బంగారు కిరీటం అలంకరణ
- వేడుకలను ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా..

అన్ని మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్-2050

- వచ్చే యేడాది మార్చి నాటికి రూపకల్పన
- సీఎం సూచనలతో మునిసిపల్ అధికారుల కసరత్తు
- ప్రతిపాదనల రూపకల్పనకు ప్రణాళికలు
- 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగం
- బ్లూ-గ్రీన్, గ్రీన్ మొబిలిటీ, గ్రీన్ ప్రాజెక్టులు సైతం అమలు
- ఇక వరంగల్ మాస్టర్‌ప్లాన్ 2040కి కాలం చెల్లినట్టే!

హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా..' నినాదంతో అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న వి నూత్న కార్యక్రమం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు తొమ్మిది మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనున్నది. జీడబ్ల్యుఎంసీతో పాటు మున్సిపాలిటీలకు వచ్చే యేడు మార్చికల్లా మాస్టర్ ప్లాన్-2050 తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మిగతా మున్సిపాలిటీలు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, భూపాలపల్లి మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతగా వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మేజర్ మున్సిపాలిటీలైన జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల మున్సిపాలిటీలకు ఈ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నది. రెండో విడతగా మిగతా మున్సిపాలిటీలపై దృష్టి సారించనున్నది.

సీఎం ఆదేశం మేరకు..

కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా' గురించి వరంగల్‌లోనే సూత్రప్రాయంగా వెల్లడించారు. వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థతో పాటు ఇతర మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంతో అర్బన్ అభివృద్ధి నమూనాపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వరంగల్ మహానగర పాలక సంస్థ మాస్టర్-2050 ప్లాన్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సిద్ధంగా వరంగల్ మాస్టర్ ప్లాన్-2040 ఆమోదానికి సంబంధించిన అంశం చర్చకు వచ్చినప్పుడు సీఎం దీనిని యథాతథంగా ఆమోదించడానికి విముఖత వ్యక్తం చేశారు. పెరిగిన నగర జనాభా, అవసరాల దృష్ట్యా ఈ మాస్టర్‌ప్లాన్‌కు కాలం చెల్లిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన అసంబద్ధ అర్బన్ అభివృద్ధి విధానాల వల్ల అంతా అస్తవ్యస్తంగా మారిందని, మాస్టర్‌ప్లాన్ ఆమోదించకుండా పదేళ్లు తొక్కిపెట్టడం వల్ల నగరం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అర్బన్ ప్రణాళికను అమలు చేయబోతున్నట్టు సూచనాప్రాయంగా తెలియచేశారు. ప్రజల మౌలిక అవసరాలు, భవిష్యత్తులో నగర విస్తరణ, పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్-2040ని సవరించి వచ్చే 26 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ -2050ను రూపొందించాలని ఆదేశించారు. అయితే ఇదే అభివృద్ధి నమూనాను ఒక్క వరంగల్ నగరానికే కాకుండా యావత్ తెలంగాణ పట్టణాలకు వర్తించేలా అన్ని మున్సిపాలిటీల్లో అమలుకు కూడా 2050 మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జీడబ్ల్యుఎంసీతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ -2050లో చెరువుల అభివృద్ధికి బ్లూ-గ్రీన్, కాలుష్య నివారణకు గ్రీన్ మొబిలిటీ, ఉద్గారాల నివారణకు, సౌరవిద్యుత్ వి నియోగం ప్రోత్సహించే దిశగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు భాగంగా ఉంటాయి.

'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో ఉమ్మడి జిల్లాలోని వరంగల్ నగర పాలకసంస్థతో పాటు ఈ తొమ్మిది మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యత లభించనున్నది. వచ్చే యేడు మార్చి కల్లా ఇందుకు సంబంధించి మాస్టర్‌ప్లాన్ -2050 తయారు కానున్నది. రానున్న 26 ఏళ్లలో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించబోతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు ఈ మునిసిపాలిటీలు ఇందులో భాగం కానున్నాయి. మునిసిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది. మాస్టర్ ప్లాన్ -2050తో జిల్లాలోని మునిసిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒన గూరుతాయని అధికారులు వి వరిస్తున్నారు. బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలకు కలిపి 2024-26 సంవత్సరాల్లో రూ.13,700కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరుతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి. రాష్ట్రంలో 130 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.350కోట్లను వెచ్చించనున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లోని చెరువుల సంరక్షణకు సింహభాగం నిధులు అందనున్నాయి.

పలు ప్రాజెక్టులు

వరంగల్ కార్పొరేషన్‌తో పాటు జనగామ, మహబూబాబాద్ మునిసిపాలిటీలు చాలా పెద్దవి. పైగా వ్యాపారర, వాణిజ్య కేంద్రాలు. గ్రానైట్, లేటరైట్, ఇతరత్రా ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఇక్కడి నుంచి రవాణా అవుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని రవాణాపరంగా వాతావరణ కాలుష్యం జరగకుండా నివారించేందుకు బ్లూ-గ్రీన్ ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ పట్టణానికి సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా ప్రతీ పట్టణంలో బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతోంది. బ్లూగ్రీన్ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఉన్న గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, వాటి సుందరీకరణతో పాటు వరదల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, పట్టణాల్లో హరితవనాల పెంపకం వంటివి చేపడతారు. ఇక గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) ప్రాజెక్టుల్లో భాగంగా వరంగల్ నగరంతోపాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి వంటి పెద్ద పట్టణాల్లో విద్యుత్ వాహనాలను పెద్ద ఎత్తున వినియోగించేలా ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గిస్తారు. అవసరమున్న రద్దీ కూడళ్లలో పెద్దసంఖ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణం వంటివి చేపడతారు. గ్రీన్ ఎనర్జీ పట్టణాల పేరుతో ప్రత్యేక ప్రాజెక్టులు కూడా చేపడతారు. నిర్మాణరంగంలో కర్బన ఉద్గారాలు వెలువడకుండా ఆధునాతన పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞాన వినియోగం, సౌర విద్యుత్ వినియోగం వంటి గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలు చేపడతారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- హెచ్ఐవీ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి



వివరాలు తెలుసుకుంటున్న హెచ్ఐవీ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి

వరంగల్ మెడికల్, అక్టోబరు 3: వివిధ వ్యాధులకు గురైన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎయిడ్స్ (హెచ్ఐవీ) నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.హైమావతి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమె గురువారం ధర్మసాగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల తీవ్రత, మందుల సరఫరా, వైద్యులు సేవలు, అందుబాటులో ఉన్న పడకలు, వైద్య సేవలు, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు నమోదైన డెంగీ, మలేరియా వివరాలను, ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్.మురళి, హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సాంబశివరావు, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, ఆర్ఎంవో డాక్టర్ కె.మురళి, డాక్టర్ రాజ్‌కుమార్, వైద్యాధికారి గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా చర్యలు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, అక్టోబరు 3: ఒకే కార్డు అనేక ప్రయోజనాల నినాదంతో అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 48వ డివిజన్ దర్గాలో గురువారం కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిజిటల్ కార్డులు నమోదు కార్యక్రమం చేపట్టారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు., డిజిటల్ కార్డు ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్ వంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 48, 10వ డివిజన్‌లో నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సర్తాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, డివిజన్ అధ్యక్షులు సింగారపు రవిప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖలో సమయపాలనేదీ?

- ఉదయం 11 గంటలు దాటినా కనిపించని అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



ఉదయం 11 గంటలు దాటినా అధికారులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

బాలసముద్రం, అక్టోబరు 3: నీటిపారుదల శాఖ అధికారులు సమయపాలన పాటించడం లేదు. హనుమకొండలోని చింతగట్టులో ఉన్న ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు గురువారం ఉదయం 11గంటలు దాటినా కార్యాలయానికి రాలేదు. దీంతో కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కార్యాలయంలో డీఈఈ, మరో ఇద్దరు అధికారులు మినహా ఎవరూ 11గంటల వరకు కూడా రాకపోవడం గమనార్హం. కార్యాలయంలో సుమారుగా 38 మందికిపైగా ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, ఉదయం ముగ్గురే కనిపించారు. కాగా, ఉదయం 10.30 గంటల వరకే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు విధులకు హాజరు కావాలని కలెక్టర్ ప్రావీణ్య ఇటీవల సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ఇక్కడి ఇరిగేషన్ అధికారులు మాత్రం బేఖాతరు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని అధికారులను గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పక్కా కార్యాచరణతో ధాన్యం కొనుగోలు

- సన్న, దొడ్డు రకాల సేకరణకు వేర్వేరు కౌంటర్ల ఏర్పాటు
- కొనుగోలు సమస్యలపై ఫిర్యాదులకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్
- కలెక్టర్లు కేంద్రాలను నిత్యం తనిఖీ చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 3: పక్కా కార్యాచరణతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్-2024కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయిట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై గురువారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్‌లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నెంబర్ ఏర్పాటు చేయాలని, రైస్‌మిల్లులకు తరలించే ధాన్యం బస్తాలపై ఆ సీరియల్ నెంబర్ వేయాలన్నారు. సన్నరకం ధాన్యం బస్తాలపై తప్పనిసరిగా సీరియల్ నెంబర్ ఉండాలని, దీనికి కార్యదర్శులను వినియోగించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్నీబ్యాగులు అందుబాటులో ఉండేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై రైతులలో ప్రచారం కల్పించాలని, అదేవిధంగా సన్నరకం ధాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. బస్తాలలో నింపిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.



సీఎం రేవంత్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్‌కు హనుమకొండ కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు

కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి

ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌లు బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతీరోజు కలెక్టర్‌లు తనిఖీలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ధాన్యం కొనుగోలులో వచ్చే ఇబ్బందుల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాలకు ధాన్యం రాకుండా చూడాలన్నారు. తాలు, తరుగు అంశంలో అవకతవకలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు ప్రతీరోజు కలెక్టర్‌లతో కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షించాలని అన్నారు. సీఎంవో అధికారులు సైతం నిరంతరం ధాన్యం కొనుగోలును పరిశీలించి రెగ్యులర్‌గా నివేదికలు అందించాలన్నారు.

డీఎస్సీ సర్టిఫికేషన్ పూర్తి చేయాలి: సీఎం

11,062 టీచర్ పోస్టుల భర్తీకోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 కింద 25,239 మందికి ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామని సీఎం అన్నారు. ఇప్పటివరకు 9,090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ జరిగిందని, రెండు రోజుల్లో సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 9 సాయంత్రం 4 గంటలకు ఎంపికైన అభ్యర్థులకు అపాయిట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయాలన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, జిల్లా కలెక్టర్లు దీనిని ప్రాధాన్యత అంశంగా పూర్తి చేయించాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండా సురేఖవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- సాటి మహిళలపై ఇంగిత జ్ఞానం లేకుండా విమర్శలు
- కేటీఆర్‌కు తక్షణమే క్షమాపణ చెప్పాలి..
- మాజీ ఎమ్మెల్యేలు వినయభాస్కర్, నరేందర్



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయభాస్కర్, నన్నపునేని నరేందర్

బాలసముద్రం, అక్టోబరు 3: సాటి మహిళలపై ఇంగిత జ్ఞానం లేకుం డా ఆరోపణలు చేసేంత అహంకారం మంత్రి కొండా సురేఖకు పనికిరాదని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తే సహించేదిలేదని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం వారు విలేఖరులతో మాట్లాడారు. తొలుత వినయభాస్కర్ మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ వ్యక్తిగత విమర్శలు, ఎదురుదాడులు చేయడం సరికాదని, దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని హితవుపలికారు. జిల్లా ప్రజల సమస్యలు, తన శాఖ సమస్యలను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులపై, మహిళలపై ఇష్టానుసారంగా మాట్లాడితే మహిళలు కొండా సురేఖపై తిరగబడతారన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తే భయపడేవారు ఎవరూ లేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా నోరు జారితే సవరించుకోవాలన్నారు. కేటీఆర్‌కు సురేఖ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో ఉన్న కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటారా.. లేకుంటే క్షమాపణ చెబుతారా తేల్చుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులపై రాళ్లు రువ్విన సురేఖను.. 2014 ఎన్నికల్లో ఉద్యమకారులను కాదని ఎమ్మెల్యే చేసిన కేటీఆర్‌ను విమర్శించడాన్ని చూస్తుంటే సురేఖకు విలువలు లేవని తెలుస్తోందన్నారు. మంత్రి కొండా సురేఖ ప్రజలకు అందుబాటులో ఉండరని, మంత్రిగా జిల్లాకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కొండా సురేఖ పద్ధతి మార్చుకోకుంటే బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలే పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. ఇప్పటికిప్పుడు తూర్పు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగితే ప్రజలే తేలుస్తారని అన్నారు. ఈ సమావేశంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, పులి రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టుపై అనిశ్చితి

వరంగల్ మెడికల్, అక్టోబరు 3: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉన్నట్లా? లేనట్లా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోగా, డీఎంఈ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. కాగా, ఇటీవలే ఇక్కడికి ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ రాజేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగాలని డీఎంఈ ఆదేశించారు. అయితే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోలేనని డీఎంఈకి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. డాక్టర్ విజయలక్ష్మి సెలవుపై వెళ్లడం, కొత్తగా డాక్టర్ రాజేశ్వరికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలను తీసుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో జీఎంహెచ్ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడే కేయూ కొత్త వీసీ ఎంపిక

- సెక్రటేరియెట్‌లో సెర్చ్ కమిటీ కీలక సమావేశం
- వీసీ పదవిపై గంపెడాశలతో ఆశావహులు
- హైదరాబాద్‌లోనే తిష్ఠ వేసి గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కాకతీయ యూనివర్సిటీకి కొత్త వైస్ చాన్స్‌లర్ ఎంపిక ప్రక్రియ తుది ఘట్టానికి చేరింది. ఈనెల 4న శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. గతంలో వెలువరించిన నోటిఫికేషన్ మేరకు కేయూ వీసీ పదవి కోసం వర్సిటీలో పనిచేస్తూ 10 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లతో పాటు ఇతర వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో సరైన అర్హతలు, సామాజిక సమీకరణాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అనుభవజ్ఞులైన ముగ్గురిని వీసీ పదవికి సెర్చ్ కమిటీ తుది ఎంపిక చేస్తోంది. కేయూ వీసీ పదవికి సెర్చ్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని అర్హతల మేరకు ఎంపిక చేస్తారు. తుది ఎంపికలో ఖరారైన ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. గవర్నర్ సీఎం ఆమోదంతో సీల్డ్ కవర్‌లోని ముగ్గురిలో ఒక్కరిని వీసీగా ప్రకటిస్తారు. అన్ని అనుకున్నట్లు జరిగితే వారం, పది రోజుల్లో వర్సిటీకి కొత్త వీసీ బాధ్యతలు చేపట్టనున్నారు.

గంపెడాశతో ప్రొఫెసర్లు

కేయూ వీసీ పోస్టుపై గంపెడాశతో ఎందరో అర్హులైన ప్రొఫెసర్లు ఎదురు చూస్తున్నారు. తమకు తెలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తమ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఇప్పటికే పైరవీలకు దిగారు. గతంలో వర్సిటీలో నిర్వహించిన పదవులు, ఇతర అనుభవాలతో పాటు, సామాజిక, రాజకీయ అర్హతలను విన్నవిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. తమకు దగ్గరైన గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతూ ముమ్మరంగా పైరవీలు చేసుకుంటున్నారు. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైర్డు ప్రొఫెసర్లు ఈ దఫా వీసీ పదవికి తీవ్రంగా పోటీ పడుతున్నారు.

ఎస్సీ లేదా ఓసీలకు అవకాశం

కేయూకు ఈ దఫా వచ్చే వీసీ ఎస్సీ లేదా ఓసీ వర్గాలకు చెందిన వారే వస్తారని అంచనా వేస్తున్నారు. గతంలో బీసీ వర్గానికి చెందిన ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం వీసీగా అవకాశం కల్పించింది. అంతకుముందు రెండు దఫాలుగా ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన ప్రొఫెసర్ బి.వెంకటరత్నం, ప్రొఫెసర్ ఆర్.సాయన్నలకు అవకాశం కల్పించింది. ఈ దఫా మళ్లీ ఎస్సీకి అవకాశం ఇస్తారా..? ఓసీ వర్గాలకు ఇస్తారా ? అనే అంశంలో సందిగ్ధత నడుస్తోంది. ఓసీ వర్గాల నుంచి ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి వైఎస్ఆర్ హయాంలో వీసీగా సేవలందించారు. అయితే రాష్ట్రంలోని 10 వర్సిటీల్లో సామాజిక సమీకరణాలు కలిసి రాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో కేయూ వీసీ పదవి బీసీలకు వచ్చే అవకాశం వుంది.

సమర్థులకు అవకాశం వచ్చేనా ?

కేయూ వీసీ ఈ దఫానైనా సమర్థవంతులైన వారికి తగ్గుతుందా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత వీసీ పాలనలో వర్సిటీ అభాసుపాలైంది. అదే క్రమంలో వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా మాజీ వీసీ తాటికొండ రమేశ్ అపఖ్యాతి పాలయ్యారు. విజిలెన్స్ విచారణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో కేయూ సమర్థవంతులైన వారే వీసీగా రావాలని వర్సిటీ అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి. వర్సిటీలో పరిపాలన, బోధన, బోధనేతర సమస్యలతో పాటు సంస్థాగతమైన అనేక ఇబ్బందులున్నాయి. రీసెర్చ్‌తో పాటు క్లాస్‌వర్క్‌లోనూ వెనుకబడింది. వీటన్నింటినీ అధిగమించాలంటే సమర్థవంతులైన వీసీ రావాలనే భావన విద్యావేత్తల్లో నెలకొంది.

సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారితో పాటు మరో ఇద్దరు సభ్యులతో సెర్చ్ కమిటీని నియమించారు. కేయూ సెర్చ్ కమిటీలో జమ్మూ కశ్మీర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ సంజీవ్ జైన్, వర్సిటీ పాలక మండలి నామినీ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎ.దామోదర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారిలు సభ్యులుగా ఎంపికయ్యారు.

పీహెచ్‌డీ సీట్ల కోసం ఆందోళనలు

- సెల్ టవర్ ఎక్కి విద్యార్థుల నిరసన
- సర్ది చెప్పిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డీన్లు, అధికారులు


సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కేయూలో పీహెచ్‌డీ సీట్ల అడ్మిషన్లలో న్యాయం చేయాలని కోరుతూ గురువారం విద్యార్థులు నిరసన, ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయా లంటూ ఏకంగా వర్సిటీ పరిపాలన భవనంలో పురుగుల మందుల డబ్బాలను పట్టుకుని హల్ చల్ చేశారు. అలాగే వర్సిటీలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి దిగడంతో కొద్దిసేపు వర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వర్సి టీ పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్లలో తమకు న్యా యం చేయాలని అనేక దఫాలుగా జిల్లా మం త్రులు, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రా ర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. దీంతో తమకు అడ్మిష న్లలో అన్యాయం జరుగుతోందని ఆరోపిం చారు. గతంలో పీహెచ్‌డీ సీట్ల కోసం తాము ఆందోళనలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. సీఎం రేవం త్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణలు కల్పించుకుని పీహెచ్‌డీ ఆశావహులైన మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌కు అప్పగిస్తే పట్టించుకోకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

విద్యార్థులను మానసికంగా వేధిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజులు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వ గా, శాంతించి సెల్ టవర్ దిగారు. ఈ నిరసన ఆందోళనల్లో పీహెచ్‌డీ ఆశావహులైన మంద నరేశ్, బొట్ల మనోహర్, బందిగ రాకేశ్, తిరుపతి నాయక్, సోరుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హీరో గ్లామర్ ఓజీ ఆవిష్కరణ


హీరో గ్లామర్ ఓజీని ఆవిష్కరిస్తున్న చందుపట్ల సత్యపాల్‌రెడ్డి

బాలసముద్రం, అక్టోబరు 3: హనుమకొండ శ్రీ వైష్ణవి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో హీరో గ్లామర్ ఓజీ (ఒరిజినల్)వాహనాన్ని గురువారం షోరూమ్ అధినేత చందుపట్ల సత్యపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వాహనం ప్రత్యేకతలు గురించి తెలియజేశారు. గ్లామర్ ఓజీ 125 సీసీ హెచ్చు సింబల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్, హెడ్ ల్యాంప్, పుల్లీ డిజిటల్ స్పీడ్ మోటార్స్, ఇండికేట్స్ ఇండికేటర్ హాజార్డ్ స్విచ్, అలాగే సెల్ఫ్ స్టార్ట్ ఇంజన్, కట్ ఆఫ్ స్విచ్ ఈ వాహన ప్రతేకతలని తెలిపారు.

లీటర్‌కు మైలేజీ 65 కిలోమీటర్లు వస్తుందన్నారు. ఈ పండుగకు రెగ్యులర్ గ్లామర్ వాహనాలకు 3000 నుంచి 5000 వరకు నగదు బెనిఫిట్స్ ఇస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధు, సర్వీసు మేనేజర్ జబ్బార్, ఫైనాన్షియర్స్, ఇన్సూరెన్స్ మేనేజర్స్, కన్నమర్ల తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు సందడిగా గురువారం ప్రారంభమయ్యాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 40మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజేందర్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి క్రీడాకారులను ఈనెల 5, 6 తేదీలలో హైదరాబాద్ షేక్‌పేటలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని బాక్సింగ్‌హాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు గిరిధర్, రఘు, కృష్ణమూర్తి, సీని యర్ బాక్సర్లు రెబాన్, దివ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను శనివారం వేలం వేయనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబా టులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శనివారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


వరంగల్ జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ నెల 5 వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో వరంగల్ జిల్లాలో ఎస్జీటీలకు సంబంధించిన 372మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలనను పూర్తిచేసినట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన 10అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేశామన్నారు.

మొత్తం 382 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 233 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, రాష్ట్ర పరిశీలకురాలు జేడీ విజయలక్ష్మి ప్రభుత్వ డైట్ కళాశాల, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరిశీలన కేంద్రాలను సందర్శించారు. సర్టిఫికెట్ల పరిశీలన తీరును ఆమె డీఈవోలను అడిగి తెలుసుకుని సమీక్షించారు.

సెమీ ఫైనల్స్‌కు చేరిన కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు

కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు


98 బాల్స్‌లో 137 పరుగులు సాధించిన విక్రాంత్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. పూల్ బీలోని ఖమ్మం - నిజామాబాద్ జట్ల మధ్య గురువారం కోమటిపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటిం గ్ ఎంచుకున్న నిజామాబాద్ జిల్లా జట్టు నిర్ణీత 45 ఓవర్లను ఎదుర్కొని 207భారీ స్కోరును సాధిం చింది. నిజామాబాద్ జట్టు ఓపెనర్ ప్రతాప్ 48పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ విక్రాంత్ రెడ్డి 98 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 11 సిక్సర్లతో 137 పరుగులు జట్టుకు అందించి భారీ పరుగుల విజయ లక్ష్యాన్ని ఖమ్మం జట్టు ముందుం చాడు. కాగా, 208 పరుగుల భారీ లక్ష్య సాధనలో బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు బ్యాట్స్‌మెన్లు దివిన్ 75 పరుగులు, రత్న ఆర్యన్‌ల 45 పరుగులతో రాణించారు. ఇదే జట్టులోని బౌలర్ ధృవతేజా 4వికెట్లు తీసి ప్రత్యర్థి నిజామాబాద్ జట్టు పరుగులను కట్టడి చేయడంతో పాటు 8వ డౌన్ బ్యాటింగ్ బరిలోకి దిగి 26 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో తమ జట్టు విజయంలో కీలక భూమిక పోషించి ఖమ్మం జట్టు సెమీస్ చేరడంతో కీలక భూమిక పోషించాడు. అదేవిధంగా పూల్ బీలోని ఆదిలాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య వరంగల్‌లోని మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో 63పరుగుల భారీ తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు గాను 46.3 ఓవర్లను ఎదుర్కొని 165 గౌరవప్రదమైన పరుగులు సాధించి ఆలౌట్ కాగా, ఇదే జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ విజ్ఞన్ 59పరుగులతో రాణించాడు. తదుపరి 166 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టు కేవలం 32. 3ఓవర్లను ఎదుర్కొని 102 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 63 పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసి సెమీ ఫైనల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మట్టెడకుమార్ బండారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలత్రిపుర సుందరిగా భద్రకాళి

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ
- అమ్మవారికి బంగారు కిరీటం అలంకరణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 3: స్వయంభూగా కొలువుదీరిన ఓరుగల్లులోని చరిత్రాత్మకమైన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అట్టహాసంగం ఆరంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజు శైలిపుత్రి క్రమంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిత్య, గణపతి, గురుపూజలతో పాటు సుగంధ పరిమళ పూర్ణాభిషేకం, నవరాత్రి వ్రతం ఆరంభం, ధ్వజారోహణం, కలశస్థాపన చేశారు. వీటితో పాటు చండీహోమం, వేద పారాయణం, లక్ష్మీనారాయణ, వనదుర్గా, దేవీ భాగవతం, సుందర కాండ, శ్రీమద్భాగవతం పారాయణాలు, విశేషపూజలు, మహా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన బంగారు కిరీటాన్ని బ్యాంకు నుంచి తీసుకొచ్చి అలంకరించారు. ఉదయం అమ్మవారు వృషభ వాహనంపై ఊరేగగా సాయంత్రం 7 గంటలకు యోగా నిద్రాక్రమంలో మృగజింక వాహనంపై అమ్మవారు ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో శేషు భారతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నైపుణ్యత పెంపొందించుకోవాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: పోలీసు అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యత సాధించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గురువారం జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా నేరస్థులను త్వరితగతిన పట్టుకోవడంతో పాటు ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలరన్నారు. కాగా, ఈ మీట్‌లో అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో చేపట్టే ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో విభాగాల వారీగా ప్రతిభ చూపిన ఇద్దరిని ఎంపిక చేసి ఈ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. ఈ మీట్‌లో జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల గుట్కాల పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలను పెద్ద మొత్తంలో నిల్వ చేసి గుట్టుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యక్తుల నుంచి రూ.10లక్షల విలువ చేసే గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే పక్కా సమాచారం మేరకు కుమార్‌పల్లి మార్కెట్‌లోని లక్ష్మీ జనరల్ స్టోర్ నిర్వహకుడు రాజ్‌పురోహిత్ నుంచి రూ. 6,04,800 విలువ చేసే వివిధ నిషేధిత గుట్కాలు, శివమ్ జనరల్ స్టోర్స్ నిర్వాహకుడు కిరణ్ నుంచి రూ.3,58,300 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో..

హనుమకొండ టౌన్ : ఏనుమాముల పీఎస్ పరిధిలో కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం భారీ మొత్తంలో గుట్కాలను పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గురువారం వరంగల్ ఎన్టీఆర్ నగర్‌లో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగపూర్‌కు చెందిన గుట్కా సరఫరాదారుడు రావి శ్రీధర్, స్థానికుడైన పాన్‌షాపు నిర్వాహకుడు గుండ క్రిష్ణల నుంచి రూ.8,91,100 విలువ చేసే గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

దండకారణ్యంలో ఏం జరుగుతోంది ?

- కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం!
- చర్చనీయాంశంగా మారిన మావోయిస్టుల రాక
- పోలీసుల ఆరా

వాజేడు, అక్టోబరు 3: దండకారణ్యం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించినట్టు ప్రచారం జరుగుతోంది. మండలంలోని కోయవీరాపురం అడవుల్లో నాలుగు రోజుల క్రితం మావోయిస్టులు సమావేశమైనట్టు సమాచారం. గ్రామంలోకి సాయుధులైన మావోయిస్టులు అర్ధరాత్రి వేళ ప్రవేశించి సమావేశం నిర్వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు కోయవీరాపురంలో భేటీ అయి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. ఓ వైపు డీజీపీ తెలంగాణలో మావోయిస్టులు లేరని ప్రకటనలు చేస్తున్న క్రమంలో ఏజెన్సీ మండలమైన వాజేడులో మావోయిస్టులు ఈ సమావేశం నిర్వహించారనే విషయం సంచలనంగా మారింది. మావోయిస్టులు తమ పార్టీ కార్యకలాపాలను చాపకింద నీరులా నిర్వహిస్తున్నట్టు తెలుస్తుండగా ప్రశాంతంగా ఉన్న వాజేడు మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

కొన్నేళ్లుగా వాజేడులో మావోయిస్టుల కార్యకలాపాలు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో తాజా సంఘటన టార్గెట్‌గా ఉన్న నేతలను కలవరపెడుతోంది. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల్లో ఆందోళన నెలకొన్నట్టు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, జిల్లాలోని వెంకటాపురం(నూగూరు) సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం వాజేడు మండలంలో మావోయిస్టులు సమావేశం నిర్వహించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దండకారణ్యంలో ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల అదుపులో గిరిజనులు ?

కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించారనే అంశంపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశం ఆలస్యంగా పోలీసుల చెవిన పడడంతో తమకు ఉన్న నిఘా వ్యవస్థతో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. కోయవీరాపురానికి చెందిన ఓ 10 మంది గిరిజనులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశంలో పాల్గొన్నారా.. ? లేదా సహకరించారా ? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. సీఐతో పాటు పలువురు ఎస్సైలు ఈ కీలక ఘటనపై వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టులు, పోలీ సుల మధ్య అమాయక గిరిజనులు నలుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతుండగా మావోయిస్టుల సమావేశంపై ఇప్పటి వరకు పోలీసు వర్గాలు అధికారి కంగా ధ్రువీకరించలేదు.



ప్రొఫెసర్ సుదర్శన్‌కు పురస్కారం

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కాకతీయ యూనివర్సిటీ న్యాయకళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏఆర్ఏఐ పురస్కారం, జగదీశ్ చంద్రబోస్ (జేసీ) అవార్డులకు సంయుక్తంగా ఎంపిక చేసి ప్రకటించింది. ఈ మేరకు గురువారం కేరళ రాష్ట్రం వాయినడ్‌కు చెందిన అసోషియేషన్ ఆఫ్ రిసెర్చ్ అండ్ అకడమిక్ ఇండియా (ఏఆర్ఏఐ) జనరల్ సెక్రటరీ సుదర్శన్‌కు ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం, జేసీ అవార్డులను-2024 సంయుక్తంగా ప్రకటించినట్లు స్వయంగా వెల్లడించారు. సుదర్శన్ అకడమిక్ అంశాలతో పాటు రిసెర్చ్ పరంగా న్యాయశాస్త్రం విభాగంలో చేసిన సేవలకు గుర్తింపుగా తమ సంస్థ విషయ నిపుణుల కమిటీ సదర్శన్‌ను ఆయా పురస్కారంతో పాటు అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ రిసెర్చ్, అకడమిక్ ప్రొఫైల్ కల్గిన అనేక మంది ప్రొఫెసర్లలో సుదర్శన్ ఎంపిక కావడం కాకతీయ వర్సిటీకి గర్వకారణం. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌ను వర్సిటీ పాలక మండలి సభ్యులతో పాటు ప్రొఫెసర్లు, పరిశోధకులు అభినందించారు.



గోకుల్ జంక్షన్‌లో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

మంత్రి సురేఖకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

వడ్డెపల్లి, అక్టోబరు 3: రాష్ట్ర అటవీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే మంత్రి సురేఖకు క్షమాపణ చెప్పాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ మంత్రి కొండా సురేఖపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హనుమకొండ ఎస్‌వీఎస్ కాలనీ రోడ్డులోని గోకుల్ జంక్షన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కేటీఆర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బొంత సుజాత, 59వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు తేళ్ల సుగుణ కిశోర్, జిల్లా నాయకురాళ్లు విజయ, బొల్లు భాగ్యలక్ష్మి, మౌనిక, లక్ష్మి, కొమురమ్మ, సరస్వతి, వరలక్ష్మి, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు

వడ్డెపల్లి, అక్టోబరు 3: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. హను మకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రపంచ కార్మిక సంఘాల సమైఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేతలు తేలూరి ఉప్పలయ్య, పుల్ల అశోక్, బొల్లారం సంపత్, అలకుంట్ల యాకయ్య, నవనీత, యశ బాబు, మల్లయ్య, శ్రీనివాస్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

కేయూలో ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదాన శిబిరం

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కేయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ కల్నర్ ఎస్ఎస్ రమదురై నేతృత్వంలో వరంగల్, ఖమ్మంలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం రక్త దానం చేశారు. ఎన్‌సీసీ, వరంగల్ ఎంజీఎం బ్లడ్ బ్యాంకు సిబ్బది నేతృత్వంలో రక్తదాన సేకరణ చేప ట్టారు. వర్సిటీలో అడ్మిషన్ల డైరెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు విజయ్, స్వామి, రాజమాణిక్యం, అరుణ, కుమారస్వామి, సతీశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. వర్సిటీలో అక్టోబరు 9 వరకు ఎన్‌సీసీ క్యాడెట్ల క్యాంపు సాగుతోందని తెలిపారు. దీనిలో వ్యక్తిత్వ వికాసం పై ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఎన్‌సీసీ అధికారులు వెల్లడించారు.

రెవెన్యూశాఖలో సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: రెవెన్యూశాఖలో జిల్లావ్యాప్తంగా 16 మంది సీనియర్ అసిసెంట్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే కేటాయించిన కార్యాలయాల్లో రిపోర్ట్ చేయా లని, ఆయా ఉద్యోగులను సంబంధిత అధికారులు కార్యాలయాల్లో జాయిన్ చేసుకొని వారి జాయినింగ్ తేదీలను కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో అందజేయాలని ఆదేశించారు. ఆదేశాలను పాటించడంలో ఆలసత్వం వహిస్తే సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ భూమిని ఆక్రమించిన ప్రైవేటు కాలేజీ

లోకాయుక్త విచారణలో ఈవో వెల్లడి.. యాజమాన్యానికి నోటీసులు జారీ

హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో చారిత్రకంగా సుప్రసిద్ధమైన సిద్దేశ్వరాలయానికి చెందిన 1089 గజాల భూమిని ఒక ప్రైవేటు కాలేజీ యాజమాన్యం ఆక్రమించిందని ఆ ఆలయ ఈవో కె.వెంటకయ్య లోకాయుక్త విచారణ సందర్భంగా వెల్లడించారు. ఈ కాలేజీ యాజమాన్యానికి నోటీసులు కూడా జారీ చేసినట్టు తెలిపారు. గురువారం లోకాయుక్తలో పద్మాక్షి, సిద్దేశ్వర, రంగనాయకస్వామి, వీరపిచ్చమాంబ, వేణుగోపాలస్వామి దేవాలయాల భూముల కబ్జాపై విచారణ జరిగింది. సిద్ధేశ్వర ఆలయం కార్యనిర్వహణ అధికారి కెవెంకటయ్య, పద్మాక్షి ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.ప్రసాద్‌తో పాటు ఫిర్యాదిగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరయ్యారు. లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు నిర్వహించిన విచారణలో సిద్ధేశ్వర ఆలయానికి సంబంధించి 1089 గజాల భూమిని ఒక ప్రైవేటు యాజమాన్యం అక్రమించిందని, రెండు దఫాలుగా జరిపిన ఈ సర్వేలో ఈ అక్రమ కబ్జా ధృవపడిందని ఈవో వెంకటయ్య తెలిపారు. దీంతో ఆ కాలేజీ యాజమన్యంపై దేవాదాయ ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలు చేయడానికి సెక్షన్ 30-1987 ప్రకారం నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. అంతేకాకుండా 2.15 ఎకరాలు కబ్జా చేసిన హైస్కూల్ భూమి రెవెన్యూ పరిధిలోకి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో తదుపరి విచారణను నవంబర్ 7వ తేదీకి లోకాయుక్త జస్టిస్ రాములు వాయిదా వేస్తూ ఆ రోజు దేవాదాయ శాఖతో పాటు రెవెన్యూ అధికారులు కూడా తప్పని సరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

వైభవంగా శరన్నవరాత్రులు

వేయి స్తంభాల గుడిలో ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడిలో గురువారం రుద్రేశ్వరీ దేవి శరన్న వరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే నాయిని దంపతులు ఆలయానికి చేరుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శరన్నవరాత్రి ఉత్సవాల తొలి రోజు అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండీ యాగం కూడా ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు ఈ యాగం కొనసాగుతుంది. ఈ తొమ్మిది రోజులు సీఎంఆర్ గ్రూప్ నిత్యాన్నదానాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం బత్తిని శ్రీనివాస్ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. గురువారం బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్ హరికథా కాలక్షేపం జరిగింది. శ్రీ రుద్రేశ్వర సేవాసమితి అధ్యక్షుడు కోన శ్రీఖర్ ఉత్సవ విగ్రహదాత పల్లం రమేష్, కొటిల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పోతుల శ్రీమాన్, నాయిని లక్ష్మారెడ్డి, రావుల మదు, పులి రజనీకాంత్, రావుల సుదర్శన్, తదితరులు భక్తులకు విశేష సేవలు అందించారు.

శైలిపుత్రి అలంకరణలో అమ్మవారి దర్శనం

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని భ్రమరాంబికదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయధర్మదాయశాఖ ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా మొదటి రోజు గురువారం దుర్గామాత మొదటి స్వరూపమైన శైలిపుత్రి అలంకరణంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రాతఃకాలంలో సుప్రభాతసేవతో అమ్మవారిని మేలుకొలిపారు. చివరన నవరాత్రి వ్రతారంభం, నిత్యాహ్నికం, మహానైవేద్యమ, నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మదుకర్ శర్మ, వేదపండితుడు విక్రాంత్ వినాయకజోషి, అర్చకులు భానుశర్మ, నరేష్‌శర్మ, మధుశర్మ, ఉప్పల శ్రీనివాస్, ఉద్యోగ సిబ్బంది, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



వేయిస్తంబాలగుడిలో శ్రీ రుద్రేశ్వరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు రుత్వికులు ఉపద్రష్ట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కలశ స్థాపన, మండపారాధన జరిపించారు. కార్యక్రమంలో దువ్వ విజయ, కోతుల రాజేశ్వరి, సరస్వతి, రజిత, లక్ష్మితో పాటు భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన బల్దియా అధికారులు

రాఘవేంద్ర నగర్ ఫేస్ -2 కాలనీ ప్రతినిధుల ధ్వజం

వడ్డెపల్లి, అక్టోబరు 3: గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ రాఘవేంద్ర నగర్ ఫేస్ -2 కాలనీలో అభివృద్ధి పనులను చేపట్టకుండా మహా నగర పాలక సంస్థ అధికారులు విస్మరించారని కాలనీ ప్రతినిధులు ఎల్తూరి కుమారస్వామి, ఆక రవి, ఎం.డి. సర్వర్ ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2018లో రోడ్డు నంబర్ 2/ఏ వద్ద సీసీ రోడ్డు వేసిన మున్సిపల్ అధికారులు దానిపై కల్వర్టు నిర్మించకపోవడం వలన రోడ్డు సౌకర్యం లేక నరక యాతన అనుభవిస్తున్నామని అన్నారు.

కుడా ఏడీపీ నంబర్ 56/2008 ప్రకారం తమ కాలనీకి 30 ఫీట్ల రోడ్డు ఉందని అధికారులు అంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో చర్చితోపాటు ఒక అపార్ట్‌మెంట్, నివాస గృహాలు ఉన్నాయని అన్నారు. ఇంటి అనుమతులు ఎల్ఆర్ఎస్ కట్టి తీసుకున్నామని చెప్పారు. అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నా స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్‌తో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తమ కాలనీని సందర్శించి సౌకర్యాలను కల్పించాలని వారు కోరారు. సమావేశంలో రాఘవేంద్ర నగర్ ఫేస్ -2 కాలనీ ప్రతినిధులు బానోత్ మంగ, సుధాకర్, వసంత, రజిత, చైతన్య, శివ, రాకేష్, సురేష్, శ్రీధర్, రాము, ప్రశాంత, ఆక రాధాకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కాలనీవాసులు

పీహెచ్‌సీకి నిధులు కేటాయించాలి

న్యూశాయంపేట, అక్టోబర్ 3: న్యూశాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బకాయి నిధులు వెంటనే కేటాయించాలని సీపీఐ జిల్లా నాయకుడు వేల్పుల సారంగపాణి, ఎశబోయిన శ్రీనివాస్ కోరారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందా? హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి 18 నెలల నుంచి నిధులు రావడం లేదని, వెంటనే వారి బకాయి నిధులు కేటాయించి న్యాయం చేయాలన్నారు. అలాగే ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన భవనాన్ని మరమ్మతు చేయించాలని, హాస్పిటల్‌కు సంబంధించిన వైద్య పరికరాలతో పాటు నాణ్యమైన మందులు సరఫరా చేసి స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, హాస్పిటల్ డాక్టర్ మౌనిక, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న వేల్పుల సారంగపాణి

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

ధర్మసాగర్, అక్టోబరు 3: వారిద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇద్దరు కలిసి సహజీవనం కూడా చేశారు. రహస్యంగా వివాహం చేసుకున్నారు. విషయం తెలిసిన ప్రియుడి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించడంతో ముఖం చాటేశాడు. దీంతో ప్రియుడి ఇంటి ఎదుట నిరసనకు దిగింది ప్రియురాలు. ఈ ఘటన ధర్మసాగర్ మండలం ధర్మాపురంలో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ జిల్లాకు చెందిన యువతి అమ్మమ్మ స్వగ్రామం ధర్మాపురం కావడంతో అప్పుడప్పుడు గ్రామానికి వస్తూ పోతూ ఉండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గై సంతోష్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరు మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. 2023 నవంబర్‌లో కోమల్ల దేవాలయంలో రహస్యంగా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ తర్వాత హనుమకొండ, హైదరాబాద్ నగరాలలో కాపురం పెట్టి సహజీవనం చేశారు. వీరు పెళ్లి విషయం సంతోష్ తల్లిదండ్రులకు తెలియడంతో యువతిని కొద్ది రోజుల పాటు పుట్టింటికి పంపించాడు. ఆతర్వాత సంతోష్ తన సిమ్‌కార్డును మార్చుకున్నాడు. దీంతో అనుమానం వచ్చిన యువతి.. నెల కిందట ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. న్యాయం జరగకపోవడంతో మామునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరువర్గాలను పిలిపించి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించారు. అయినా సంతోష్ తరపు వారు పంచాయితీని పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో గురువారం బాధితురాలు మహిళా సంఘాల సహకారంతో సంతోష్ ఇంటి వద్దకు వచ్చి బైఠాయించింది.

అటవీశాఖలో 'అదనపు ఖర్చు'!

ఉన్నతాధికారుల రాచ మర్యాదలకు జేబులకు చిల్లు

సతమతమవుతున్న ప్రొటోకాల్ ఉద్యోగులు

రెడ్డికాలనీ, అక్టోబరు 2: అటవీశాఖలో 'అదనపు ఖర్చు'లపై కిందిస్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తమ జేబులో నుంచి వెచ్చించడంపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల అవసరాలతోపాటు రాష్ట్రస్థాయి అధికారులు, వారి బంధువులు జిల్లాలకు విచ్చేసిన సందర్భంలో వారికి రాచమర్యాదలు చేయలేక ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సతమతమవుతు న్నారు. తమకొచ్చే జీతం అంతా అదనపు ఖర్చులకే సరిపోతోందని లోలోన మథనపడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..

అటవీశాఖ భద్రాద్రి జోన్ పరిధిలో జోనల్ అధికారుల నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారుల వరకు వివిధ సమావేశాలు, సమీక్షలకు హనుమకొండ, వరంగ ల్ నగరానికి వస్తుంటారు. వీరికి తోడు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కూడా పనుల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. వీరికి వసతి, సౌకర్యాలు డిప్యూటీ రేంజర్ స్థాయి అధికారులు సమకూర్చుతారు. వీరే ప్రొటోకాల్ విధులను కూడా నిర్వర్తిస్తారు. అయితే ఎవరు వచ్చినా క్షణాల్లో సకల రాచమర్యాదలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించరు కానీ అన్నీ సమకూర్చాలి. మర్యాదలో ఏదైనా లోపం వస్తే అధికారుల ఆగ్రహ జ్వాలలకు బలికావాల్సిందే.

పర్మిట్లు, లైసెన్సులకు వసూలు చేయండి..

గెస్ట్‌హౌస్‌తోపాటు ప్రొటోకాల్ ఖర్చుల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి డీఆర్‌వోలు తీసుకెళితే పర్మిట్లు, లైసెన్సులు ఇచ్చేటప్పుడు వసూళ్లు చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. కొందరు అధికారులైతే ఏకంగా ఇంటి సామగ్రి కూడా ప్రొటోకాల్ అధికారులతో తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రొటోకాల్ సిబ్బందికి ఏదైనా పని ఉంటే విధుల కోసం మరో సిబ్బందిని నియమించి వెళ్లాల్సి వస్తోంది. అలాగే అటవీశాఖలో భద్రాద్రి జోన్‌లోని 12 డివిజన్లలో ప్లాంటేషన్, నర్సరీ, చెక్ డ్యామ్‌లాంటి వివిధ రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పర్యవేక్షణతో వచ్చే అధికారులు కమీషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నట్లు స్థానిక అధికారులు వాపోతున్నారు. వీటిపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టి సారించాలని సిబ్బంది కోరుతున్నారు. ప్రొటోకాల్ అవసరాల కోసం నిధులు విడుదల చేయాలని అంటున్నారు. ఉన్నతాధికారుల వేధింపుల నుంచి తమను రక్షించాలని వేడుకుంటున్నారు.

మూసీ ప్రక్షాళనపై కేటీఆర్‌ది రెండు నాలుకల ధోరణి

ఐనవోలు, అక్టోబరు 3: మూసీ నది ప్రక్షాళనపై కేటీఆర్ రెండు నాలుకల ధోరణి అలంభిస్తున్నారనీ, ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ ఎద్దేవ చేశారు. గురువారం ఆయన ఐనవోలులో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ మునిసిపల్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన అధ్యక్షతన 2022 జనవరిలో నానక్‌రామ్‌గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించార న్నారు. ఆ సమావేశంలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, స్పెషల్‌సీఎస్ అరవింద్ కుమార్, ఎంఆర్‌డీసీఎల్ ఎం.డి. ఐపీఎస్ అధికారి విశ్వజిత్‌కంపాటి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, చంద్రకళ, మాలతిలతో ఏర్పాటు చేసిన సమీక్షలో మూసీ నది బఫర్‌జోన్ నిర్ధారించాలని కేటీఆర్ ఆదేశించారన్నారు. మూసీకి ఎడమ, కుడి రెండు వైపులా 55 కిలో మీటర్ల చొప్పున హద్దులను నిర్ణయించాలని తెలిపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన చేపడితే కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా లేనప్పుడు ఒకరకంగా ప్రజలను రెచ్చగొడుతూ ద్వంద విధానాలకు పాల్పడుతున్నారు. ప్రజలను తప్పుదోవపట్టించడం మానుకొని భవిష్యత్ అవసరాల దృష్ట్యా మూసీ ప్రక్షాళనకు సహకరించాలని కోరారు.



మూసీ నది ప్రక్షాలనపై కేటీఆర్ గతంలో నిర్వహించిన సమీక్ష పత్రాన్ని చూపిస్తున్న సుధాకర్‌గౌడ్

ధ్యాన మందిర నిర్మాణానికి అన్ని అనుమతులు

సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారా యణ రెడ్డి

కాళోజీ జంక్షన్, అక్టోబరు 3: హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో నిర్మించిన శ్రీరామకృష్ణా సేవా సమితి ధ్యాన మందిరం అన్ని ప్రభుత్వ శాఖల నియమ నిబంధనలను పాటించినట్లు సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు ప్రేరేపిత శక్తులు కాలనీ వాసులను తప్పుదోవ పట్టించి మందిరం ముందు నిరసనగా బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మందిరం నిర్మాణానికి కుడా, మున్సిపల్ శాఖల అనుమతులతో పాటు భూమి పట్టేదారు అనుమతి , సీలింగ్ మినహాయింపు, జీ+3 భవన నిర్మాణానికి పర్మిషన్ ఉందని సత్యనారాయణ రెడ్డి వివరించారు. ఆ స్థలం కాలనీవాసుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిందని చెప్పడం విడ్డూరమని లేఅవుట్ అనుమతులులేని కాలనీకి కమ్యూనిటీ స్థలం ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. కాలనీ వాసులను కొందరు వ్యక్తులు తప్పుదోవ పట్టించడం సబబుకాదని తాము కూడా కాలనీలో ఇంటింటికీ తిరిగి అసలు దోషులెవరో అవగాహన కల్పిస్తామని, వాస్తవమేమిటో కాలమే నిర్ణయిస్తుందని సేవా సమితి నాయకులు వివరించారు. విలేకరుల సమావేశంలో సత్యనారాయణ రెడ్డితో పాటు రామకృష్ణా సేవా సమితి ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సభ్యులు కె. శ్రీనివాస స్వామి, కేవీ రావు, కె.సూర్య, చిదర అంజనీదేవి, పడిదల అనిత, బోయినపల్లి పార్వతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కటంగూరి సత్యనారాయణ రెడ్డి

ఎస్సార్‌యూలో ఘనంగా స్వాగతమ్ వేడుకలు

హసన్‌పర్తి, అక్టోబరు 3: మండలంలోని అనంత సాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బుధవారం స్వాగతమ్-2024 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్ గార్గ్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని విశ్వవిద్యాలయంలో నిర్వహించే సాంస్కృతిక, క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్టార్ట్ అప్‌డేట్ టెక్నికల్ క్లబ్ ఆక్టివిటీస్ అకాడమిక్ క్యాలండర్‌లో పొందు పర్చిన వివిధ ఈవెంట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి మాట్లాడుతూ.. వేడుకలు మన ప్రతిభను వెలుగులోకి తీసుకువస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి వేడుకలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభ ద్వారా పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. డీన్ డాక్టర్ ఏవివి .సుధాకర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఫ్రెషర్స్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా యాజమాన్యం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ శశి, యూనివర్సిటీ డీన్స్, వివిధ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అనుదీప్‌దేవ్, భాస్కర్‌ల గానం

ప్రముఖ గాయకులు అనుదీప్‌దేవ్, అనన్య భాస్కర్‌ల గానం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ట్రిపుల్ ఆర్, డిజే టిల్లు, పుష్ప, గుంటూరు కారం పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెండు గంటల పాటు సాగిన గాయకుల పాటలకు విద్యార్థులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సంబురంగా గడిచింది.



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న వీసీ డాక్టర్ దీపక్‌గార్గ్

సకల జనుల సంక్షేమమే లక్ష్యం

వడ్డెపల్లి, అక్టోబరు 3: సకల జనుల సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) (ఆర్‌పీఐ (ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగొమ్ముల స్నేహలత అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్‌పీఐ (ఏ) 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ వాదుల సమక్షంలో వారు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్, స్నేహలత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్‌పీఐ(ఏ) ఆధ్వర్యంలో లక్ష సభ్యత్వాల కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రంలో ఆర్‌పీఐ జెండాను ఎగరవేయడమే తమ ధ్యేయమని అన్నారు.

అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లతో పాటు పేదలను గుర్తించి భూమి పంచే బాధ్యతను తమ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ (ఏ) రాష్ట్ర, జిల్లా నాయకులు పిల్లి క్రిష్టఫర్, ఎర్ర చంద్రమౌళి, వక్కల కుమార్, ఎస్తేరు, రేణిగుంట్ల శ్యాంసుందర్, సౌరం రఘు, మంద రాజశేఖర్, ఓరుగంటి స్వామి, బుర్రి విజయ్, జన్ను భరత్, దుప్పటి ప్రమీల, సామెల్ తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్ భవనంలోనే ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు

ఐనవోలు, అక్టోబరు 3: ఐనవోలు మండలకేంద్రంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన భవనాన్ని గురువారం జడ్పీ సీఈవో విద్యలత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హనుమకొండ వడ్డెపల్లిలో కొనసాగుతున్న ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని ఐనవోలుకు మార్చాలని మూడు రోజుల కిందట కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు చేసింది తెలిసిందే. అందులో భాగంగా జడ్పీ సీఈవో, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఎంఈవో ఆనందం, పీఆర్ ఏఈ సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సరిత, హాస్టల్ వార్డెన్‌లు ఐనవోలులో ఖాళీగా ఉన్న హాస్టల్ భవనంతోపాటు ఎంఆర్సీ భవనాలను పరిశీలించారు. రెండు భవనాల్లో హాస్టల్ భవనం ఒక హాల్, మూడు గదులతో విశాలంగా ఉంది. హాస్టల్ భవనం పక్కనే రైతు వేదిక, కమ్యూనిటీ హాల్ ఉన్నాయి. మండల సభలు, సమీక్ష సమావేశాలు రైతు వేదికలో నిర్వహించుకునేందుకు అనుకూలంగా ఉంది. ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని ఎంఆర్సీ భవనంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే పాఠశాల విద్యార్థులతోపాటు కేజీబీవీ విద్యార్థులు, ఎంఈవో స్టాఫ్‌కు అసౌకర్యం కలుగుతుంది. విద్యార్థులు లేక మూతబడి ఖాళీగా ఉన్న హాస్టల్ భవనమే ఎంపీడీవో కార్యాలయానికి ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. చిన్న చిన్న మరమ్మతులు చేయడానికి కావాల్సిన నిధుల మంజూరుకు పీఆర్ ఏఈ ప్రతిపాదన తయారు చేసి ఇవ్వాలని సీఈవో ఆదేశించారు. ఎంపీడీవో నూతన భవన సముదాయం నిర్మాణం అయ్యే వరకు హాస్టల్ భవనంలోనే ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు.

దేవీ నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ గాయత్రీ దేవి
ఆశ్వయుజ శుద్ధ విదియ, శుక్రవారం

శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండోరోజున విజయవాడలో కనకదుర్గమ్మ వారు నేడు గాయత్రీ దేవిగా దర్శనమిస్తారు. ఈ అలంకారంలో ముత్యం, పగడం, స్వర్ణం, నీలం, శ్వేత వర్ణాలతో అలరారే అయిదు ముఖాలతో, ప్రతి ముఖంలో మూడు నేత్రాలతో, శిరస్సున చంద్రరేఖతో, దశ హస్తాలలో ఆయుధ- ఆభరణాలు ధరించి అమ్మవారు ప్రకాశిస్తారు. సకల మంత్రాలకూ మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠానదేవత. ఈ తల్లి శిరస్సుపై బ్రహ్మ, హృదయ



భాగంలో విష్ణువు, శిఖలో రుద్రుడు నివసిస్తారట! అందుకే త్రిమూర్త్యాంశగా గాయత్రీదేవి వెలుగొందుతోంది. వరద, అభయహస్తాలతో... సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. ప్రాతఃకాలంలో గాయత్రిగానూ, మధ్యాహ్నకాలంలో సావిత్రిగానూ, సాయంసంధ్యలో సరస్వతిగానూ ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. సమస్త దేవతా మంత్రాలకూ గాయత్రి మంత్రంతో అనుబంధం ఉంది. వివిధ దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి రుద్రగాయత్రి, లక్ష్మీగాయత్రి, విష్ణుగాయత్రి అని గాయత్రీ మంత్రాన్ని కలిపి చెబుతారు. ఆమెను సర్వదేవతా స్వరూపిణిగా భావిస్తారు. గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే దేవతలకు నివేదన చేస్తారు. గాయత్రీ మంత్రానికి అధిష్ఠాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల భక్తులకు సౌరశక్తి ప్రాప్తమవుతుందనీ, ఆరోగ్యం చేకూరుతుందనీ పెద్దల మాట. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్నిస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ అమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయనీ, పాపాలు నశిస్తాయనీ, అజ్ఞానం తొలగిపోతుందనీ పెద్దల మాట.

నైవేద్యం: అల్లం గారెలు, ఐదు రకాల పిండివంటలు
అలంకరించే చీర రంగు: తెలుపు
పారాయణ చెయ్యాల్సింది: గాయత్రీ మంత్రం

సమాచారం

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి.

మొదటిరోజు - అక్టోబరు 4: ఉదయం 5.45 గంటల నుంచి 6.00 గంటల వరకూ ధ్వజారోహణం, బంగారు తిరుచ్చి ఉత్సవం (మధ్యాహ్నం 3 గంటలకు), పెద్ద శేష వాహనం (రాత్రి 9 గంటలకు)
రెండో రోజు - అక్టోబరు 5: చిన్న శేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)
మూడో రోజు - అక్టోబరు 6: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)
నాలుగో రోజు - అక్టోబరు 7: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వ భూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)
అయిదో రోజు - అక్టోబరు 8: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)
ఆరో రోజు - అక్టోబరు 9: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), స్వర్ణ రథోత్సవం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)
ఏడో రోజు - అక్టోబరు 10: సూర్య ప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)
ఎనిమిదో రోజు - అక్టోబరు 11: రథోత్సవం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)
తొమ్మిదో రోజు - అక్టోబరు 12: పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం (తెల్లవారుజామున 3 గంటల నుంచి), చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), ధ్వజావరోహణం (రాత్రి 8.30 గంటలకు)

శ్రీవారితో చెలగాటం వద్దు..



ఇటీవల కాలంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి లడ్డు ప్రసాదం కల్తీ గురించి ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలవారు చర్చించుకుంటున్న విషయం విదితమే. శ్రీవారి సన్నిధిలో నాలుగేళ్లపాటు ఉన్నతస్థాయి ఉద్యోగిగా... స్వామివారి సేవ చేసుకున్న అదృష్టం నాకు కలిగింది. స్వామివారి మహిమాది విషయాలను సంహితలను అనుసరించి నేను తెలుసుకున్నది చెప్పాలనుకుంటున్నాను. స్వామివారి తత్త్వాన్ని గురించి, మహిమను గురించి అనేక వైష్ణవ సంహితలు వివరించాయి. పరమపురుష, శాండిల్య, భరద్వాజ, వైహాయసీ సంహితలలో పేర్కొన్న కొన్ని ముఖ్యమైన అంశాలను తెలుసుకోవడం స్వామివారి భక్తుల కనీస బాధ్యత.

ఎంతో పుణ్యం చేసుకుంటే మానవజన్మ తప్ప లభించదు. మానవజన్మ లభించినప్పటికీ స్వామివారి సేవ, దర్శన భాగ్యాలు పొందగలగడం అందరికీ సాధ్యం కాదు. జన్మాంతర సహస్రకృత తపోధ్యాన, సమాధుల కారణంగా పాపవిముక్తులైనవారికి మాత్రమే స్వామి వారి పట్ల భక్తిప్రపత్తులు ఉండే భాగ్యం లభిస్తుంది. సత్పురుష సాంగత్యం వల్ల కూడ భక్తితత్త్వం కల్గుతుంది. ఇవి రెండే కాకుండా తీసుకొనే ఆహారాన్ని బట్టి కూడా భక్తి ఏర్పడుతుందని, 'ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః' అని పెద్దలు చెప్పారు. 'ఉర్వినాహార దోషంబు విజ్ఞాన నాశనంబునకు మూలకారణంబు' అన్నారు కృష్ణదేవరాయలు.

భక్తి కలిగిన ప్రతి వ్యక్తి సత్య, ధర్మ మార్గాలను తప్పనంతకాలం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడౌతాడు. స్వామివారికి ఇష్టంకాని పని/ ఆలోచన అంటే సత్య ధర్మ విరుద్ధమైన తలంపు. అది చిన్నదైనా, పెద్దదైనా మానసికంగా కూడా ఎవరికీ రాకూడదు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించినవారికి శిక్ష తప్పదు. దానికి మొదటి ఉదాహరణ నేనే. స్వామివారి కొలువులో ఉన్న కాలంలో నేను చేసిన చిన్న తప్పునకు స్వామి తగు రీతిలో నన్ను శిక్షించాడు. ఇలాంటి స్వామివారి మహిమలను ఆయన కొలువులో పనిచేసే ఏ ఉద్యోగిని అడిగినా అనుభవంతో చెబుతాడు. స్వామివారి మహిమ కారణంగా కొద్దో గొప్పో సంభవించిన మంచి లేక చెడు అనేవి ఉద్యోగులలో ప్రతి ఒక్కరికీ అనుభవసత్యం. అందుకే స్వామితో వ్యవహారం చాలా కఠినంగా ఉంటుంది. ఆయన అనుగ్రహం ఏస్థాయిలో ఉంటుందో ఆగ్రహం కూడా అదే మోతాదులో ఉంటుంది. స్వామివారి విషయంలో తప్పు చేసినవారెవ్వరూ... ఎప్పటికీ తప్పించుకోలేరు. ఫలితం కాస్త వెనకా ముందు అంతే! అందుకే ఆయన భక్తులు, సేవకులు, ఆలయ కార్యనిర్వాహక ధర్మకర్తలు, అర్చ స్వాములు, స్వామివారి ఆలయాలు ఉన్న రాష్ట్ర, దేశ పాలకులు... కళ్ళు, మనసు స్వామివారిమీదే లగ్నం చెయ్యాలి. చిత్తశుద్ధితో, భయభక్తులతో... విత్త బుద్ధిని విడిచి వ్యవహరించాలి. బాధ్యతలో ఏమాత్రం తేడా వచ్చినా... గోవిందా, గోవిందా... అంతే సంగతులు. తమ బాధ్యతలను విస్మరించిన ఉన్నతాధికారులు, రాష్ట్ర, దేశాధినేతలు తమతమ విధి, ధర్మ నిర్వహణ లోపం కారణంగా ఇటీవల మూల్యం చెల్లించుకున్న విషయం అందరికీ తెలుసు.

యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం... "ఎవరు ఏవిధంగా నన్ను చూసుకుంటారో నేను కూడా వారిని అదేరీతిగా చూసుకుంటాను" అన్నాడు గీతాచార్యుడు. ఈ ఊరుకు ఆ ఊరెంతో, ఆ ఊరుకు ఈ ఊరూ అంతే దూరం. భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉన్న సంబంధం కూడా అంతే. దేశసౌభాగ్యం కోసం, ప్రజాసంక్షేమం కోసం, పాలక యోగ క్షేమాలకోసం మన ప్రాచీన మహర్షులు సంహితల ద్వారా ఆలయార్చన వ్యవస్థను నిర్దేశించారు. ఎందుకంటే భగవంతుడి అనుగ్రహం సాధించడంలో అర్చనను మించిన శ్రేష్ఠమైన మరో మార్గం లేదని, యజ్ఞయాగాదులు అర్చనతో సమానం కావని సంహితలు చెబుతున్నాయి. దీనికి అనుగుణంగానే రాజ్యపాలకులు దేశంలో ఆలయ నిర్మాణాలు చేశారు. నిర్విఘ్నంగా అర్చనా కార్యక్రమం కొనసాగేలా పాలకులకు, ధర్మాధికారులకు (ఈ.ఓ.), ప్రధాన అర్చక స్వాములకు వివిధ కార్య నిర్దేశాన్ని, నిబంధనావళిని ఆయా సంహితలలో పేర్కొనడం జరిగింది. ఆలయ సేవకులతో సహా అర్చక స్వాముల వరకూ తమతమ విహిత కర్మల్లో లోపం చేసి, స్వామివారికి అపచారం చేసినప్పుడు... ఎవరికి శిక్ష విధించే స్థానంలో ఎవరు ఉంటారో కూడా అందులో స్పష్టంగా ఉంది. నిత్యార్చన విధానంలోని నైవేద్య సమర్పణలాంటి ప్రధాన విధుల్లో ఉన్నవారు లేదా బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు తప్పు చేసినప్పుడు దండనకు గురికాక తప్పదు.

యదా చ భగవద్గేహే సేవకేష్వేన కేన చ
దోషాధికం యది భవేద్ధర్మపాలన లోపతః
తత్ఫలం తు స్వయం ధర్మకర్తా భుంజీత భూతలే
లోభాద్వా మోహతోపి వా యేనకేనాపి హేతునా
యత్కించిద్భగవద్ద్రవ్యం ధర్మకర్తా హరేద్భువి
స జన్మశత సాహస్రైః శ్వానయోనిం సమాశ్రయేత్
రౌరవం నరకం గచ్ఛేద్యావదాభూత సంప్లవమ్
ఇహలోకే చ సర్వాణి దుఃఖాని సమవాప్నుయాత్
(పరమపురుష సంహిత)

ఆలయంలో విధి నిర్వహణలో ఎవరు తప్పు చేసినా... దాని ఫలితాన్ని ధర్మకర్తలు, అలాగే బాధ్యత, సర్వాధికారం కలిగిన పాలకులు అనుభవించక తప్పదు. స్వామివారి ద్రవ్యాన్ని/ సొమ్మును ఎవరు అపహరించినా

> **స్వామితో వ్యవహారం చాలా కఠినంగా ఉంటుంది. ఆయన అనుగ్రహం ఏస్థాయిలో ఉంటుందో ఆగ్రహం కూడా అదే మోతాదులో ఉంటుంది. స్వామివారి విషయంలో తప్పు చేసినవారెవ్వరూ... ఎప్పటికీ తప్పించుకోలేరు. ఫలితం కాస్త వెనకా ముందు అంతే!**

వేల జన్మలు శునకాలుగా పుడతారు. ఈ జన్మలో కూడా భరించలేని బాధలు పడతారు. కాబట్టి గుడి అధికారులు, పెత్తందార్లు ఎవరైనా స్వామివారి సొమ్మును కాజేయడానికి ప్రయత్నిస్తే... అలా చేసినవారికి శిక్ష అనివార్యం. ఇక 'అర్చకస్తు హరిస్సాక్షాత్ చరరూపీ న సంశయః (వైఖానస క్రియాధికారం)/ పూజక స్సాక్షాద్భగవత్సుత ఏవ' అని 'పరమపురుష సంహిత' చెబుతోంది. కాబట్టి ప్రధాన అర్చకస్వాములను భగవంతుని పుత్రునితో సమానంగా ధర్మాధికారులు, రాజ్య పాలకులు చూడాలి. వారు తప్పుచేస్తే భగవంతుడు తగిన శిక్ష విధిస్తాడని సంహితలు చెబుతున్నాయి. అర్చకస్వాములు ప్రసన్నంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడే లోకకల్యాణం కోసం, ప్రజాశ్రేయస్సు కోసం స్వామివారి ఆరాధన నిర్విఘ్నంగా, మంత్రయుక్తంగా కొనసాగుతుంది. ప్రధాన అర్చకులకు మానసిక స్వస్థత లోపించినప్పుడు స్వామివారి నిత్యార్చనకు విఘాతం ఏర్పడుతుంది. నిర్దిష్ట లక్ష్యమైన దేశ సౌభాగ్యానికి, ప్రజాశ్రేయస్సుకు అంతరాయం కలుగుతుంది. ఎంతో మంది శ్రేయస్సుతో ముడిపడిన నిత్యార్చన నియమబద్ధంగా నిష్ఠతో జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రధానార్చకులది. తన విధిలో చిత్తశుద్ధి లోపిస్తే ఆయన కూడా మూల్యం చెల్లించక తప్పదు.

'ధర్మహానిర్న కర్తవ్యా కర్తవ్యో ధర్మసంగ్రహః
ధర్మాధర్మౌ హి సర్వేషాం సుఖదుఃఖోపపాదకౌ'

(శాండిల్య) అని చెప్పినట్టు ధర్మ, అధర్మ ఆచరణలే అందరి సుఖదుఃఖాలకు మూలకారణం. దేశ సౌభాగ్యం కోసం, ప్రజాశ్రేయస్సు కోసం, ధర్మ సంరక్షణ కోసం మహర్షులు నిర్దేశించిన సంహితలలో పేర్కొన్న శాస్త్రోక్త పద్ధతిలో దేశపాలకులు ఆలయ వ్యవస్థలో ఏర్పాటు చేశారు. ఇది ఎటువంటి లోపాలు జరగని రీతిలో సక్రమంగా కొనసాగేలా ప్రజలు, ఆలయ సేవకులు, ప్రధానార్చక స్వాములు, కార్యనిర్వాహక, ధర్మాధికారులు, రాష్ట్ర, దేశ పాలకులు అందరూ సమష్టి బాధ్యత వహించాలి. ఎవరి కర్తవ్యాన్ని వారు సక్రమంగా నిర్వర్తించాలి. అందుకు విరుద్ధంగా వీరిలో ఏ ఒక్కరైనా ఎటువంటి దుర్మార్గపు ఆలోచననైనా చేసి... స్వామివారి నిత్యార్చనకు, నైవేద్య సమర్పణకు, భక్తుల మనోభావాలకు అపచారం చేసినట్టయితే అందుకు బాధ్యులైనవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎందుకంటే స్వామికి సమర్పించే నైవేద్యంలో ఒక పరమార్థం ఉంది. స్వామివారి ఉదరంలో సమస్త లోకాలు ఉంటాయి. ఆ లోకాల్లో జీవులుంటారు. స్వామివారికి సమర్పించిన పవిత్ర నైవేద్యం సమస్త జీవాత్మల్లో ఉన్న పరమాత్మకు చేరడంవల్ల... ఆ పవిత్రతతో పరమాత్మతో పాటు సమస్త లోకాల్లోని జీవాత్మలు కూడా తృప్తి చెందుతాయి. ఆ నైవేద్యం కలుషితమైనప్పుడు సమస్త జీవులు వ్యధకు లోనై, అందుకు కారకులైన వారిని శిక్షిస్తాయి. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ స్వామివారికి సమర్పించే నైవేద్యం కలుషితం కాకుండా... బాధ్యులైనవారు జాగ్రత్తగా ఉండాలి.

'సర్వే లోకాః ప్రవర్తంతే యస్య కుక్షౌ తు సర్వదా
తస్య సంతృప్తయే విష్ణోః నైవేద్యస్య ప్రకల్పనమ్'

అంటోంది 'పరమ పురుష సంహిత'. కనుక ఆలయ వ్యవస్థ పవిత్ర పరిరక్షణ అందరి బాధ్యత. అహంకార పరిత్యాగంతో స్వామివారికి చేసే పవిత్ర సేవ... పాలకులు సంకల్పించిన ప్రజా సంక్షేమానికి బాట వేస్తుంది. సంకుచితమైన స్వార్థ ప్రయోజనాల కోసం పాలకులు లేదా ప్రజాప్రతినిధులు సృష్టించే బీభత్స వాతావరణం ఆత్మవినాశనాన్ని ఆహ్వానిస్తుంది. అందువల్ల అత్యంత మహిమోపేతుడైన తెలుగువారి ఇలువేలుపు తిరుమల శ్రీవేంకటేశ్వరునితో ఎవరూ చెలగాటానికి కాలు దువ్వి, కాలపురుషుడు విధించే కఠినశిక్షకు గురికాకూడదు.



డాక్టర్ తాళ్ళూరి ఆంజనేయులు
పూర్వ సంచాలకుడు,
'శ్వేత' మరియు ప్రచురణల ప్రత్యేకాధికారి,
టిటిడి, తిరుపతి

మనం ఆధ్యాత్మిక మార్గంలోనే ఉన్నామా?

దైవంతో మానవుడు ఏర్పరచుకొనే సంబంధం పలు విధాలుగా ఉంటుంది. గుడికి వెళ్ళి దండం పెట్టుకోవడం, కోరికలు కోరడం, ముడుపులు కట్టడం... ఇది మనకు సర్వసామాన్యంగా కనిపించే పద్ధతి. ఫలానా మేలు జరిగితే... ఫలానా విధంగా ముడుపు చెల్లిస్తానని వాగ్దానం చెయ్యడం మరొక పద్ధతి. ఏదో ఒక పుస్తకాన్ని పారాయణ గ్రంథంగా పెట్టుకొని, రోజూ దాన్ని చదువుతూ ఉండడం ఇంకొక పద్ధతి. ఇక వైదిక మార్గంలో పెరిగినవారు ఉపాసనలు, దేవతార్చన పేరిట ఒక పద్ధతిలో దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటారు. మరి కొందరు "మేము ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాం" అంటారు. పూజల్లాంటివి ఏవీ చేయకపోయినా... కొన్ని వేదాంత సంబంధమైన, సాధనకి సంబంధించిన పుస్తకాలు చదువుతారు. మనం ఆలయాల్లో చూసే అర్చకులు తదితరులు అనేక పూజలు చేస్తూ ఉంటారు. అలాగే యజ్ఞ యాగాదుల్ని చేయించేవాళ్ళు ఉంటారు. 'వారందరూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నట్టేనా?' అనే ప్రశ్న ఒక్కొక్కసారి కలుగుతుంది. కాబట్టి 'ఆధ్యాత్మికం' (స్పిరిట్యువల్) అంటే ఏమిటనే విషయంలో స్పష్టత ఉండాలి.

'ఆధ్యాత్మం' అనే పదానికి 'ఆత్మను గురించి' అని అర్థం. 'ఆత్మ' అంటే 'నేను' అని అర్థం. 'నేను' అనేది అందరికీ తెలిసిన విషయమే కదా! అని మనం అనుకుంటాం. 'నేను' అంటే ఫలానా జాతికి, ఫలానా దేశానికి చెందిన వ్యక్తి... పురుషుడు, స్త్రీ, చదువుకున్నవాడు, చదువు లేనివాడు అనే భావన (ఐడెంటిటీ) మనకు ఉంటుంది. కానీ ఈ సందర్భంలో ఆధ్యాత్మికం అంటే తనను తాను పరిశీలించుకోవడం. 'ఈ సృష్టిలో నా స్థానం ఏమిటి?, ఇంద్రియాలకు అందని శక్తి ఏదైనా ఉంటే దానితో నాకు సంబంధం ఏమిటి?' అని ఆలోచించడం. తనలోనే ఉన్న కోరికలు, ద్వేషాలు, ఈర్ష్యలు మొదలైన వాటిని పరిశీలించుకోవడం. తన స్వభావాన్ని పరిశీలించుకోవడం. కేవలం పరిశీలించడమే కాదు... తనలో ఉన్న చెడు (నెగెటివ్) స్వభావాలను తగ్గించుకోవడానికి అభ్యాసం చేయడం. దీనినే 'ఒక వ్యక్తి తన మనసులోని మాలిన్యాన్ని తొలగించుకోవడం' అని వేదాంతులు సులువైన భాషలో చెబుతూ ఉంటారు. మనసులో ఉన్న కోరికలను, ద్వేషాలను తొలగించుకోవడం చాలా కష్టమైన విషయం. విద్వాంసులు, వేదాలు-శాస్త్రాలు చదివిన మహర్షులే బోల్తాపడిన కథలు మం చదివాం. భగవద్గీతలో చెప్పినదంతా మనసును నిగ్రహించుకోవడం గురించే.. మన శరీరం మొత్తాన్ని ఒక రథంతో పోలిస్తే... మన ఇంద్రియాలు అయిదు గుర్రాల లాంటివి. మనసు కళ్ళెం లాంటిది. మనసుని కూడా నియంత్రించేది బుద్ధి. బుద్ధి అంటే.. ఏది మంచి, ఏది చెడు అని ఆలోచించే శక్తి. ఈ ఉపమానం (పోలిక) 'కఠోపనిషత్తు'లో కనిపిస్తుంది. అందమైన వస్తువు కనిపిస్తే... దాని వెంట పరిగెత్తమంటుంది కన్ను. ఒక సుఖ స్పర్శను అనుభవిస్తే... అదే కావాలని కోరుతుంది శరీరం. అలాగే మిగతా ఇంద్రియాలు కూడా. "మనం బలవంతంగా చేతులను, కాళ్ళను, నోటిని అదుపులో పెట్టగలం. క్రమక్రమంగా మనసు అదుపులోకి వస్తుంది" అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఒక ఫార్ములా చెప్పాడు. ఇదే పద్ధతిని పతంజలి యోగ సూత్రాల్లో, బుద్ధుని బోధల్లో, జైనమతంలో మనం చూడగలం.



చింతన

మనిషి ఏ పని చేస్తున్నా దాన్ని నిబద్ధతతో, న్యాయబద్ధంగా చేయడం వల్ల మనసులోని చెడు సంస్కారాలు తగ్గుతాయని కర్మయోగం చెబుతోంది. దానితోపాటు పైన చెప్పిన అభ్యాసాన్ని చేస్తూ ఉండాలి. భగవద్గీత, ఉపనిషత్తులు తదితరాలను సరైన గురువుల ద్వారా నేర్చుకోవాలి. మనసును శుభ్రంగా ఉంచుకోవడం, విషయాల గురించి తెలుసుకోవడం అనేవి ఇతర అంశాలు. ఈ రెండూ ఒక పక్షికి రెండు రెక్కల లాంటివని ఉపమానం చెప్పారు పెద్దలు. ఒక పక్షి ఎగిరి చెట్టు కొమ్మల మీద కూర్చోవాలంటే రెండు రెక్కలు ఎంత అవసరమో... ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తి మోక్షం అనే భవనాన్ని ఎక్కి కూర్చోవాలంటే ఈ రెండూ అవసరం. ఇలా ఆలోచించినప్పుడు... పూజలు, వ్రతాలు చేయడమే చాలా సులభమని మనం గ్రహించగలం. ఇవి శరీరంతో చేసే పనులు. పట్టుపంచలు కట్టుకని, పురోహితుడు 'మమ... అనుకోండి' అన్నప్పుడు 'మమ ' అనుకుంటే సరిపోతుంది. కానీ ఆధ్యాత్మికం అంటే మనసుతో చేయాల్సిన పని. మనసును ఎల్లప్పుడూ గమనిస్తూ... దానిలోని మాలిన్యాన్ని తొలగించుకోవడం చాలా కష్టమైన పని.

పూజలు, వ్రతాలు, యాగాలను చేయడం లేదా చేయించడం లాంటి పనుల వల్ల మనలో అహంకారం పెరిగే అవకాశం ఉంది. 'నేను ఎంతో గొప్ప ధార్మికుణ్ణి' అనే భావన కలుగవచ్చు. అలాగే ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తికి కూడా... 'నేను పూజలు చేసే వ్యక్తికన్నా గొప్పవాణ్ణి' అనే అహంకారం కలిగే అవకాశం ఉంది. ఈ రెండిటి గురించి జాగ్రత్త పడాలంటే... రెండిటినీ ఆచరించడం మంచిదని పెద్దలు చెప్పారు. కేవలం ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వ్యక్తి తన పిల్లలకు కూడా ఆదర్శప్రాయంగా ఉండలేడు. తన తండ్రి ఏదీ ఆచరించడం లేదని పిల్లలు కూడా అన్ని నియమాలను వదిలేసే అవకాశం ఉంది. అందుకే చేయాల్సిన పనులు చేస్తూనే ఉండాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. "ఏ పనీ కర్తవ్య బుద్ధితో చేయాల్సిన అవసరం నాకు లేకపోయినా... ఇతరులకు ఆదర్శంగా ఉండడానికి చేస్తూనే ఉన్నాను" అన్నాడు. ఇది మనం గమనించాల్సిన విషయం. తను చేసే ఆధ్యాత్మిక సాధనకు దేవుణ్ణి సాక్షిగా పెట్టుకోవడం సాధకుడికి అవసరం. 'మనసును శుభ్రపరచుకోవడానికి... భక్తి అన్నిటికన్నా గొప్ప సాధనం అనేది' అన్ని సంప్రదాయాలు చెప్పే విషయం. దీనివల్ల సాధకుడు అహంకారంలో పడకుండా ఉండగలడు. అతని ప్రవర్తన కూడా ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉంటుంది. భక్తిలేని ఆధ్యాత్మిక సాధన చెడుదారిన పడవచ్చు. ఆచారాల్ని మాత్రమే పాటించడం ఆధ్యాత్మికత కాదు. కేవలం భక్తి కూడా అసంపూర్ణమే. అలాగే సమాజంలో తన ధర్మాన్ని తాను నిర్వర్తించకుండా... 'ఆధ్యాత్మికంగా ఉన్నాను' అనుకోవడం కూడా సరైనది కాదు. నిజంగా మోక్ష మార్గంలో ఉన్నవాడు తన కర్మలను క్రమక్రమంగా తగ్గించుకోవచ్చు. కానీ వేదాంత అధ్యయనం లేకుండా కేవలం ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నానని భావించే వ్యక్తి... సమాజంలో తన విధిని తాను నిర్వర్తిస్తూనే ఉండాలి.

- కె.అరవిందరావు, రిటైర్డ్ డీజీపీ

వేడుక

నేడు ముద్దపప్పు బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో మూడో రోజైన ఆశ్వయుజ శుద్ధ విదియ నాడు మూడు ఎత్తుల్లో పూలను పేర్చి, శిఖరం మీద గౌరమ్మను ఉంచుతారు. పేర్పులో చామంతి, మందార తదితర పూలను ఉపయోగిస్తారు. ప్రధానంగా ముద్దపప్పును నివేదిస్తారు కాబట్టి 'ముద్దపప్పు బతుకమ్మ'గా వ్యవహరిస్తారు.



నైవేద్యం: ముద్దపప్పు, పాలు, బెల్లంతో చేసిన వంటకాలు.

సహజయోగ

శ్రీలలితా సహస్రంలో యోగ రహస్యాలు

శ్రీ లలితా సహస్ర నామం ఆవిర్భావం గురించి ఒక కథ ఉంది. తనకు అత్యంత రహస్యమైన సహస్రనామాలను ఉపదేశించవలసిందిగా శ్రీ మహావిష్ణువు అవతారమైన హయగ్రీవుణ్ణి అగస్త్య మహర్షి కోరాడు. అప్పుడు హయగ్రీవుడు లలితా సహస్రనామాలకు అనంతమైన శక్తి ఉంది కాబట్టి యోగ్యులైన పుణ్యాత్ములకు మాత్రమే దాన్ని తెలియజేయాలనే సూచనతో... శ్రీలలితా సహస్రనామ మూలాన్ని అగస్త్యుడికి ఉపదేశించాడు. దానికి స్వరకర్తలు వాసిని తదితర వాగ్దేవతలు. శ్రీలలితా దేవి ఆజ్ఞపై వారు లలితా సహస్ర నామ స్తోత్రాన్ని రచించారు. రహస్యమైన మంత్రాలతో కూడిన వెయ్యి నామాలను సమకూర్చారు. దాన్ని సాక్షాత్తూ శ్రీ లలితాదేవి సమక్షంలో వారు, ఇతర దేవతలు పఠించారు. అది విని ముగ్ధురాలైన అమ్మవారు... "ఈ నామాలను ఎవరు అనుసరిస్తారో, అర్థం తెలుసుకొని ఆచరిస్తారో, రోజూ ఎవరు ఈ స్తోత్రాన్ని చదువుతారో వారి పట్ల నేను ప్రీతిని కలిగి ఉంటాను. వారి యోగక్షేమాలను స్వయంగా చూసుకుంటాను" అని ప్రకటించారు. ఈ స్తోత్రం అన్ని రకాల సమస్యలకు శక్తిమంతమైన పరిష్కారమని శ్రీ మాతాజీ నిర్మలాదేవి చెప్పారు. ఈ స్తోత్రం 'బ్రహ్మాండపురాణం'లోని 36వ అధ్యాయంలో... 'లలితోపాఖ్యానం'లో ఉంది. అందులో శ్రీలలితాదేవిని సకల శక్తిస్వరూపిణిగా, సృష్టిస్థితిలయాధికారిణిగా వర్ణించారు. ఈ స్తోత్రం గురించి తెలియనివారు ఉండరు. నిత్యపారాయణ చేసేవారు చాలామంది ఉంటారు. కానీ అమ్మవారి నామాలను అర్థం చేసుకొని, వాటిని ధ్యానంలో ప్రత్యక్షంగా అనుభూతి చెందుతూ, అనన్యమైన భక్తిశ్రద్ధలతో పారాయణ చేసే వాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. జాగ్రత్తగా గమనిస్తే... మన సూక్ష్మ శరీరంలో ఉన్న వివిధ శక్తి కేంద్రాలు లేదా చక్రాల దగ్గర... శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ విధంగా కొలువై ఉంటారో ఈ స్తోత్రంలో వర్ణించి ఉంది. ఈ చక్రాలన్నీ మన శరీరంలోనే ఉన్నాయి. అంటే మన దేహంలోనే వివిధ చక్రాలలో, విభిన్న రూపాలలో అమ్మవారు కొలువై ఉన్నారు. ఆమె శక్తి గద్వారానే మానవుని సూక్ష్మ శరీరంతో పాటు అండపిండ బ్రహ్మాండాలతో నిండిన ఈ చరాచర జగత్తు సమస్తం నడుస్తోంది.

ఈ స్తోత్రంలో అమ్మవారిని 'అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా' అని వర్ణిస్తారు. అంటే మన చిత్తం బహిర్ముఖమై ఉన్నప్పుడు ఆ తల్లిని చేరుకోవడం కష్టం. అంతర్ముఖులమై ధ్యానం చేస్తేనే కుండలినీ శక్తి జాగృతం అవుతుంది. అలాగే ఆమెను 'మహామాయ'గా పేర్కొన్నారు. అంటే ఆమె మన లోపల ఉంటూ... ప్రలోభాలకు గురిచేసి పరీక్షిస్తుంది. సద్గుణాలతో ఆ మాయను దాటిన వారిని అనుగ్రహిస్తుంది. అప్పుడు వారు మాయ నుంచి విముక్తి పొందుతారు. వారిలో కుండలినీ శక్తి ఉత్థానం చెంది... మోక్ష ప్రాప్తి కలుగుతుంది. ఆమె ఒక కంటి చూపుతో బ్రహ్మాండాన్ని సృష్టించగలదు, అదే కంటి చూపుతో నాశనం చేయగలదు. ఈ స్తోత్రంలో అమ్మవారిని వెయ్యి నామాలతో స్తుతించారు. వాటిలో సహజయోగ పరంగా ప్రాధాన్యమైన నామాల అర్థాలను... నవరాత్రి పూజల సందర్భంగా శ్రీ మాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు. 'త్రికోణ' అంటే 'త్రికోణంలో నివసించేది' అని అర్థం. మన వెన్నుపాము అడుగున ఉన్న త్రికోణాకారపు ఎముకలో అమ్మవారు కుండలినీ శక్తి రూపంలో నిద్రాణ స్థితిలో ఉంటారు. 'మూలధార నిలయా'... మూలాధారం అంటే షట్చక్రాలలో మొదటిదైన మూలాధార చక్రానికి కాస్త పైన ఉంటుంది. ఈ మూలాధారంలో అమ్మవారు కుండలినీ శక్తి రూపంలో నివసిస్తారు. 'కుండల' అంటే సంస్కృతంలో 'సర్పిలాకారం' అనే అర్థం ఉంది. ఈ శక్తి మూలాధారం అనే త్రికోణాకార ఎముకలో మూడున్నర చుట్లు తిరిగి, సర్పిలాకారంలో నిద్రిస్తున్న పాములా ఉంటుంది. అందుకే దీనికి 'కుండలినీ' అనే పేరు వచ్చింది. ఈ నామం కూడా స్తోత్రంలో కనిపిస్తుంది. అలాగే 'బిసతంతు తనీయసి' అంటే 'తామరకాడలోని పోగుల లాంటి స్వభావం కలిగినది' అని అర్థం. కుండలినీ శక్తి అనేక దారపు పోగులతో పేనిన తాడులా ఉంటుందని శ్రీ మాతాజీ వివరించారు.



'షట్చక్రోపరి సంస్థితా' అంటే 'ఆరు చక్రాల పైభాగంలో చక్కగా ఉన్నది' అని అర్థం. మన సూక్ష్మ శరీరంలో వెన్నుపాము వెంబడి తల మీద మాడు భాగం వరకూ మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్ర చక్రాలనే ఏడు శక్తి కేంద్రాలు ఉంటాయి. మూలాధార చక్రంలో ఉండే కుండలినీ శక్తి మిగిలిన ఆరు చక్రాలను దాటి, మన తలపైన ఉండే బ్రహ్మరంధ్రంలోంచి బయటకు వచ్చి, భగవంతుడి పరమ చైతన్య శక్తిలో ఐక్యమవుతుంది. అప్పుడే మనకు యోగం లభిస్తుంది. కుండలినీ శక్తి ప్రయాణించే మార్గంలో... చక్రాల మధ్య బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంథులు ఉంటాయి. వాటిని ఛేదించుకొని కుండలినీ శక్తి పైకి వెళ్తుంది. అందుకే ఆమెకు 'బ్రహ్మ గ్రంథి విభేదిని, విష్ణు గ్రంథి విభేదిని, రుద్ర గ్రంథి విభేదిని' అనే నామాలు ఏర్పడ్డాయి. మానవ సూక్ష్మ శరీరంలో ఇడా, పింగళా, సుషుమ్నా అనే నాడులు ఉంటాయి. కుండలినీ శక్తి ఈ నాడుల ద్వారా పైకి వచ్చినప్పుడు... ఇచ్ఛా, క్రియా, జ్ఞాన శక్తులను ప్రసాదిస్తాయి. అందుకే అమ్మవారిని 'ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ' అని వర్ణిస్తారు. స్వాధిష్ఠాన పద్మంలో నివసించేది కాబట్టి 'స్వాధిష్ఠానాంబుజగతా' అనీ, మణిపూర చక్రం లోపలి నుంచి ఉదయించేది కాబట్టి 'మణిపూరాంతరుదితా' అనీ, అనాహత చక్రంలో ఉంటుంది కాబట్టి 'అనాహతాబ్జ నిలయా' అనీ, విశుద్ధ చక్రంలో నివసిస్తుంది కాబట్టి 'విశుద్ధ చక్ర నిలయా' అనీ, ఆజ్ఞా చక్రంలో కొలువుతీరుతుంది కాబట్టి 'ఆజ్ఞాచక్రాంత రాళస్థా' అనీ అమ్మవారిని లలితా సహస్రనామాల్లో వర్ణించారు.

'సహస్రారాంబుజారూఢా' అంటే 'వెయ్యి దళాలున్న పద్మంలో నివసించేది' అని అర్థం. దానికి శ్రీమాతాజీ వివరణ ఇస్తూ "ఈ చక్రం మన తల మీద మాడు లేదా బ్రహ్మరంధ్రం దగ్గర ఉంటుంది. ఈ చక్రాన్ని కుండలినీ శక్తి ఛేదించుకొని పైకి వచ్చినప్పుడు మనిషికి యోగం లభిస్తుంది. అప్పుడు మానవ చేతన... తన చుట్టూ ఉన్న భగవంతుడి పరమ చైతన్య శక్తితో అనుసంధానం అవుతుంది. మనిషి మెదడును లోపలి నుంచి (అడ్డుకోత కోసి) గమనిస్తే... వెయ్యి నరాలు కలిసి, వెయ్యి దళాలున్న పద్మంలా కనిపిస్తుంది. అందుకే దాన్ని 'సహస్రారం' అంటారు" అని చెప్పారు. ఇక 'సుధాసారాభి వర్షిణి' అంటే 'అమృతధారలు కురిపించేది' అని అర్థం. కుండలినీ శక్తి సహస్రార చక్రాన్ని దాటిన తరువాత.. సాధకునిలో చైతన్య తరంగాల అనుభూతి మొదలవుతుంది. అమృతధారల్లాంటి ఆ చైతన్య తరంగాలను అనుభూతి చెందడం కుండలినీ జాగృతి ద్వారానే సాధ్యమవుతుంది. ఆ సమయంలో సాధకులు బ్రహ్మానందానుభూతిలో లీనమవుతారు.

(శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారు ఇచ్చిన ప్రవచనాల ఆధారంగా)



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

ఆ సెంటిమెంట్ ఫాలో అవుతున్నా

దిల్ రాజు



'గతంలో 'హ్యాపీడేస్', 'శతమానం భవతి' చిత్రాలను ఓవర్సీస్‌లో ముందుగా రిలీజ్ చేశాను. ఆ సెంటిమెంట్‌తోనే 'జనక అయితే గనక' సినిమాను ముందుగానే అంటే ఈ నెల 10న ఓవర్సీస్‌లో విడుదల చేస్తున్నాం. 12న ఇక్కడ రిలీజ్ చేస్తాం' అని చెప్పారు దిల్ రాజు. సుహాస్, సంగీర్తన జంటగా నటించిన 'జనక అయితే గనక' చిత్రాన్ని సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఇప్పటికే చాలా మందికి సినిమా చూపించాం. పూర్తి వినోదభరితంగా ఉంటుంది. అందరినీ అలరించే సినిమా అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఎవరినీ నిరాశ పరచదు. చూసిన వాళ్లు బాగుందని చెబుతున్నారు. ఆడియన్స్ రియాక్షన్ ఎలా ఉంటుందా అని అక్టోబర్ 12 కోసం వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హర్షిత్‌రెడ్డి, సంగీర్తన, సందీప్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

కోలుకున్న రజనీకాంత్

• నేడు డిశ్చార్జ్!



మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు లోనై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ పూర్తిగా కోలుకున్నారని, ఆయన శుక్రవారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. గత సోమవారం రాత్రి ఉన్నట్టుండి అస్వస్థతకు లోనైన రజనీకాంత్‌ను ఆయన కుటుంబ సభ్యులు అపోలో ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెల్సిందే. ఆయన పూర్తిగా కోలుకున్నారని, ఉదయం పూట పత్రికలను చదువుతూ, టీవీ చూస్తున్నారని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

విజయ్ 69లో భాగమైన పూజ.. మమితా



తమిళ నటుడు విజయ్, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. 'విజయ్ 69' అనేది వర్కింగ్ టైటిల్. విజయ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు.. ఆయన నటించే ఆఖరి చిత్రం ఇదే కావడంతో సినిమాపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. బాబీ డియోల్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ ఇది వరకే ప్రకటించారు. తాజాగా, ఈ సినిమాలో డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్, హీరోయిన్ పూజ హెగ్డే, మమితా బైజు భాగం అవుతున్నట్లు నిర్మాత వెంకట్.కె.నారాయణ్ ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాన్ ఇండియన్ సినిమా వచ్చే ఏడాది అక్టోబరులో విడుదల కానుంది. కాగా, విజయ్ సరసన పూజ హెగ్డే ఇంతకుముందు 'బీస్ట్' చిత్రంలో నటించారు.

అయితే నన్నెందుకు పిలిచారు



సినీ నటి మీనా ఇటీవలే దుబాయ్‌లో జరిగిన ఐఫా 2024 వేడుకలో పాల్గొన్నారు. అక్కడ ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ వేడుకలో మీనా మాట్లాడుతున్న సందర్భంలో ఒక రిపోర్టర్ మీనాని హిందీలో మాట్లాడమని అడిగారు. దానికి ఆమె సమాధానమిస్తూ "ఇది కేవలం హిందీ వేడుకా? అయితే నన్నెందుకు ఆహ్వానించారు" అని రిపోర్టర్‌పై సీరియస్ అయ్యారు. అదే వేదికపై ఆమె మాట్లాడుతూ" దక్షిణాది సినిమాలు, ప్రజలు అద్భుతం. నేను దక్షిణాది నటిని అయినందుకు గర్వపడుతున్నా. ఐఫా ఉత్సవాలు నార్త్.. సౌత్ అంటూ తేడా లేకుండా సినీ పరిశ్రమలోని అందరినీ కలుపుతోందని.. ఈ వేడుకకు వచ్చి పరిశ్రమలోని అందర్నీ కలుసుకోవడం ఆనందంగా ఉంది" అని చెప్పారు.







వినోదంతో పాటు సందేశమూ ఉంది



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. రీతూ వర్మ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకుడు. విడుదల నేపథ్యంలో చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మీడియాతో మాట్లాడారు. 'శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్స్, కంటెంట్ బేస్డ్ సినిమాలు చేస్తున్నారు. మా సినిమాలో ఆయన నాలుగు పాత్రలు చేశారు. దాదాపు తొమ్మిది గెటప్స్‌లో కనిపిస్తారు. వినోదంతో పాటు అద్భుతమైన మెసేజ్ ఉంది' అని చెప్పారాయన. ఇది నాలుగు తరాల కథ అని చెబుతూ 'దర్శకుడు హసిత్ గోలి అందరికీ అర్థమయ్యే రీతిలో స్క్రీన్‌ప్లే తయారు చేశారు. ఫస్ట్ హాఫ్‌లో క్యారెక్టర్స్‌ని ఎస్టాబ్లిష్ చేసే విధానం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఇంటర్వెల్ తర్వాత మంచి ఎమోషన్‌తో కథ సాగుతుంది. జనరేషన్స్‌లో మారుతూ వస్తున్న జెండర్ డామినెన్స్‌ను ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. ఇటువంటి కథని రెండున్నర గంటల్లో చెప్పడం టఫ్ జాబ్ అయినా దర్శకుడు అద్భుతంగా హ్యాండిల్ చేశారు' అన్నారు విశ్వప్రసాద్. ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' చిత్రం షూటింగ్ నవంబర్‌కల్లా పూర్తి చేయాలని భావిస్తున్నామనీ, ఆయన పుట్టిన రోజున కొత్త అప్‌డేట్ ఇవ్వాలనుకుంటున్నామనీ ఆయన చెప్పారు. కొత్త ప్రాజెక్ట్స్ గురించి చెబుతూ 'ప్రస్తుతం 'హరికథ' అనే ప్రాజెక్ట్ చేస్తున్నాం. అది ఓటీటీలో విడుదలవుతుంది. అలాగే 'న్యూసెన్స్ 2' ను కూడా చేస్తున్నాం. కన్నడంలో డిస్ట్రిబ్యూషన్ ప్రారంభించాం. వచ్చే ఏడాది అక్కడ నాలుగు చిత్రాలు తీయాలని ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.

సినిమా మీద నమ్మకంతోనే అలా చెప్పా



'ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మగారు హీరో క్వాలిటీస్ ఉన్నాయని నా గురించి చెప్పడం సంతోషంగా ఉంది. 'ఈ సినిమాకు మీకు నచ్చకపోతే టికెట్‌ను ఫొటో తీసి ఇన్‌స్టా ద్వారా పంపండి. డబ్బులు తిరిగి ఇచ్చేస్తా' అని ఆ వేదిక మీద చెప్పా. సినిమా మీద నమ్మకంతో నే అలా చెప్పా' అన్నారు కొత్త హీరో చంద్రహాస్. తను నటించిన 'రామ్‌నగర్ బన్నీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'అన్ని ఎలిమెంట్స్ ఉన్న సినిమాతో నేను పరిచయం కావడం ఆనందంగా ఉంది. రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన దగ్గర నుంచి ఎగ్జైటింగ్‌గా ఉంది. సినిమా బాగా రావడంతో అందరం కాన్ఫిడెన్స్‌తో ఉన్నాం' అన్నారు. 'సినిమాలో సూపర్‌హీరోగా కనిపించను, ఒక సాధారణ యువకుడిగాలా జీవన పోరాటం చేస్తుంటాను. సినిమాలో నలుగురు హీరోయిన్లు ఉన్నారు. ఎలాంటి అసభ్యత లేదు. ఫ్యామిలీతో కలసి చూడొచ్చు. ఈ సినిమాను మా నాన్న ప్రభాకర్ నిర్మించారు. ఎన్నుకున్న కథను మనం అనుకున్నట్లు తీయాలంటే సొంతంగా తీయడమే బెటర్ అని ఆయన భావించారు. ఆయన కూడా అనుకోకుండా ఓ చిన్న పాత్ర పోషించారు. దర్శకుడు శ్రీనివాస్ మహత్ నన్ను స్క్రీన్ మీద బాగా ప్రజెంట్ చేశారు. ప్రస్తుతం మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నా. వాటి వివరాలు త్వరలో తెలుపుతా' అన్నారు చంద్రహాస్.



ప్రతీ విషయంలో కంట్రోల్ చేసేది

తమిళ నటుడు జయం రవి ఇటీవలే తన భార్య ఆర్తితో విడాకులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ విడాకులకు గల కారణాల్ని ఆయన తాజాగా ఓ యూట్యూబర్‌తో మాట్లాడుతూ బయటపెట్టారు. "నా భార్య నాకు కనీస గౌరవం ఇచ్చేది కాదు. ఎప్పుడూ నన్ను కంట్రోల్ చేయాలనుకునేది. ఏదైనా అవసరం వచ్చి ఏటీఎమ్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేసినా.. ఆమె వెంటనే కాల్ చేసి అడిగేది. తను మాత్రం షాపింగ్ అంటూ వందల కొద్దీ బ్యాగులు.. బట్టలు కొని విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేసేది. నా ఖర్చులపై మాత్రం నిఘా పెట్టేది. నాపై అనుమానంతో నా అసిస్టెంట్లను కూడా ఖర్చుల విషయాలు అడిగేది. అసలు నాకు ఏ విషయంలోనూ స్వేచ్ఛ ఉండేది కాదు. ఇంటి నుంచి షూటింగ్ వరకూ ప్రతీ విషయంలో నాకు అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి" అని చెప్పారు.

అప్‌డేట్స్

వెంకటేశ్ చెప్పిన మాటే వీక్షణం



'నేను రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ పొందాను. ఒకరోజు విక్టరీ వెంకటేశ్ ఓ మాట చెప్పారు. ఈ ప్రపంచంలో అత్యంత కష్టమైన పని ఏమిటంటే మన పని మనం చూసుకోవడం. ఆయన చెప్పిన మాటే మా 'వీక్షణం' సినిమాకు కథా నేపథ్యం. ఇందులో హీరో ఎప్పుడూ పక్కవాడి లైఫ్‌లో ఏం జరుగుతుందో చూడాలనే ఉత్సాహంలో ఉంటాడు. దాని వల్ల అతను ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నది ఆసక్తికరంగా చూపించాం' అని చెప్పారు దర్శకుడు మనోజ్ పల్లేటి. ఆయన రూపొందించిన మిస్టరీ కామెడీ థ్రిల్లర్ ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ టీజర్ విడుదల చేశారు. రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించారు. ఫన్, లవ్, సస్పెన్స్ మిస్టరీ అంశాలున్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందని చిత్ర నిర్మాతలు పి.పద్మనాభరెడ్డి, అశోక్‌రెడ్డి చెప్పారు. తమ టీమ్‌లోకి సురేశ్ కొండేటి జాయిన్ అయిన తర్వాత సినిమా మీద నమ్మకం పెరిగిందని హీరో రామ్ కార్తీక్ చెప్పారు.

తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి



ప్రిన్స్, నరేశ్ అగస్త్య, నేహా కృష్ణన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కలి'. శివశేషు దర్శకత్వంలో లీలాగౌతమ్ వర్మ నిర్మించారు. సినిమా ఈ నెల నాలుగున విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరుణ్ తేజ్ మాట్లాడుతూ "ఇలాంటి మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. "మనిషి ఎదుగుదలను సరికొత్తగా చూపించే ప్రయత్నం ఇది" అని దర్శకుడు శివశేషు అన్నారు.

మైథలాజికల్ థ్రిల్లర్



రాకేశ్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానసవీణ, భార్గవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మైథలాజికల్ థ్రిల్లర్ 'రహస్యం ఇదం జగత్'. కోమల్. ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ మూవీ టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో ఓ థియేటర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు భరద్వాజ్ మాట్లాడుతూ "మైథలాజికల్ అంశాలకు సైన్స్ ఫిక్షన్ జోడించి ఎన్నో ట్విస్టులతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది" అని చెప్పారు. నవంబర్ 8న ఈ చిత్రం విడుదలవుతోంది.

ఆసక్తికర కథతో...



శ్రీనాథ్ మాగంటి, గాయత్రిరమణ, సాయికామాక్షి, భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మాన్షన్ హౌస్ మల్లేశ్'. బాలసతీశ్ దర్శకత్వంలో రాజేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను డైరెక్టర్ శైలేష్ కొలను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడతూ "ఆసక్తికరమైన కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని తెలిపారు. ఎడిటర్: గ్యారీ బీ.హెచ్, డీఓపీ: అమ్మముత్తు, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

వాస్తవ సంఘటనలతో.. స్వచ్ఛమైన ప్రేమకథ



అంజన్ రామచంద్రన్, శ్రావణి రెడ్డి జంటగా నటించిన చిత్రం 'లవ్ రెడ్డి'. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాను స్మరణ్ రెడ్డి దర్శకత్వంలో సునంద. బి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్.జి, మదన్‌గోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ స్మరణ్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పనిచేసింది. సినిమా అనుకున్న దానికంటే గొప్పగా వచ్చింది" అని చెప్పారు. నిర్మాత మదన్ మాట్లాడుతూ "మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రమిది. ఈ స్వచ్ఛమైన ప్రేమకథను అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని అన్నారు. ఎడిటర్: కోటగిరి వేంకటేశ్వరావు, సంగీతం: ప్రిన్స్ హెన్రీ.

పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

» ఇండ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా?: హరీశ్‌రావు



ఫార్మాసిటీ కోసం భూములు ఇవ్వబోమంటూ మహిళా రైతు కంటతడి

సంగారెడ్డి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్‌రెడ్డి పాలన ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆ రాయి ఇప్పుడు రైతులపై పడిం దన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూరులో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతులతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన హాజ రయ్యారు. డప్పూరు, మల్గి, వడ్డీ గ్రామాల్లో 2,003 ఎకరాల భూములను ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం సేకరిస్తున్నదన్న ఆయన ఏటా మూడు పంటలు పండించే భూములను గుంజుకోవడం న్యాయమా అని ప్రశ్నిం చారు. ఫార్మాసిటీ కోసం హైదరాబాద్ పక్కనే 15వేల ఎకరాలను గత ప్రభుత్వం సేకరిస్తే దానిని ఫోర్త్ సిటీగా మారుస్తానని చెప్పి ఫార్మాసిటీని పచ్చని పల్లెల్లో ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ బ్రోక ర్‌లా మారి 15వేల ఎకరాలతో వ్యాపారం చేయాలనుకుంటున్నారని హరీశ్ విమర్శించారు. మూసీనది సుందరీకరణ పేరిట ఇండ్లు కూల్చడం, ఫార్మా సిటీ కోసం భూములు కొల్లగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అని ఆయన ధ్వజమెత్తారు. మూసీని శుద్ధి చేస్తా అంటూనే పాలవంటి మంజీరాను విష పూరితంగా మారుస్తారా అని హరీశ్ ప్రశ్నించారు. రైతులు భయపడాల్సిన పనిలేదని, తన ప్రాణాలు అడ్డుపెట్టయినా భూములను కాపాడుతానని ఆయన భరోసా కల్పించారు. డప్పూరు రచ్చబండ కార్యక్రమంలో పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. భూములను నమ్ముకొనే పిల్లలను చదివి స్తున్నామని, కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. ప్రాణాలు పోయినా భూములివ్వబోమన్నారు.

నిజామాబాద్ ప్రవాసీకి యూఏఈ ఐకాన్ అవార్డు



ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: దుబాయి లోని వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విజ యవంతంగా ఎదుగుతున్న భారతీయు లకు ఏటా ప్రదానం చేసే యూఏఈ ఐకాన్ అవార్డుల్లో ఈసారి నిజామాబాద్ జిల్లాకు చెందిన రాచకొండ శ్రీనివాస్ గౌడ్‌కు పురస్కారం దక్కింది. దుబాయి లోని ఒక సంస్థ, ఇండియా టుడే గ్రూప్ సంయుక్తంగా నిర్వహించిన ఓ కార్యక్ర మంలో శ్రీనివాస్ గౌడ్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా టుడే ప్రతినిధులు, భారతీయ వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం గడ్కోలు గ్రామానికి చెందిన శ్రీని వాస్ గౌడ్.. బ్యాంకింగ్ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి స్విట్జర్లాండ్‌లోని ఓ ప్రపంచ ప్రఖ్యాత బ్యాంకింగ్ సంస్థలో పెట్టుబడుల సలహాదారు స్థాయికి చేరారు. ఆ తర్వాత ఆయన సొంతంగా పెట్టుబడుల సలహాలతోపాటు బ్యాంకులకు సాంకేతిక సేవలందించే మెంసా అనే సంస్థను దుబాయిలో నెల కొల్పారు. ఈ సంస్థ దుబాయితోపాటు ప్రపంచంలోని అనేక దేశాల్లోని బ్యాంకులకు సాంకేతిక సేవలందిస్తోంది. దుబాయిలోని తెలుగు సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనే శ్రీనివాస్ గౌడ్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను పలువురు తెలుగు ప్రముఖులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగి జావ

» శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమం

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా ర్థులకు పౌష్టికాహారం అందించే అంశంలో సర్కారు కీలక నిర్ణయం తీసు కుంది. ప్రభుత్వ బడుల్లోని ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులంద రికీ ఇకపై రాగి జావ ఇవ్వనుంది. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వ ర్యంలో వారానికి మూడు సార్లు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను విద్యా శాఖ గురువారం జారీ చేసింది. రాగి జావ తయారీకి కావాల్సిన రాగి మాల్ట్, బెల్లం పొడి.. సత్యసాయి ట్రస్ట్, ప్రభుత్వం నుంచి పాఠశాలలకు చేరనున్నాయి. ఒక్కో విద్యార్థికి ఇచ్చే జావలో 10 గ్రాముల రాగి పొడి, అదే స్థాయిలో బెల్లం పొడి వాడనున్నారు. అల్పాహార సమయం లేదా మధ్యాహ్న భోజనం పూర్తయిన తర్వాత విద్యార్థులకు రాగి జావ ఇవ్వనున్నారు.విద్యార్థులకు కోడిగుడ్డు ఇవ్వని రోజుల్లో రాగిజావ ఇస్తారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దసరాను పురస్కరించుకుని ఆదివారం(6వ తేదీ) నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు సెలవులు ఇస్తున్నట్టు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి గురువారం ప్రకటన చేసింది. 14వ తేదీ నుంచి అన్ని కళాశాలల్లో తరగతులు పునఃప్రారంభమవుతాయని పేర్కొంది.

వేదిక కూలి పడిపోయిన హీరోయిన్ ప్రియాంక

» తప్పిన పెను ప్రమాదం

» పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డికి గాయాలు

» తొర్రూరు షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ఘటన



తొర్రూరు, అక్టోబరు 3: 'సరిపోదా శనివారం' హీరోయిన్ ప్రియాంక మోహన్‌కు పెను ప్రమాదం తప్పింది. ఓ షాపింగ్‌మాల్ ప్రారం భోత్సవ కార్యక్రమంలో వేదిక కుప్పకూలడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా పాలకుర్తి నియో జకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కాలు విరిగింది. ఈ ఘటన గురువారం మహబూబా బాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో జరిగింది. పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌ను ప్రారంభిం చేందుకు హీరోయిన్ ప్రియాంక మోహన్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో వారు షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. అదేసమయంలో ఒక్కసారిగా జనాలు ముందుకు దూసుకురావడంతో వేదిక కుప్పకూలింది. దీంతో ఝాన్సీరెడ్డి కాలు రెండుచోట్ల విరగడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డీజీపీ ఆఫీసు ముందు న్యాయవాదుల ఆందోళన

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నాంపల్లి క్రిమినల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ఎంఏ ఖలీంపై పోలీసుల దాడిని నిరసిస్తూ పలువురు న్యాయవాదులు డీజీపీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపకం విషయంలో పోలీసు లను న్యాయవాది ఖలీం ప్రశ్నించడంతో మాదన్నపేట ప్రాంతంలో సైదాబాద్ ఎస్సై ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై పలువురు న్యాయవా దులు డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు రాగా ఆయన అందుబాటులో లేరు. దాంతో న్యాయవాదులు కొంతసేపు డీజీపీ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఐజీ రమణ కుమార్ వారి ఫిర్యాదు స్వీకరించి, విషయం డీజీపీ దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు కోఆపరేటివ్ ట్రిబ్యు నల్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ దివాకర్ పిలుపు మేరకు న్యాయవాది ఖలీంపై దాడికి నిరసనగా వివిధ కోర్టుల న్యాయవాదులు గురు వారం విధులను బహిష్కరించారు. ఈ నిరసనలో జిల్లా కోర్టు బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్‌లో లైంగిక వేధింపులు!

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 3: సూర్యాపేట కలెక్టరేట్‌లోని ఓ శాఖకు చెందిన అధికారి.. తన విభాగంలోని ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్ప డినట్లు తెలిసింది. బాధిత మహిళ కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేయడంతో ఈ సంగతి బయటికొచ్చింది. కలెక్టరేట్‌లోని ఓ ఓ శాఖలో జూనియర్ అసిస్టెం ట్‌గా పని చేస్తున్న మహిళను అదే శాఖకు చెందిన జిల్లా అధికారి(50) కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. ఆ అధికారి సదరు ఉద్యోగిని సెల్‌ఫోన్‌కు అసభ్యకర సందేశాలు కూడా పంపారు. తన మాట వినకపోవడంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటుందంటూ ఆమెకు మెమో జారీ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితురాలు లైంగిక వేధింపుల విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్.. ఈ అంశంపై ఓ కమిటీతో విచారణ చేయించి తగిన చర్యలు తీసుకుంటామని బాధితురాలికి హామీ ఇచ్చినట్టు సమాచారం. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి గతంలోనూ ఇలానే ప్రవర్తించగా బాధిత మహిళలు దేహశుద్ధి చేసినట్టు తెలిసింది.

2030 నాటికి 20 వేల మెగావాట్ల
హరిత ఇంధన ఉత్పత్తే లక్ష్యం..

» రోహ్మ్ సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేయండి

» పానాసోనిక్ ప్లాంటు పెడతా మంటే సహకరిస్తాం

» ఆయా కంపెనీలకు డిప్యూటీ సీఎం భట్టి ఆహ్వానం

» ముగిసిన విదేశీ పర్యటన.. నేడు హైదరాబాద్‌కు రాక



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జపాన్ పర్యట నలో భాగంగా గురువారం ఆయన క్యోటో నగరానికి సమీపంలోని ప్రముఖ సెమీకండక్టర్ల పరిశ్రమ రోహ్మ్‌ను సంద ర్శించి నిర్వాహకులతో చర్చలు జరి పారు. తొలుత రోహ్మ్ కంపెనీ ప్రెసి డెంట్ ఇనో, కంపెనీ ఉన్నతాధికారులు తకహసి, అండో తదితరులు డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు. పర్సువల్‌గా వివిధ దేశాల్లో తమకు గల సెమీకండక్టర్ల పరిశ్రమలను, అక్కడి ఉత్పత్తి ప్రక్రియలను భట్టికి వారు వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లా డుతూ.. రాష్ట్రంలో హరిత ఇంధనాన్ని పెంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఈ దృష్ట్యా సెమీకండక్టర్ల ఆవశ్యకత పెరిగిందని తెలిపారు. సెమీ కండక్టర్ల పరిశ్రమను సొంతంగా లేదా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో గానీ ఏర్పాటు చేయడానికి ముందు కురావాలని రోహ్మ్ కంపెనీ అధికారులను ఆహ్వానిం చారు. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని వారు చెప్పారు. సాయంత్రం పానాసోనిక్ కంపెనీ కార్యాలయంలో ఆ కంపెనీ ప్రెసిడెంట్ నబి నకానీషితో భట్టి సమావేశమై ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గురించి మాట్లాడారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్ వాహనాల సంఖ్య పెరుగుతోందని, ఆర్టీసీలో పూర్తి స్థాయిలో ఎల క్ట్రానిక్ బస్సులను వినియోగించాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం వారికి చెప్పారు. ఈ దృష్ట్యా తెలంగా ణలో పానాసోనిక్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. అనంతరం టోజీ బౌద్ధ ఆలయాన్ని భట్టి సందర్శించారు. అక్కడి బౌద్ధ గురువు ఆయనకు ఆశీ ర్వచనాలు పలికారు. తెలంగాణలో పలు బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయని, వాటిని సందర్శించడానికి రావా లని బౌద్ధ గురువును భట్టి ఆహ్వానించారు. కాగా, డిప్యూటీ సీఎం విదేశీ పర్యటన గురువారంతో ముగి సింది. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఆయన హైదరా బాద్‌కు రానున్నారు. గత నెల 24న ప్రారంభమైన వి దేశీ పర్యటనలో భాగంగా తొలుత ఆయన వారం పాటు అమెరికాను సందర్శించగా.. ఆ తర్వాత జపాన్ లో మూడ్రోజుల పాటు కొనసాగింది.

59 కింద క్రమబద్ధీకరణ..
'మూసీ' కింద మార్కింగ్!

ఇటీవలే రూ.లక్షలు పెట్టి ఇళ్ల నిర్మాణం.. డబ్బులు తీసుకొని క్రమబద్ధీకరించి, ఇప్పుడు కూల్చేస్తారా?

ఇదెక్కడి అన్యాయం..? మేమెలా బతకాలి?

చైతన్యపురి సత్యానగర్‌లో బాధితుల ఆందోళన

"పైసాపైసా కూడబెట్టుకొని జాగా కొనుక్కున్నాం. సర్కారుకు రుసుము చెల్లించి, దాన్ని జీవో 59 కింద క్రమబద్ధీకరించుకున్నాం. ఊర్లో ఉన్న ఆస్తు లమ్ముకొని, అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఇప్పుడు అధికారులొచ్చి మా ఇళ్లకు 'మూసీ రివర్ బెడ్' అంటూ మార్కింగ్ చేస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం? ఇప్పుడు మా గతేంటి? మేం ఎవరితో చెప్పుకోవాలి?"

- ఇదీ హైదరాబాద్‌లోని చైతన్యపురి సత్యానగ ర్‌లో కొందరు పేదల దీనగాథ.



కాలేజీ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసే మారుపాక రవికు మార్ 20 ఏళ్ల కింద హైదరాబాద్‌కు వచ్చారు. సొంతింటి కోసం పైసాపైసా కూడబెట్టుకొని.. చైతన్య పురిలోని సత్యానగర్‌లో ఏడెనిమిదేళ్ల కిందట రూ.20 లక్షల వరకు పెట్టి, నోటరీ స్థలాన్ని కొన్నారు. అక్కడే చిన్న ఇల్లు నిర్మించుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58 జీవో కింద దరఖాస్తు చేసుకోగా క్రమబద్ధీకరించారు. 58 కింద స్థలాలను ఎప్పటికైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని తెలుసుకున్న రవి.. మరో సారి 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్నారు. రూ.2.10 లక్షలు చెల్లించడంతో సత్యానగర్‌లోని సర్వే నంబరు 78/2లో ఉన్న 100 చ.గజాలకు ఉప్పల్ తహసీల్దార్ కన్వీయన్స్ డీడ్ కూడా చేశారు. దీంతో పాత ఇంటిని పూర్తిగా తొలగించిన రవి.. నల్లగొండ జిల్లాలోని తన పొలాన్ని అమ్మి రూ.20 లక్షలకు పైగా వెచ్చించి ఇక్కడ కొత్త ఇల్లు కట్టుకున్నారు. ఇటీవలే గృహ ప్రవేశం కూడా అయ్యారు. తాజాగా మూసీ అభివృద్ధి పేరుతో అధికారులు వచ్చి.. రవి ఇంటికి 'ఆర్‌బీ ఎక్స్' అంటూ గుర్తు వేశారు. దాంతో ఆయనకు ప్రాణం పోయినంత పనైంది. వారి ముందే ఒంటిపై కిరోసిన్ పోసుకోగా.. స్థానికులు అడ్డుకున్నారు. 'లక్షలు పోసి స్థలాన్ని కొనుక్కున్నా. క్రమబద్ధీకరణకు మళ్లీ రూ.లక్షలు చెల్లించా. ఊళ్లో ఆస్తులమ్మి నిర్మించుకున్న ఇంటిని కూల్చేస్తామంటే ఎలా బతకాలి?' అంటూ రవి రోదిస్తున్నారు.

మరో ఏడు ఇళ్లకూ..

రవికుమార్ ఇంటి పక్కనున్న మరో 7 ఇళ్లను కూడా జీవో 59 కింద అధికారులు క్రమబద్ధీకరణ చేశారు. దీంతో ఆ పేదలంతా అప్పులు చేసి మరీ పక్కా ఇళ్లను నిర్మించుకున్నారు. ఆ ఇళ్లకు కరెంటు మీటర్లు, నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వాటర్‌బోర్డు కూడా మురుగునీటి లైన్లను ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ ఇంటి నంబర్లు ఇచ్చింది. పన్నులు కూడా చెల్లిస్తు న్నారు. కానీ, తాజాగా రెవెన్యూ అధికారులు మూసీ రివర్ బెడ్ (ఆర్‌బీ) అంటూ గుర్తులు వేయడంతో వారంతా గుండెలు బాదుకుంటున్నారు.

జీవో 59 కింద క్రమబద్ధీకరించి..

జీవో 59 కింద క్రమబద్ధీకరించే ముందు రెవెన్యూ అధికారులు అన్ని విధాలుగా పరిశీలించాలి. చెరు వులో, నదిలో ఉంటే క్రమబద్ధీకరించడానికి అవకాశం ఉండదు. అలా ఉంటే దరఖాస్తులను తిరస్కరించ వచ్చు. కానీ, ఉప్పల్ రెవెన్యూ అధికారులు క్రమబద్ధీక రణ చేసేయడంతో కొందరు ఊళ్లో తమకున్న కొద్ది పాటి ఆస్తులను అమ్మేసుకొని, సత్యానగర్‌లో సొంతిళ్లు నిర్మించుకున్నారు. మరికొందరు కన్వీయన్స్ డీడ్‌లను బ్యాంకులో పెట్టి రుణాలు తీసుకొని మరీ ఇళ్లు కట్టుకు న్నారు. మూసీ నది వెంట స్థలాలను క్రమబద్ధీకరిం చిన రెవెన్యూ అధికారులే.. అక్కడ నిర్మించిన ఇళ్లకు రివర్ బెడ్ అంటూ మార్కింగ్‌లు చేయడంతో బాధి తులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఏళ్ల కిందట కొందరు స్థానిక నాయకులే వారికి ఈ స్థలాలను విక్రయించారు. అధికారులూ క్రమబద్ధీకరిం చారు. ఇప్పుడు అవే ఇళ్లను కూల్చేస్తామంటే తమకు దిక్కెవరని? ఎలా బతకాలని? బాధితులు నిలదీస్తు న్నారు. డబ్బులు తీసుకొని క్రమబద్ధీకరించినప్పుడు ఇది రివర్ బెడ్ అని తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, నాయకులు చేసిన తప్పులకు తమను బలిచేస్తారా? అని నిలదీస్తున్నారు. తమ గోడు ఎవ రికి చెప్పుకోవాలో తెలియట్లేదని వాపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ

మూసీ మురికంతా కాంగ్రెసోళ్ల నోట్లోనే ఉంది

మూసీ నిర్వాసిత ఉమ్మడి కుటుంబాల్లో రేవంత్ చిచ్చు

రేవంత్ పాలనా వైఫల్యంతో సర్కారు ఆదాయం పతనం: కేటీఆర్ విమర్శ



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మూసీ మురికి అంతా వాళ్ల నోళ్ల ల్లోనే ఉంది. ఇక శుద్ధి చేయ డమెందుకు? లక్షన్నర కోట్ల ఖర్చు ఎందుకు?' అని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శిం చారు. మూసీ నిర్వాసితుల్లో ఒకే ఇంట్లో ఉంటున్న ఉమ్మడి కుటుంబాలను రోడ్డుకీడ్చి, వారి మధ్య చిచ్చుపెడుతున్న మూర్ఖుడు సీఎం రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. ఇల్లు ఖాళీ చేస్తే డబుల్ బెడ్‌రూం ఇంటితో పాటు రూ.25 వేలు పారితో షికమంటూ అధికారులు వెకిలి ఆఫర్లు ఇస్తున్నారన్నారు. 'కోటి ఆశలతో లక్షలు, కోట్లు వెచ్చించి కట్టుకున్న ఇండ్లకు రూ.25 వేలేనా సన్నాసి..? అదే మీ అన్న ఇంటికి, మీ మంత్రుల ఇళ్లకు రూ.25 వేలు కాదు.. రూ.50 వేలిస్తే కూల్చ మంటారా?' అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇళ్లు పోతున్నా యనే భయంతోనే ఒక బుచ్చమ్మ, ఒక కుమారన్న ప్రాణాలు పోయాయన్నారు. 'నీ ధనదాహానికి, స్కాములకు ఎన్ని ప్రాణాలు బలితీసుకుంటావ్? మిస్టర్ రేవంత్ రెడ్డి.. మీ సర్కారు చేసిన హైడ్రా హత్య కారణంగా ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఆ ఉసురు నీ పార్టీకి తగలదా? గుర్తుపె ట్టుకో.. లెక్కకు మిత్తితో సహా చెల్లించేలా ప్రజలే మీకు గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. సర్కారు ఆదాయం పడి పోవడం రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యానికి నిదర్శనమని, అనుభవరాహిత్యం వల్లే ఈ అనర్థం చోటుచేసుకుందని కేటీ ఆర్ విమర్శించారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి సీఎంకు లేకపోవడమే సమస్య అని, తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే వచ్చే నాలుగేళ్లు కష్టకాలమేనన్నారు. తెలంగాణ ప్రగతి పాతాళానికి చేర్చిన పాపం కాంగ్రెస్‌దేనన్నారు. ప్రభు త్వాన్ని ప్రశ్నిస్తే తట్టుకోలేక వరుసగా జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో మ్యారియట్ ప్రతినిధులు

రాష్ట్రంలో మరిన్ని మ్యారియట్ హోటల్స్

ద్వితీయ శ్రేణి నగరాల్లో ఏర్పాటుకు ప్లాన్

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

సీఎం రేవంత్‌తో హోటల్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అమె రికా ప్రధాన కేంద్రంగా 141 దేశాల్లో విస్తరించి.. ప్రపంచంలోనే అతిపెద్ద హోటల్ కంపెనీగా ఉన్న మ్యారియట్.. రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధ మైంది. దేశంలోని ప్రధాన నగరాల్లో స్టార్ హోటళ్లు ఏర్పాటు చేసిన ఈ సంస్థ.. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ హోటళ్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మ్యారియట్ ఎగ్జిక్యూ టివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డ్రూ పింటో నేతృత్వంలోని కంపెనీ ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విస్తరణ ప్రణాళికను కంపెనీ ప్రకటిం చింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయ బోయే ఏఐ సిటీలో హోటల్ నిర్మాణంపై ఆసక్తిగా ఉన్నామని కంపెనీ తెలిపింది. సీఎంతో భేటీ అనంతరం మ్యారియట్ బృందం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఆ వివరాలను మంత్రి మీడియాకు తెలిపారు. హైద రాబాద్‌లో అత్యాధునిక టెక్నాలజీతో ఆతిథ్య రంగానికి సంబంధించిన గ్లోబల్ కేపబిలిటీ సెంట ర్‌ను మ్యారియట్ ఏర్పాటు చేస్తుందని వెల్లడిం చారు. ఈ కేంద్రం వచ్చే ఏడాది మార్చిలోగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని తెలిపారు. మొదటి దశలో 300 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెప్పారు.

గ్రీన్ ఫార్మా సిటీలో కాలుష్యం ఉండదు..

తాము ఏర్పాటు చేయబోయే ఫార్మా సిటీ పూర్తి పర్యావరణహితంగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అసలు కాలుష్యమే వెలు వడని(జీరో పొల్యూషన్) పరిశ్రమలు ఉంటా యని చెప్పారు. కొద్దిపాటి రసాయన వ్యర్థాలు ఉత్పత్తి అయినా.. ఆయా కంపెనీలే ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేస్తాయని వెల్లడించారు. మరో పది రోజుల్లో ఎన్ని ఫార్మా కంపెనీలు వచ్చేది తెలుస్తుందని అన్నారు. ఫార్మా సిటీలో హోటల్స్ విద్యా సంస్థలు, గృహోపకరణాల తయారీ కంపె నీలు, వినోద రంగ సంస్థలు కూడా ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు.

పేదల ఇళ్ల జోలికొస్తే సర్కారు కూలుతుంది

డ్రైనేజీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం చూపండి.. అది లేకుండా మూసీ సుందరీకరణ ఎందుకు?

» బుల్డోజర్లు దింపితే చూస్తూ ఊరుకోం

» ఇలాంటి చర్యలను అడ్డుకుంటాం

» హైడ్రా అంటే రేవంత్.. రేవంత్ అంటే హైడ్రా

» మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» మర్యాదగా మాట్లాడని రాజకీయ నేతలను మీడియా బహిష్కరించాలని పిలుపు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఇంటిపై గడ్డపార వేస్తే రాష్ట్ర ప్రభుత్వం కూలిపోక తప్పదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిష న్‌రెడ్డి తేల్చి చెప్పారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లపై బుల్డోజర్లు దింపితే బీజేపీ చూస్తూ ఊరుకోదని ప్రకటించారు. పేదలపై ప్రతాపం చూపిస్తే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరిం చారు. రాష్ట్రంలో తమ సర్కారే వస్తుందంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్.. ఇప్పుడు ఎక్కడకు వెళ్లారని నిలదీశారు. వేలాది ఇళ్ల కూల్చివేతపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరకీరణ పేరిట చేప ట్టిన అనాలోచిత చర్యలను అడుగడుగునా అడ్డుకుం టామని, పేదలకు అండగా తమ కార్యాచరణ ఉంటుందని వెల్లడిం చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్‌లోని 70శాతం డ్రైనేజీ నీరు మూసీలో చేరుతోందని, ఆ సమస్యను పరిష్క రించకుండా మూసీ సుందరీకరణ



చేపట్టి ఏం ప్రయోజనమని నిలదీశారు. "హైడ్రా అంటే రేవంత్.. రేవంత్ అంటేనే హైడ్రా. ఆయన ఆలో చనల నుంచి వచ్చిన ఒక సంస్థ హైడ్రా. హైడ్రా కమి షనర్ రంగనాథ్ ఒక అధికారి మాత్రమే. అనేక చెరు వుల్లో బడా బాబులు, రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపారవేత్తల ఫాంహౌస్‌లు ఉన్నాయి. ముందు వాటిపై హైడ్రా ప్రతాపం చూపాలి. దమ్ముంటే అక్ర మంగా నిర్మించిన ఒవైసీ ఫాతిమా కాలేజీని కూల్చండి. ఫాతిమా కాలేజీ కూల్చివేత వాయిదాకు వి ద్యాసంవత్సరాన్ని హైడ్రా కారణంగా చెబుతోంది. ఇప్పుడు పేదల ఇళ్లలో విద్యార్థుల్లేరా? ఎక్కడెక్కడో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వారిని తరలిస్తే వారి చదువేం కావాలి? ఎందుకీ ద్వంద్వ నీతి?" అని మండి పడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా చేతులెత్తేసిన కాంగ్రెస్.. ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో ఆర్థిక సంక్షోభం నెలకొనడంతో రాష్ట్రంలో ఆర్‌జీ ట్యాక్స్, ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.

వారిని మీడియా బహిష్కరించాలి

కుటుంబాలు, మహిళల గురించి ఇష్టానుసారం మాట్లాడడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అలవాటైపోయిం దని కిషన్‌రెడ్డి విమర్శించారు. మర్యాదపూర్వకంగా మాట్లాడని రాజకీయ నాయకులను మీడియా బహి ష్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి భాషను కేసీ ఆర్ మొదలు పెడితే కేటీఆర్ దానిని కొనసాగించారని, ఇప్పుడు రేవంత్ అదే భాష మాట్లాడుతున్నారని ధ్వజ మెత్తారు. అడ్డంగా మాట్లాడే వాళ్లే హీరోలని, వారే నిజ మైన నాయకులని ఈలలు కొట్టినన్ని రోజులూ ఇలాంటి చెడు సంస్కృతి కొనసాగుతూనే ఉంటుం దన్నారు. కుటుంబ వ్యవహారాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు.





గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు

కేటీఆర్ తన తండ్రిని ఏమైనా..
చేశాడేమోనని అనుమానం ఉంది

» ఆయనకు పదవీకాంక్ష ఎక్కువ

» కేసీఆర్ కనిపించడం లేదని ఫిర్యాదు చేయండి: సురేఖ

» ఆయిల్ పామ్ లో తెలంగాణను అగ్రగామి చేస్తాం: తుమ్మల

గజ్వేల్, అక్టోబరు 3: కేటీఆర్‌కు పదవీకాంక్ష ఎక్కువని, దీంతో ఆయన తన తండ్రి కేసీఆర్‌ను ఏమైనా చేశాడేమోనని అనుమానం వస్తోందని, ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్‌ను రక్షించుకోవడం మనందరి బాధ్యత అని మంత్రి కొండా సురేఖ అన్నారు. కేసీఆర్ కనిపించడం లేదని గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆమె సూచించారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వే ల్‌లో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారం కోల్పోవడంతో కేటీఆర్‌కు మతిభ్రమించిం దని, దిక్కుమాలిన సోషల్ మీడియాని పెట్టుకొని ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయ త్నిస్తున్నారన్నారు. తండ్రి ముఖ్యమంత్రిగా ఉండగా ఆయనను నామమాత్రం చేసి కోట్లాది రూపాయల సొమ్మును దోచుకున్నారని, అనేక కుంభకోణాలకు కేటీఆర్ ఆద్యుడు అయ్యారని ఆరోపించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగులో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సిద్దిపేటలో వచ్చే ఏడాది కల్లా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని, రిఫైనరీని ఏర్పాటు చేస్తామన్నారు.

దీక్షల పేరుతో బీజేపీ నేతల కొత్త డ్రామా!

» రుణమాఫీ లెక్కలపై స్పష్టత ఇచ్చినా వారికి అర్థంకావటంలేదు

» మిగిలిన 20 లక్షల మంది రైతులకూ మాఫీ చేస్తాం:తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఎప్పటికప్పుడు చెప్పినప్పటికీ రాష్ట్ర బీజేపీ నాయకులకు అర్థంకావటంలే దని, రైతులను గందరగోళపరిచి తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు దీక్షల పేరిట కొత్త డ్రామాకు తెరతీశారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు. ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా రుణమాఫీ లెక్కలు చెప్పినా, రుణమాఫీ పథకం- 2024 పూర్తి అయినట్లు ప్రకటించకపోయినా.. మళ్లీ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తూ బీజేపీ ముఖ్యనేతలు తమ స్థాయిని దిగజార్చు కుంటున్నారని పేర్కొన్నారు. 'నాకు మంత్రి పదవులు కొత్తకాదు. మంత్రి పదవి కోసమో, ఇతర పదవులకోసమో ఆశపడి ఏది పడితే అది మాట్లాడే నైజం నాది కాదు. ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర నాయకులు నా గురించి చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాల్సిందిగా సూచిస్తున్నా!' అని ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మొత్తం రైతుల సంఖ్య 65.56 లక్షలు ఉంటే... బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య 42 లక్షలుగా ఉన్నదని వెల్లడించారు. రూ. 2 లక్షలలోపు రుణాలు తీసుకుని కుటుంబ నిర్ధారణ పూర్తయిన22, 37, 848 రైతుకు టుంబాలకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగిలిన 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు.



మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అంజన్ కుమార్, అనిల్ కుమార్

పదవులు కాదు.. పార్టీ శాశ్వతం

» కష్టపడ్డ వారికే నామినేటెడ్ పదవులు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారం, పదవులు శాశ్వతం కాదని.. పార్టీయే శాశ్వతమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు, తగిన గౌరవం లభిస్తుందని చెప్పారు. పార్టీ కోసం పాటుపడ్డ వారిని నామినేటెడ్ పదవుల్లో నియమిస్తామని స్పష్టం చేశారు. గురువారం మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేశ్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో పరస్పర విమర్శలు, ప్రతివిమర్శలు సాధారణమని, అయితే అవసరమైన సందర్భంలో ఐక్యంగా ప్రత్యర్థి పార్టీలపై పోరాడటం కాంగ్రెస్ ప్రత్యేకత అని చెప్పారు. మూసీ కూల్చివేతలను ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వాటిని తిప్పి కొట్టే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.

మహిళా మంత్రి ఏడ్చారంటే సర్కారు వైఫల్యమే..

» ప్రతిపక్షాలను అడ్డుకునే సంస్కృతి తెచ్చారు: ప్రభాకర్‌రెడ్డి

» దుబ్బాక ఎమ్మెల్యేను అడ్డుకోబోయిన కాంగ్రెస్ శ్రేణులు

దుబ్బాక, అక్టోబరు 3: 'సాక్షాత్తు ఓ మహిళా మంత్రి మీడియా ముందుకు వచ్చి ఏడ్చారంటే, సామాన్య మహిళల పరిస్థితి ఏమిటి..?' దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. నిఘాసంస్థలు, పోలీసు, పాలన వ్యవస్థలుండి కూడా ఒక మంత్రిపై సోషల్‌మీడియాలో వచ్చిన ఆకతాయి కామెంట్లపై చర్యలు తీసుకోలేకపోతే.. ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని నిలదీశారు. గురువారం దుబ్బాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసేందుకు వచ్చిన ఆయన మాట్లాడారు. ఎక్కడైనా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయడం, అడ్డుకోవడం చూశామని.. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం విఫలమై, ప్రతిపక్షాలను అడ్డుకునే సంస్కృతికి నాంది పలికిందని విమర్శించారు. కాగా, అంతకుముందు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని.. స్థానిక శివాజీ విగ్రహం వద్ద అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. ఆయన కాన్వాయ్‌పై కోడిగుడ్లు, టమాటాలు విసిరేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఇటు బీఆర్ఎస్ కార్యకర్తలూ వారిపైకి రావడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు ఇరు వర్గాల వారిని సముదాయించి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కాళేశ్వరం.. రూ.లక్ష కోట్ల వైఫల్యం:లక్ష్మణ్

» పెద్ద ప్రాజెక్టుల నిర్మాణాల జోలికి వెళ్లొద్దు:ఎంపీ కొండా

» చతుర్విధ జల ప్రక్రియతో సాగుకు మేలు: మర్రి శశిధర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతలలో రూ.లక్ష కోట్లు వెచ్చించినా.. ఆ ప్రాజెక్టు వైఫల్యం ప్రజల కళ్లముందు ఉందని.. వెరసి పదేళ్లలో రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణం ఆదాయ వనరుగా మారకూడదని, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి ప్రాజెక్టులు చేపట్టరాదని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సామాజిక, ఆర్థిక శాస్త్రాల కేంద్రం(సెస్)లో డాక్టర్ మర్రిచెన్నారెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 'హనుమంతరావు ప్రతిపాదించిన చతుర్విధ జలప్రక్రియతో తెలంగాణ జలవనరుల సంరక్షణ' అనే అంశంపై ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ చర్చలో లక్ష్మణ్ మాట్లాడారు. దేశంలో ప్రతీ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం కుదిరే పని కాదని అన్నారు. ఆర్థిక భారం, భూసేకరణ సమస్య లేకుండా చతుర్విధ జల ప్రక్రియ అమలు చేసి, నిర్దేశిత లక్ష్యాలు సాధించవచ్చని తెలిపారు. 30 ఏళ్ల కిందట హనుమంతరావు ప్రతిపాదించిన చతుర్విధ జలప్రక్రియను రాజస్థాన్ అమలు చేసిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వాతావరణ మార్పులతో ఫ్రాన్స్, స్వీడన్‌లాంటి దేశాల్లో పెద్ద డ్యామ్‌లను కూలగొడుతున్నారని తెలిపారు. స్పెయిన్ లాంటి దేశాల్లో చతుర్విధ జల ప్రక్రియ అమలవుతోందని చెప్పారు. పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం జోలికి వెళ్లొద్దని సూచించారు. లక్ష ఎకరాలకు నీరందించేలా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ.4,350 కోట్లతో ప్రతిపాదించారని, పూర్తయ్యేలోపు దీని వ్యయం ఎక్కడిదాకా చేరుతుందో అర్థం కాని పరిస్థితి ఉందని మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను వెనక్కి తీసుకుని, ఆ ప్రాంతంలో చతుర్విధ జల ప్రక్రియను అమలు చేస్తే.. లక్ష ఎకరాల్లో ఏటా మూడు పంటలు పండించే అవకాశం ఉంటుందని తెలిపారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ నేత ఈటల, కృష్ణయ్య తదితరులు

రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వం


» పెద్దఎత్తున ఉద్యమిస్తాం..మహాధర్నాలో వక్తలు

కవాడిగూడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని పలువురు వక్తలు స్పష్టం చేశారు. రైతులు, భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వడం గానీ, ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు గానీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఆర్.కృష్ణయ్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. చౌటుప్పల్, భువనగిరి వద్ద ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. గజ్వేల్, ఫార్మాసిటీ భూనిర్వాసితులు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారని, వారికి కూడా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులకు జరుగుతున్న అన్యాయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉందంటే.. తాను ముందుండి కేంద్రంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా.. కొంతమంది అవసరాలకు అనుగుణంగా ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చే ప్రయత్నం జరిగిందంటూ దుయ్యబట్టారు. రైతులు, భూనిర్వాసితుల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతుంటుందని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్‌పై రైతులు, నిర్వాసితులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు తెగించి పోరాడాలని పిలుపునిచ్చారు. మూసీ సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్లను వెచ్చిస్తూ.. అనేక సంవత్సరాలుగా నివాసముంటున్న వారిని నిరాశ్రయులను చేస్తున్నారని మండిపడ్డారు.

సురేఖపై నాగార్జున పరువు నష్టం దావా

(మొదటి పేజీ తరువాయి)





తమ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు తమ కుటుంబాన్ని మానసిక క్షోభకు గురిచేశాయని ఆవేదన వెలిబుచ్చారు. బాధ్యతగల మంత్రి పదవిలో ఉండి.. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధారమైన, అవాస్తవ వ్యాఖ్యలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు.. తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగిన నేపథ్యంలో.. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు మంత్రి కొండా సురేఖ గురువారం వరంగల్‌లో ప్రకటించారు. "అనుకోని సందర్భంలో.. అనుకోకుండా ఓ కుటుంబంపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. కేటీఆర్ నన్ను కించపరిచే విధంగా మాట్లాడారు. ఆ మాటలతో వేదనకు గురై ఆయన గురించి వ్యాఖ్యలు చేసే క్రమంలో అనుకోకుండా ఆ కుటుంబం గురించి మాట్లాడా. ఆ వ్యాఖ్యలను నేను వెనక్కి తీసుకుంటున్నా. కానీ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదు" అని ఆమె సురేఖ స్పష్టం చేశారు. తాను వ్యాఖ్యలు చేసిన తర్వాత ఎక్స్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఆ కుటుంబం ఆవేదనతో చేసిన పోస్టులు చూసి తనకు బాధ అనిపించిందని, ఆ కుటుంబాన్ని తన వాఖ్యలు నొప్పించాయని తెలిసి బాధ పడ్డానని పేర్కొన్నారు. తాను పడిన బాధ వాళ్ల పడకూడదనే ఉద్దేశంతో.. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ తాను కూడా ఎక్స్‌లో పోస్టు చేశానని తెలిపారు. కేటీఆర్ తనను మరింత రెచ్చగొడుతున్నారని ఆమె మండిపడ్డారు. "కేటీఆర్‌కు నేను క్షమాపణ చెప్పడమేంటని.. ఆయనే నాకు క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. దొంగే 'దొంగా దొంగా' అన్నట్టుగా కేటీఆర్ ప్రవర్తన ఉందని.. ఆయన తనపై పెట్టించిన పోస్టులన్నింటినీ తొలగించాలని దుయ్యబట్టారు. తన కంటే ముందు.. మంత్రి సీతక్కపై ఇంకా ఘోరంగా ట్రోల్ చేశారని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలను ట్రోల్ చెయ్యొద్దని బీఆర్ఎస్‌కు హితవు పలికిన ఆమె.. "కేటీఆర్ నీకు మహిళలు పనికిమాలిన వాళ్లలా కనిపిస్తున్నారా? మీ కుటుంబ సభ్యులే మహిళలా? నీ నోరు ఏ యాసిడ్‌తో కడగాలి?" అంటూ నిప్పులు చెరిగారు. తనను ట్రోల్ చేసినవారిని కేటీఆర్ దుబాయ్‌లో దాచి పెట్టారని ఆరోపించారు. వెంటనే వారిని తీసుకొచ్చి అప్పగించాలని డిమాండ్ చేశారు. సినీ పెద్దల స్పందన వెనుక బీఆర్ఎస్ నేతలు ఉన్నారో, లేదో తనకు తెలియదన్నారు. కేటీఆర్ ఇచ్చిన నోటీసులను తాను లీగల్‌గా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతండడంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. దీనిపై వివరణ ఇవ్వాలని సురేఖకు సూచించారు. దీంతో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్టు ఆమె ట్వీట్ చేశారు. "నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి ధోరణిని ప్రశ్నించడమే తప్ప.. సమంతా, మీ మనోభావాలను దెబ్బతీయం కాదు" అని స్పష్టం చేశారు. 'స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానమే కాదు.. ఆదర్శం కూడా. నా వ్యాఖ్యల పట్ల మీరుగానీ, మీ అభిమానులుగానీ మనస్తాపానికి గురైతే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను. అన్యధా భావించవద్దు" అని మంత్రి పేర్కొన్నారు. మరోవైపు.. కేటీఆర్‌పై నిరాధార వ్యాఖ్యలు చేసిన సురేఖపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మహిళా కార్పొరేటర్లు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక.. మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు నేతృత్వంలో గాంధీభవన్ వద్ద ఆందోళన చేపట్టారు. కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాంపల్లి చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. తమ పార్టీపై హానికర ప్రచారం చేస్తున్న కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణక్క ఉట్నూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కేటీఆర్, హరీశ్, పలు యూట్యూబ్ చానళ్లపై కేసు

హైదరాబాద్ సిటీ: మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌పై సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఎంపీ రఘునందనరావు మంత్రి కొండా సురేఖకు మాల వేసిన ఘటనను బీఆర్ఎస్ సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. పలు యూట్యూబ్ చానళుల కూడా ఈ విషయాన్ని ప్రసారం చేశాయి. నకిలీ వార్తలను బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారితోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావుతోపాటు యూట్యూబ్ చానళ్లలో ప్రసారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ రఘునందనరావు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేటీఆర్, హరీశ్‌తోపాటు పలు యూట్యూబ్ చానళ్లపై కేసు నమోదు చేశారు.

మీ రాజకీయాల్లోకి మమ్మల్నెందుకు లాగుతున్నారు

మంత్రి వ్యాఖ్యలు అవమానకరం: చిరంజీవి

సురేఖ వ్యాఖ్యలను ఖండించిన సినీ ప్రముఖులు



మంత్రి కొండా సురేఖ ఆరోపణలపై చిత్ర పరిశ్రమ భగ్గుమంది. ఆమె వ్యాఖ్యలు అక్కినేని కుటుంబ గౌరవానికి, సమంత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీ రాజకీయాల్లోకి మమ్మల్ని ఎందుకు లాగుతున్నారంటూ' పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా మంత్రిని ప్రశ్నించారు. "మంత్రి వ్యాఖ్యలు నన్ను చాలా బాధించాయి. ఆమె వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. రాజకీయ మనుగడ కోసం అభ్యంతరకర రీతిలో కల్పిత ఆరోపణలు చేయడం మంచిది కాదు. రాజకీయ లబ్ధి కోసం ఇంత నీచానికి దిగజారకూడదు. రాజకీయాలతో సంబంధం లేని మహిళలను ఇందులోకి లాగడం సరికాదు. మా చిత్ర పరిశ్రమ సభ్యులపై ఇలాంటి దుర్మార్గపు దాడులను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాం. మంచి చేస్తారని మేం నాయకులను ఎన్నుకుంటున్నాం. కానీ మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. రాజకీయ నాయకులు, గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారు అందరికీ స్ఫూర్తిగా నిలవాలి" అని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక.. మంత్రి ఆరోపణలతో తాను దిగ్భ్రాంతికి గురైనట్టు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. "బీజేపీ నేత రఘునందన్ విషయంలో ఎవరో తనను అవమానిస్తే.. అసలు ఆ విషయంతో ఏ సంబంధమూ లేని నాగార్జునను, నాగచైతన్యను దారుణంగా అవమానించడమేమిటి? వాళ్లిద్దరినీ అంత జుగుప్సాకరంగా అవమానించి ఇప్పుడు సమంతకు క్షమాపణ చెప్పడమేంటి? ఇందులో సమంతను అవమానించడం ఏముంది? ఇంతకన్నా ఘోరమైన అవమానాన్ని నా జీవితంలో చూడలేదు. సురేఖ తానేదో కళ్లతో చూసినట్లు, చెవులతో విన్నట్లు మీడియా ముందు అరచి చెప్పడం దారుణం" అని ఆర్జీవీ మండిపడ్డారు. ఉన్నతస్థానాల్లో ఉన్నవారు సంయమనంతో ఉండాలని.. వ్యక్తిగత విషయాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దురదృష్టకరమని నటుడు వెంకటేశ్ అన్నారు. మంత్రి ప్రవర్తన చాలా అగౌరవంగా, తెలుగు సంస్కృతికి విరుద్ధంగా ఉందని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. ఇలాంటి బాధ్యతారహితమైన ప్రవర్తనను ఉపేక్షించకూడదని ఆయన పేర్కొన్నారు. మహిళా మంత్రి అయి ఉండి.. సాటి మహిళపై సురేఖ చేసిన వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని మహేశ్‌బాబు అన్నారు. "మీ భాష పట్ల తీవ్ర ఆవేదనకు గురయ్యాను. మీ చౌకబారు, నిరాధార వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. ఇక.. ఇలాంటి ప్రవర్తనను చిత్ర పరిశ్రమ, సమాజం సహించదని.. ఇలాంటివాటిని తాము చూస్తూ ఊరుకోబోమని నటుడు ఎన్టీఆర్ హెచ్చరించారు. వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడం సరైనది కాదని ఆయన హితవు పలికారు. చిత్ర పరిశ్రమను బాధపెట్టాలని ఎవరు చూసినా తాను మౌనంగా ఉండబోనని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడాన్ని పరిశ్రమ సహించదని దర్శకుడు రాజమౌళి పేర్కొనగా.. మహిళా మంత్రి పైశాచిక వ్యూహాలను అవలంబించడం భయాందోళనలకు గురిచేస్తోందని నటుడు రవితేజ అన్నారు. "బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి, మీడియా ముందు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. తాము ఏం మాట్లాడినా తప్పించుకోవచ్చు అని రాజకీయ నాయకులు అనుకోవడం అసహ్యకరంగా ఉంది" అని నటుడు నాని ట్వీట్ చేయగా.. స్వార్థం కోసం ఇలాంటి వ్యాఖ్యలతో రాజకీయాలను దిగజార్చవద్దని విజయ్ దేవరకొండ అన్నారు. ఇక.. మంత్రి సురేఖ తన పేరును ప్రస్తావించడంపై నటి రకుల్ ప్రీత్ సింగ్ స్పందించారు. 'నాకు రాజకీయాలతో సంబంధం లేదు. మీ రాజకీయ ప్రయోజనాల కోసం నా పేరు వాడుకోవద్దు'అని విజ్ఞప్తి చేశారు. 'మన ప్రవర్తన హుందాగా ఉండాలని మౌనాన్ని ఆశ్రయిస్తాం. కానీ దాన్ని మన బలహీనతగా భావిస్తారు' అని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. కాగా.. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందరి దృష్టినీ ఆకర్షించడానికి సినిమావాళ్లపై చేసిన ఇలాంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మొత్తం పరిశ్రమ ఏకతాటిపై నిలబడుతుందని.. తెలుగు చిత్ర పరిశ్రమ సభ్యుల వ్యక్తిగత జీవితాలపై ఎవరైనా తప్పుగా మాట్లాడితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని అందులో హెచ్చరించింది. సినీ ప్రముఖుల ఆగ్రహం నేపథ్యంలో.. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందించారు. "మంత్రి సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. కాబట్టి ఈ అంశానికి ఇక్కడితో ముగింపు పలకండి" అని సినీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పార్టీ నాయకులకు, మంత్రులకు ఆయన సూచించారు.

ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు పవన్ కుమార్ మృతి



జే.పవన్ కుమార్ (ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి సీనియర్ సబ్ ఎడిటర్ జే పవన్ కుమార్ (57) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన 2018లో మల్టిపుల్ మైలోమా క్యాన్సర్ బారినపడగా.. చికిత్స తర్వాత ఆరోగ్యం కాస్త కుదుటపడింది. మళ్లీ అస్వస్థతకు గురికావడంతో సెప్టెంబరు 4న బెంగళూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరిన ఆయన చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏపీలోని గుంటూరుకు చెందిన పవన్ కుమార్ 1992లో ట్రైనీ సబ్‌ఎడిటర్‌గా ఆంధ్రజ్యోతిలో చేరారు. 2002 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ, రాయలసీమ జిల్లా ఎడిషన్లలో, తర్వాత హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో పనిచేశారు. కుమారుడిని అమెరికాలో ఎంఎస్ చదివించేందుకు పంపాలని ఏర్పాట్లు చేసుకుంటుండగా ఇంతలోనే పవన్ కుమార్ కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని (ఎంఐజీ 288) ఆయన నివాసానికి తీసుకురానున్నారు.

ఆశ్రయమిచ్చి.. అత్యాచారం చేసి..

» పునరావాస కేంద్రం నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలపై గ్యాంగ్‌రేప్

» ఐదుగురి అరెస్ట్.. జనగామలో ఘటన

» ఆలస్యంగా వెలుగులోకి

సైదాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రం నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలను ఐదుగురు గ్యాంగ్‌రేప్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఉదంతంలో ఐదుగురు నిందితులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ ప్రాంతంలోని ఓ ఉమెన్స్ డీఅడిక్షన్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ నుంచి గత నెల 24న ఉదయం ఇద్దరు బాలికలు పారిపోయారు. తర్వాత వారు బస్సులో జనగామ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఆ బాలికలు ఓ యువకుడిని ఫోన్ అడిగి తెలిసిన వ్యక్తికి ఫోన్ చేసి తాము జనగామలో ఉన్నామని.. అక్కడకు రావాలని చెప్పారు. అయితే తాను అందుబాటులో లేనని, మర్నాడు వస్తానని అతను చెప్పాడు. దీంతో బాలికలు ఫోన్ ఇచ్చిన యువకుడు సాయి(25)ని తమకు ఆశ్రయం ఇవ్వాలని కోరారు. దీంతో బాలికలను అతడు తన స్నేహితుడి బేకరీ దుకాణంలో రాత్రి ఉంచాడు. అయితే ఆ యువకులిద్దరూ ఆ బాలికలను అత్యాచారం చేశారు. మర్నాడు జరిగిన విషయాన్ని ఇతర స్నేహితులకు చెప్పారు. అందరూ కలిసి కారులో బాలికలను ఆలేరుకు తీసుకువెళ్లే క్రమంలో మళ్లీ లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం బాలికలను వారికి తెలిసిన వ్యక్తికి అప్పగించారు. అయితే మర్నాడు జనగామ బస్టాండ్‌కు ఆ బాలికలు తిరిగి రాగా అనుమానాస్పదంగా ఉన్న వారిని పోలీసులు విచారిస్తే జరిగిన ఘోరాన్ని వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న సైదాబాద్ పోలీసులు ఐదుగురు యువకులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అరగంటలో ఆస్పత్రులకు గిరిజనం!

అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలి.. ఐటీడీఏల్లో కొత్త పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు

» ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న మంత్రి రాజనర్సింహ

» ఐటీడీఏల పీవోలు, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిపుత్రుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అడవులు, కొండలు కోనల్లో నివసించే గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న ఆస్పత్రులే కాకుండా.. మరిన్ని కొత్త ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, వైద్యాన్ని గిరిజనం చెంతకు చేర్చాలని భావిస్తోంది. గిరిజనులు అర గంట లోపే ఆస్పత్రులకు చేరుకునే స్థాయిలో నెట్‌వర్క్‌ను విస్తరించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. అందులో భాగంగా కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), సబ్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ అధికారులను, ఐటీడీఏల పీవోలను ఆదేశించారు. ఇప్పటికే సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో కొన్ని ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో మరిన్ని వసతులు కల్పించి, వైద్య సేవలను మెరుగుపర్చాలని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, ఏటూరునాగారం, మన్ననూరు ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆస్పత్రులు, వైద్య సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి రాజనర్సింహ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఐటీడీఏల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తమ ఆవాసాల నుంచి అర గంట లోపు చేరుకునేలా ఆస్పత్రుల నెట్‌వర్క్ ఉండాలని చెప్పారు. ఇందుకు అనుగుణంగా కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండకూడదని, ప్రజల అవసరాలకే ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. ఐటీడీఏల పరిధిలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. అటవీ ప్రాంతాలు, రోడ్ కనెక్టివిటీ సరిగా లేని ప్రాంతాల్లోని గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ (ఈడీడీ) కంటే ముందే గర్భిణులను ఆస్పత్రులకు తరలించి, బర్త్ వెయిటింగ్ రూమ్‌లలో వారికి అడ్మిషన్ ఇవ్వాలని చెప్పారు. 108 అంబులెన్సులు వెళ్లలేని ప్రాంతాల్లో బైక్ అంబులెన్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటి కోసం జనాభా ప్రాతిపదికన ప్రతిపాదనలు అందజేయాలని పీవోలను ఆదేశించారు. గిరిజన గూడేలు, చెంచు పెంటలను క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు కనీసం వారానికి ఒకసారి, మెడికల్ ఆఫీసర్లు నెలకోసారి సందర్శించాలని తెలిపారు. ఆదివాసీలకు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్ వంటి పెద్ద దవాఖానాల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం కంటే ఈసారి డెంగీ, వైరల్ జ్వరాల కేసులు తక్కువగా నమోదయ్యాయని ఐటీడీఏల పీవోలు మంత్రికి తెలిపారు.

రాష్ట్రంలో ఏఎంఆర్ కార్యాచరణ

యాంటీబయాటిక్స్ విపరీతంగా వాడటం ద్వారా ఏ మందులూ పనిచేయక ప్రాణాలకే ముప్పు వచ్చే స్థితి నుంచి బయటపడే లక్ష్యంతో రూపొందించిన యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కార్యాచరణ ప్రణాళికను మంత్రి దామోదర ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ త్వరలో దీనిని ప్రభావవంతంగా అమలు చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని డబ్ల్యూహెచ్‌వో ఇండియా ప్రతినిధి డాక్టర్ అనూజ్ శర్మ చెప్పారు.

వీఆర్‌కు ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలు

» ఇసుక అక్రమ రవాణా కట్టడిలో అలసత్వానికి ఫలితం..!

» 9 జిల్లాల అధికారులపై చర్యలు

» నిఘా నివేదికతో ఐజీ చర్యలు

» బాలికపై అత్యాచారం కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం.. వికారాబాద్ సీఐ సస్పెన్షన్

» పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశం

హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అక్రమాలు, అలసత్వం వహించిన పోలీసులపై వేటు పడింది. భారీ సంఖ్యలో అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)కు పంపారు. నిఘా విభాగం నివేదిక ఆధారంగా 9 జిల్లాలకు చెందిన 16 మందిని విధుల నుంచి తప్పించారు. డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు ఐజీ సత్యనారాయణ మల్టీ జోన్-2 పరిధిలోని ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వేటుపడిన వారిలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐ ఉన్నారు. వీరిలో కొందరు ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్ష సహకారం అందించినట్లు తేలింది. కాగా, బాలికపై అత్యాచారం కేసు దర్యాప్తులో అలసత్వం వహించిన వికారాబాద్ టౌన్ సీఐ నాగరాజును సస్పెండ్ చేశారు. ఈయన జోగిపేటలో పనిచేసినప్పుడు ఈ ఆరోపణలొచ్చాయి. మరోవైపు ఒకేసారి ఇంతమందిపై చర్యలు తీసుకోవడం పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది.

నిఘా విభాగం నిశిత దృష్టి

ఠాణాల్లో సిబ్బంది రోజువారీ పనితీరు, ప్రవర్తనపై నిఘా విభాగం దృష్టిసారించింది. అవినీతి, అక్రమాలకు పాల్పడేవారిపై కన్నేసింది. ఈ క్రమంలో అందిన నివేదికల మేరకు బాధ్యులపై ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ అంటే ప్రజల్లో నమ్మకం కలిగేలా చేయడంతో పాటు, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవనే హెచ్చరిక పంపుతున్నారు. కొద్ది రోజుల కిందట అడవి దేవిపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్ మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాడెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట, తాండూరు, చిన్నంబావి ఎస్సైలను బదిలీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడంలో విఫలమైనందుకే వీరిపైనా చర్యలు తీసుకోవడం గమనార్హం. జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్, కొండమల్లేపల్లి హోంగార్డులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలడంతో జిల్లా కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా కట్టడిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరించారు.

చౌక బియ్యం పక్కదారిపైనా..

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవడంపైనా పోలీస్ శాఖ దృష్టిసారించింది. ఇప్పటికే రహస్య విచారణ చేపట్టి.. ఇలాంటివారి సమగ్ర సమాచారాన్ని సేకరించారు. స్థానికంగా రవాణా చేసేవారితో పాటు ఇతర రాష్ట్రాలకు తరలించేవారిని పట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు ప్రధాన నిందితులను పట్టుకుని చర్య తీసుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. పేద, మధ్యతరగతి వారిని దోపిడీ చేసే గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని.. ఈ బాధ్యత ఎస్పీలదేనని ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు. కాగా, వికారాబాద్‌లోని మర్పల్లి గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడిస్తున్న రఫీపై ఎస్పీ సస్పెక్ట్ షీట్ తెరిచారు. మరో నిర్వాహకుడు ప్రభాకర్‌ను హెచ్చరించారు.

ఎస్సీ వాటా 15% పక్కన పెట్టి టీచర్ల నియామకాలు చేయాలి

- వర్గీకరణ అమలుతోనే మాదిగలకు న్యాయం
- తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక
- సీఎం రేవంత్‌కు వినతి పత్రం అందజేత

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలలో ఎస్సీ వాటా 15 శాతం పక్కనపెట్టి నియామక ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ మాదిగ సంఘాల ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఐక్యవేదిక ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా టీచర్ ఉద్యోగాల భర్తీ చేసిన పక్షంలో మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. మాదిగల ఆర్తనాదాలు అర్థం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు, ఛైర్మన్ నియామకాలు, కాంగ్రెస్ పార్టీ పదవుల్లోనూ 15 శాతం ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసి మాదిగలకు 10 శాతం పదవులు ఇవ్వాలని కోరారు.

వీసీల నియామకాల్లో సామాజిక సమతుల్యం!

యూనివర్సిటీల వీసీల నియామకాల్లో సామాజిక సమతుల్యతను పాటించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సెర్చ్ కమిటీల సమావేశాలు జరుగుతున్నాయి. గురువారం ఉస్మానియా, పాలమూరు, తెలుగు వర్సిటీల సెర్చ్ కమిటీల సమావేశాలు జరగ్గా శుక్రవారం మరికొన్ని వర్సిటీల సెర్చ్ కమిటీల సమావేశాలు జరగనున్నాయి. ఈ వీసీల నియామకాల్లో ప్రధానంగా సామాజిక సమతుల్యతను పాటించే కోణంలో అభ్యర్థుల ఎంపికపై సెర్చ్ కమిటీల్లో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించండి

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ జేఏసీ ప్రతినిధులు ధర్మతేజ, ఉపేందర్, సాదురాజేశ్, వేల్పుల కుమార్ తదితరులు బహిరంగ లేఖ రాశారు. ఏళ్ల తరబడి వర్సిటీల్లో నియామకాలు జరగడం లేదని, కాంట్రాక్టు వారిని క్రమబద్ధీకరించుకోవచ్చని యూజీసీ ఛైర్మన్ ప్రకటించారని తెలిపారు. ఏళ్ల తరబడి వర్సిటీలనే నమ్ముకున్న తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

నీటి పారుదల ప్రాజెక్టులకు 527 కోట్ల చెల్లింపు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల ప్రాజెక్టుల బిల్లుల్లో కదలిక వస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు రూ.527.8 కోట్ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ప్రాధాన్య ప్రాజెక్టుల వాటా రూ.390 కోట్లు ఉండగా.. కీలకమైన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం)కు సంబంధించి రూ.110 కోట్లు విడుదల చేశారు. తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టు సాధించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరుసగా బకాయిలపై సమీక్ష చేశారు. దీంతో క్రమంగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రధానంగా వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం, పునర్‌నిర్మాణానికి ప్రాధాన్యమిస్తూ చెల్లింపులు అధికంగా చేసినట్లు సమాచారం.

13న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్

హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ కమిటీ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ వేడుకలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు వివిధ రాష్ట్రాల గవర్నర్లను, కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించినట్లు విజయలక్ష్మి చెప్పారు. తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా రా!

- ఇద్దరం మూసీ పరీవాహక ప్రాంతాలకు వెళ్దాం
- శెభాష్ రేవంత్ అంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- బహిరంగ క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తా: ఈటల

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కూలగొడుతున్న చోటకు సెక్యూరిటీ లేకుండా రావాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. శెభాష్ రేవంత్ రెడ్డి అని బాధితులు అంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో పాటు ముక్కు నేలకు రాస్తానన్నారు. కంటోన్మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఈటల మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు, చెరువులు బాగుచేయటానికి తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీ ప్రక్షాళనకు ఎంత ఖర్చవుతుందో, ఎప్పటి వరకు పూర్తి చేస్తారో చెప్పాలని ఈటల డిమాండ్ చేశారు.

అదానీతో పొంగులేటి భేటీ రహస్యమేంటి?:దాసోజు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు అదానీని అడ్డగోలుగా విమర్శిస్తారు. కానీ, తెలంగాణలో మాత్రం రహస్యంగా భేటీ అవుతూ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తున్నారు' అని బీఆర్ఎస్‌నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. గౌతమ్ అదానీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సునీల్ కనుగోలు.. బుధవారం ఐటీసీ కోహినూర్‌లో భేటీ అయ్యారని ఆరోపించారు. 'బీజేపీతో అంటకాగే వ్యాపారవేత్తలతో కాంగ్రెస్ నేతలకు ఏం పని? అదానీతో మీటింగ్ రహస్యం ఏమిటి? పొంగులేటి ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఇటీవలే పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు జరిగిన తర్వాత అందరూ తేలుకుట్టిన దొంగల్లా ఉన్నారని, లెక్కకు మించిన ఆదాయం దొరికితే ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందని అన్నారు. గౌతమ్ అదానీని అడ్డుపెట్టుకొని ఈడీ కేసు నుంచి పొంగులేటి బయటపడే ప్రయత్నం చేస్తున్నారా? అని దాసోజు శ్రవణ్ నిలదీశారు.

గ్రూప్-1పై అభ్యంతరాలకు అర్థం లేదు

- హైకోర్టులో వాదనలు.. విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలపై వచ్చిన అభ్యంతరాలకు అర్థం లేదని గురువారం హైకోర్టులో టీజీపీఎస్సీ వాదించింది. పరీక్షను రద్దుచేయాలని, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు చెల్లదని, తప్పుడు ప్రశ్నలను తొలగించి మళ్లీ ఫలితాలు విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిగింది. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. నిపుణులు పరిశీలించిన తర్వాతే ఫలితాలు, కీ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. 3 లక్షల మందికి లేని అభ్యంతరం ఒకరిద్దరికి ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. మెయిన్స్ కోసం సిద్ధమవుతున్న వారిని అయోమయానికి గురిచేయకూడదని పేర్కొన్నారు. త్వరలో మెయిన్స్ జరగనున్న నేపథ్యంలో ఈ దశలో జోక్యం చేసుకోరాదని తెలిపారు. ఒక పుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రశ్నలు తప్పని పిటిషనర్లు పేర్కొనడం సరికాదని చెప్పారు. వారికి అర్థంకాకపోతే ప్రశ్నే తప్పు అని నిర్ధారణకు రాకూడదని తెలిపారు. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

విద్యుత్ వినియోగంలో ఏడో స్థానంలో తెలంగాణ

తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే ఏడో స్థానంలో నిలిచింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2,349 యూనిట్లు. అయితే, 8,870 యూనిట్లతో డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ అగ్రస్థానంలో నిలిచింది. ఇక, 3,360 యూనిట్లతో గోవా రెండో స్థానంలో ఉండగా, 2,574 యూనిట్లతో పంజాబ్, 2,419 యూనిట్లతో ఒడిశా, 2,393 యూనిట్లతో గుజరాత్, 2,360 యూనిట్లతో హరియాణా వరుసగా తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఇక, 2006-07లో 672 యూనిట్లుగా ఉన్న జాతీయ తలసరి విద్యుత్ వినియోగం 2022-23లో 1,331 యూనిట్లు అయ్యింది. తెలంగాణ విద్యుత్ వినియోగంలో వ్యవసాయ రంగం వాటా 39.33 శాతంగా ఉంది. 27 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. గృహ వినియోగం వాటా తెలంగాణలో 20.30 శాతంగా ఉండగా, వాణిజ్య వినియోగం 10.62 శాతంగా ఉంది.

పేదలను కవచంగా వాడుకుంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ముంపుకు గురవుతుంటే రక్షణ చర్యలు తీసుకోవద్దా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ నేతలు ఆగర్భ శ్రీమంతులయ్యారని.. కేటీఆర్, హరీశ్‌రావు, సబిత కుమారుల ఫాంహౌజ్‌లను కూల్చొద్దా? అని ప్రశ్నించారు. "కేటీఆర్.. జన్వాడలో మీకున్న ఫామ్‌హౌస్ అక్రమ నిర్మాణం కాదా? అది కూల్చాలా.. వద్దా? హరీశ్‌రావూ.. అజీజ్‌నగర్‌లో ఉన్న మీ ఫామ్‌హౌస్ అక్రమ నిర్మాణం కాదా? దాన్ని కూల్చాలా.. వద్దా? సబితమ్మా.. పెద్ద అరుపులు వద్దు. మీకున్న ఫామ్‌హౌస్‌ల లెక్కలూ ఉన్నాయి. సబితా రెడ్డి ముగ్గురు కుమారుల పేరు మీద ఉన్న మూడు ఫామ్ హౌస్‌లను, ఆమె వెనుక ఉన్న కేవీపీ రాంచందర్‌రావు ఫామ్‌హౌస్‌లను ఎందుకు కూల్చొద్దు?" అని ప్రశ్నించారు. గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోబీఘాట్‌లో 'ఒకే రాష్ట్రం-ఒకే కార్డు' (తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు) పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని రేవంత్ ప్రారంభించారు. సర్వే ఫారాలను కొన్ని కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. మూసీని అడ్డుపెట్టుకుని ఇంకా ఎన్నేళ్లు బతుకుతారు? అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. ఫ్లోరైడ్‌తో పాటు నీళ్ల కంపుతో నల్లగొండ జిల్లా వాసులు ప్రాణాలు కోల్పోతుంటే.. వారికి అండగా నిలవాల్సింది పోయి, బీఆర్ఎస్, బీజేపీ నేతలు వారి చావును కోరుకుంటున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రక్రియలో ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వం వెనకడుగు వేసేది లేదని సీఎం స్పష్టం చేశారు. కొందరు మోసగాళ్ల కారణంగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అమాయకులు తమ కష్టార్జితంతో ఇళ్లు కట్టుకున్నారని.. వారి బాధ తనకు తెలుసునని, అందుకే ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల తమపై బుల్డోజర్లు పోనివ్వాలని అంటున్నారని, అయితే వాళ్ల మీద నుంచి పోనివ్వడానికి బుల్డోజర్లు కొనేంత డబ్బులు తమ వద్ద లేవని ఎద్దేవా చేశారు.



'ఒకే రాష్ట్రం-ఒకే కార్డు' పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమానికి జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మీ పార్టీ నిధుల నుంచి రూ.500 కోట్లు ఇవ్వండి!

తెలంగాణ సమాజాన్ని మోసం చేసి సంపాదించిన రూ.1500 కోట్లు బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్నాయని, వాటి నుంచి రూ.500 కోట్లు తీసి మూసీ బాధితులకు అండగా నిలవాలని సీఎం సూచించారు. ప్రజలు కడుతున్న పన్నుల నుంచి పేదలను ఆదుకోవచ్చని, ఎవరి తాత సొమ్ము ఖర్చు పెట్టవలసిన అవసరం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డగోలు తప్పులు, విపరీతమైన అప్పులు చేయటంతో రాష్ట్రం నిండా మునిగిందని, దానిని సరిదిద్దడానికి తమ ప్రభుత్వం శ్రమిస్తున్నదని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లు ఏలి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నందునే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఉద్యోగాలను నిరుద్యోగులు ఊడగొట్టారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే ఎల్బీ స్టేడియంలో నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందచేశామని, ఈ నెల 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు అందచేయనున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో వేలాది పారామెడికల్ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో తాను మాట్లాడి, కంటోన్మెంట్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి చొరవ చూపానని, 190 ఎకరాల భూబదలాయింపు చేశామని సీఎం తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా కంటోన్మెంట్‌కు బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కూడా తాను కొట్లాడానని తెలిపారు. కంటోన్మెంట్‌లో భూబదలాయింపు చేసి, ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకే డిజిటల్ కార్డు

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రేషన్ కార్డు కోసం ప్రజలు ఎంతో ఎదురు చూశారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రేషన్‌కార్డుల జారీని తమ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. వివిధ శాఖల ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ప్రభుత్వంలోని 30 శాఖలను ఒకే దగ్గరకు తీసుకురావాలని వన్ స్టేట్ వన్ కార్డును తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, ఆర్టీసీ ఉచిత బస్సు సదుపాయం, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అన్ని పథకాలకు ఇకపై ఒకేకార్డు ఉంటుందన్నారు. జనన మరణాల నమోదుకు, ఇతర మార్పులకు కూడా డిజిటల్ కార్డు ఉపయోగపడుతుందని చెప్పారు. డిజిటల్ కార్డు ద్వారా హెల్త్ చెకప్‌లు మరింత సులువుగా మారతాయని అన్నారు. డిజిటల్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ న్యాయం చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో డిజిటల్ కార్డుల పంపిణీ ఉంటుందని, ఐదారు రోజుల్లో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామన్నారు.

మోదీ వద్దకు పోదాం.. రూ.25వేల కోట్లు తెద్దాం పదండి!

"ఈటల.. మల్కాజిగిరి నుంచి ఎంపీగా మీరు గెలిచారు కదా.. మోదీ నుంచి ఏం తెస్తారో తీసుకురండి? గుజరాత్‌లో మోదీ సబర్మతి రివర్‌ఫ్రంట్ కట్టుకోవచ్చుగానీ, తెలంగాణలో మూసీని అభివృద్ధి చేసుకోవొద్దా? మీరు మోదీ వద్ద ఊడిగం చేస్తారా? రూ.45 లక్షల కోట్ల బడ్జెట్ మోదీ వద్ద ఉంది కదా! కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులతో కలిసి ఈటల రావాలి. నేను రాష్ట్ర మంత్రులను వెంటబెట్టుకొని వస్తా. అందరం కలిసి మోదీ వద్దకు వెళదాం. మూసీ ప్రాజెక్టు కోసం రూ.25వేల కోట్లు తీసుకొద్దాం. మూసీ పరిధిలోని పేదలకు పంచిపెడదాం. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల తదితర లోక్‌సభ సీట్లను గెల్చుకున్న బీజేపీకి.. ప్రజల సంక్షేమం కోసం పాటు పడాలన్న ధ్యాస లేదా? పదేళ్లు బీఆర్ఎస్‌తో సావాసం చేసిన ఈటలకు పాత వాసనలు పోవడం లేదు. ఆయన రాజకీయ స్వార్థంతో మాట్లాడుతున్నారు"

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బావా బావమరుదులు విషం కక్కుతున్నరు

"హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ సమస్య, వరద ముంపు నుంచి రక్షించేందుకు మేం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఇందుకు ఏర్పాటు చేసిన హైడ్రా గురించి అసెంబ్లీలో చర్చకు పెడితే బీఆర్ఎస్ సన్నాసులు నోరు మెదపలేదు. ఇప్పుడు మాత్రం మొసలి కన్నీరు కారుస్తూ లేనిపోని ప్రచారానికి పాల్పడుతున్నారు. కిరాయి మనుషులతో కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న హడావుడిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బురదలో కూరుకుపోతున్న హైదరాబాద్‌ను కాపాడడానికి మేం కృషి చేస్తుంటే బావా బావమరదులు విషం కక్కుతున్నారు మూసీ నిర్వాసితులకు 15 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించి, ఖర్చులకు రూ.25 వేల చొప్పున ఇవ్వటం తప్పా? మూసీ ప్రక్రియపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. కేటీఆర్, హరీశ్‌రావు వచ్చి తమ అభిప్రాయాలను తెలియజేయాలి"

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



క్రీడాకారులకు టార్చ్‌ను అందజేస్తున్న సీఎం రేవంత్

తెలంగాణ ఏర్పడ్డాక క్రీడలను నిర్లక్ష్యం చేశారు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక క్రీడలను నిర్లక్ష్యం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. తమ పదేళ్ల హయాంలో క్రీడలకు బీఆర్ఎస్ సర్కారు చేసిందేమీలేదన్నారు. రాష్ట్రంలోని స్టేడియాల దుస్థితి, క్రీడాకారులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆవేదనకు గురయ్యానని చెప్పారు. తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గచ్చిబౌలి స్టేడియం ఆధునికీకరణకు రూ.20 కోట్లు కేటాయించడంతో పాటు ఇంటర్ కాంటినెంటల్ కప్‌ను నిర్వహించామని చెప్పారు. గురువారం ఎల్బీ స్టేడియంలో 'సీఎం కప్' జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారు. పాలపిట్ట రూపంతో తయారు చేసిన మస్కట్ 'నీలమణి'ని, సీఎంకప్ లోగోను ఆవిష్కరించారు. బాక్సింగ్ వరల్డ్ చాంపియన్, ఒలింపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ బ్యాడ్జ్‌ను అందించారు. యువ ఆర్చర్ చికితరావుతో సహా సుమారు 50 మంది క్రీడాకారులకు 1.02 కోట్ల విలువైన చెక్కులను అందించారు. నిరుడు నిర్వహించిన సీఎంకప్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రూ.52 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. బీసీ రాయ్ సాకర్ ట్రోఫీ నెగ్గిన తెలంగాణ జట్టుకు రూ.2 లక్షల చెక్కు ప్రదానం చేయడంతో పాటు రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టును దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు.రానున్న రోజుల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీతో పాటు అకాడమీని ప్రారంభించి క్రీడాకారులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. టార్గెట్ 2028 ఒలింపిక్స్‌గా క్రీడాకారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.తెలంగాణ క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

భవిష్యత్తులో 100% సన్నాల సాగు

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన సన్నధాన్యం దిగుబడి .. ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్... 48 గంటల్లో జమ

- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు 7వేల కేంద్రాలు
- సన్నాల పేరిట గోల్‌మాల్ జరగకుండా అధికారులు చూడాలి
- రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు
- బ్యాంకు గ్యారంటీ తీసుకున్నాకే మిల్లర్లకు ధాన్యం
- జనవరి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ: సీఎం రేవంత్



హైదరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలో వరి సాగులో 58 శాతం సన్న రకాలు పండించారని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.500 ప్రోత్సాహకంతో వచ్చే ఏడాది నుంచి సన్నాల సాగు, దిగుబడి మరింత పెరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమంగా రాష్ట్రంలో వంద శాతం సన్న వడ్లు పండించే రోజులు వస్తాయన్నారు. దొడ్డు వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదని, ఎఫ్‌సీఐ వద్ద కూడా భారీగా దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయని చెప్పారు. అందుకే సన్న రకాల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. గత సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా ఇంకా ఎక్కడైనా అవసరమని కలెక్టర్లు భావిస్తే ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసిందని చెప్పారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. సన్న వడ్ల సేకరణకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు గానీ, లేదా కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. వాటి సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్ జరిగే ప్రమాదముంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రతి కేంద్రానికి ఒక నెంబరు కేటాయించాలని, అక్కడ కొన్న వడ్ల సంచులపైన ఆ నెంబరు తప్పకుండా వేయాలన్నారు. దీంతో ఏదైనా తప్పు జరిగితే ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురికాకూడదని, వారి నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును జిల్లా కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజూ కలెక్టర్లు తమ జిల్లాలో కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ఉదయం కేంద్రాలకు వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. సమస్యలుంటే ఏ రోజుకారోజు పరిష్కరించాలని, పౌర సరఫరాల విభాగంలో 24/7 కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈసారి దిగుబడి వచ్చే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనేది, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కన పెడితే 91 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశామన్నారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు. గతంలో వరుసగా బకాయిపడిన డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల చేయొద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇతర రైస్ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకొని ధాన్యం కేటాయింపులు చేయాలని సూచించారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయండి

అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ కలెక్టర్లను ఆదేశించారు. అక్టోబరు 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు. ఇప్పటికే 9,090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు.

ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో.. అసెంబ్లీ కార్యదర్శికి స్వల్ప ఊరట

డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకునే వరకూ కోర్టుధిక్కరణ చర్యలు చేపట్టకుండా రక్షణ

- పిటిషన్ల విచారణకు షెడ్యూల్ ఇవ్వాలని కిందటి నెలలో ఆదేశాలిచ్చిన సింగిల్ జడ్జి
- 9వ తేదీన ఆ గడువు ముగుస్తున్నందున.. స్టే ఇవ్వాలని కోరుతూ కార్యదర్శి అప్పీళ్లు
- ఆ ఉత్తర్వులు ఇవ్వలేమన్న డివిజన్ బెంచ్
- 24న తుదివిచారణ చేపడతామని వెల్లడి



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణకు షెడ్యూల్ జారీచేసే విషయంలో.. తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన నాలుగు వారాల గడువు 9వ తేదీన ముగిసిపోతున్న నేపథ్యంలో.. దానిపై డివిజన్ బెంచ్ తుది నిర్ణయం తీసుకునే వరకూ ఆయనకు రక్షణ లభించింది. ఆయన కోరిన విధంగా స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించినప్పటికీ.. ఈ విషయం తమ పరిధిలో ఉన్నందున తుది విచారణ చేపట్టే వరకూ ఏమీకాదని పేర్కొంది. ఆయన దాఖలు చేసిన మూడు అప్పీళ్లపైనా 24వ తేదీన తుదివిచారణ జరుపుతామని.. ఆలోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు వేసినా.. సింగిల్ జడ్జి ముందస్తు చర్యలు చేపట్టినా, కేసును రీ ఓపెన్ చేసినా.. వాటి గురించి తమ వద్ద ప్రస్తావించవచ్చని పేర్కొంది. ఆయన దాఖలు చేసిన మూడు అప్పీళ్లనూ తుది విచారణ కోసం ఈనెల 24న విచారణ జాబితాలో ఉంచాలని రిజిస్ట్రీకి సూచించింది. తమ పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ ఎంపీగా పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. వేర్వేరుగా హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్‌లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వాటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి.. సెప్టెంబర్ 9న తుది తీర్పు జారీచేశారు. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ ఎదుట ఉంచాలని.. నాలుగువారాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌ల విచారణకు షెడ్యూల్ జారీచేయాలని.. ఆ షెడ్యూల్ హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్)కు అందజేయాలని.. లేనిపక్షంలో సూమోటోగా కేసు మళ్లీ రీఓపెన్ చేస్తామని తీర్పులో పేర్కొంది.

అప్పటిదాకా ఏం కాదు..

సింగిల్ జడ్జి తీర్పుపై తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో వేర్వేరుగా మూడు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. అసెంబ్లీ కార్యదర్శి తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఆ ఆదేశాలు న్యాయ, శాసనవ్యవస్థల మధ్య సంక్షోభానికి దారితీసేవిగా ఉన్నాయని ఆందోళన వెలిబుచ్చారు. సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు ముగుస్తోందని.. పిటిషనర్లు కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసినా.. లేదా సింగిల్ జడ్జి సూమోటోగా కేసును పునర్విచారణకు స్వీకరించినా ఇబ్బందులు వస్తాయని.. ఈ నేపథ్యంలో స్టే కోరడం తప్ప తమకు మరో మార్గం లేదని విన్నవించారు. స్పీకర్‌కు ఆదేశాలు జారీచేసే అధికారం.. స్పీకర్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోని దశ (ప్రీ డెసిషన్ స్టేజ్)లో జోక్యం చేసుకునే అధికారం కోర్టుకు లేదని వివరించారు. ఆయన వాదనలు విన్న డివిజన్ బెంచ్.. 'మేఘాచంద్రసింగ్ వర్సెస్ మణిపూర్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా సింగిల్ జడ్జి నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. "హైకోర్టు తనకు ఉన్న న్యాయసమీక్ష అధికారాన్ని ఉపయోగించుకుని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వవచ్చా? నిర్ణీత సమయంలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను హైకోర్టు కోరవచ్చా? అనేవి ఇక్కడ తలెత్తుతున్న అంశాలు. ఈ అప్పీళ్లపై తుది విచారణ చేపట్టాలని అడ్వొకేట్ జనరల్ కోరుతున్నారు. 24న తుది విచారణ చేపడతాం. దానికి ముందు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టినా అప్పీలుదారు (అసెంబ్లీ కార్యదర్శి) ఈ కోర్టు ఆశ్రయించేందుకు స్వేచ్ఛ ఇస్తున్నాం" అని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


HONDA
happy navratri and dussehra
Scooter అంటే ACTIVA
With H-Smart Technology
Cashback of 5% up to ₹5000#
Low ROI @ 7.99%**
To enjoy the video, please Scan QR Code.
ACTIVA SOLD 3.25 CRORE^ HAPPY CUSTOMERS
For more information give a missed call on 7230032200
IDFC FIRST Bank
Bank**/Credit Card#
HDFC BANK
Credit Card#
TATA CAPITAL Two Wheeler Loans **
L&T Finance **
For dealer details scan the QR Code
BOOK ONLINE NOW! www.honda2wheelersindia.com
CLICK BOOK RELAX
#Cashback Offer available on all Honda two-wheeler models for EMI transactions made using HDFC Bank credit cards and IDFC FIRST Bank credit cards through Pine Labs machines only. #Customers can avail 5% Instant cashback, up to a maximum of Rs. 5000. #Valid on one transaction per card/order during the offer period. #Cashback offer valid until 30th November 2024. #The scheme is available in select outlets only. **Approval of the loan is at the sole discretion of the financiers, and additional documentation may be required. **The interest rates, down payment, and tenure options are based on the financier's assessment of the applicant's credit profile. **The offers/features may be modified or withdrawn at any time without prior intimation. Product shown in the picture may vary from actual product available in the market. Accessories shown in the picture are not part of standard equipment. ^Source: Cumulative Sales figure of Brand Activa from June 2001 to June 2024 as per HMSI internal data.
Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) - 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda.hmsi.in
Honda Exclusive Authorized Dealerships: WARANGAL: Nagarjuna Honda - 9704377444, 9000477444; Borra Honda - 9866623666, 9100441821; HANAMKONDA: Sri Srinivasa Honda - 0870-2531111, 8374357999; STATION GHANPUR: Sri Srinivasa Honda - 8639719161; JANGAON: Sri Srinivasa Honda - 8340043555, 7095262222; MAHABUBABAD: Nagarjuna Honda - 9908677444; BHUPALPALLY: Nagarjuna Honda - 9052190444; THORRUR: Gajalakshmi Honda - 9441770871; PARKAL: Sri Sai Honda - 8686477444, 8341776222; NARSAMPET: Sneha Honda - 7337327999, 9121304141; NAIMNAGAR: Sri Srinivasa Honda - 9160414222; CHERYAL: Sri Vigneshwara Honda - 8464806750, 9550697460; MULUGU: Borra Honda - 9100441825, 8803912345; ETTURNAGARAM: Taj Honda - 9441933582, 8790251582; EKSHILANAGAR: Nagarjuna Honda - 7095377444, 7095177444.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

జవహర్ నవోదయ విద్యాలయాల్లో

లేటరల్ ఎంట్రీ

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శుక్రవారం 4 అక్టోబరు 2024

diksuchi@andhrajyothy.com

నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి లేటరల్ ఎంట్రీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా తొమ్మిది, పదకొండు తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. సెలెక్షన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాలబాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు. విద్యార్థులు విద్యాలయ వికాస్ నిధి కోసం నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. బాలికలు; దివ్యాంగులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు; పేదింటి పిల్లలకు దీని నుంచి మినహాయింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నెలకు రూ.1500 చెల్లించాలి. మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో; సోషల్ సైన్స్‌ను హిందీ/ఇంగ్లీష్‌లో బోధిస్తారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది.



సీట్ల వివరాలు

- **తొమ్మిదో తరగతిలో మిగిలిన సీట్లు:** ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం 10, చిత్తూరు 14, తూర్పు గోదావరి 13, గుంటూరు 22, అన్నమయ్య(కడప) 16, కృష్ణా 11, కర్నూలు 10, నెల్లూరు 12, ప్రకాశం 20, శ్రీకాకుళం 14, విశాఖపట్నం 10, విజయనగరం 10, పశ్చిమ గోదావరి 7, అల్లూరి సీతారామరాజు(తూర్పు గోదావరి) 6 సీట్లు ఉన్నాయి. తెలంగాణలో ఆదిలాబాద్ 7, కరీంనగర్ 12, ఖమ్మం 3, మహబూబ్‌నగర్ 13, మెదక్ 7, నల్లగొండ 11, నిజామాబాద్ 17, రంగారెడ్డి 7, వరంగల్ 5 సీట్లు ఉన్నాయి.
- రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జేఎన్‌వీల్లో పదకొండో తరగతికి సంబంధించి సైన్స్ గ్రూప్ సీట్లు ఉన్నాయి. ఖమ్మం, చిత్తూరు, గుంటూరు జేఎన్‌వీల్లో మాత్రమే కామర్స్ గ్రూప్ సీట్లు మిగిలాయి.

అర్హత: తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2010 మే 1 నుంచి 2012 జులై 31 మధ్య జన్మించి ఉండాలి. పదకొండో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2008 జూన్ 1 నుంచి 2010 జులై 31 మధ్య జన్మించి ఉండాలి.

సెలెక్షన్ టెస్ట్ వివరాలు

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు; మేథమెటిక్స్ సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 35 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఎనిమిదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థుల మెరిట్ జాబితా రూపొందించేందుకు మేథమెటిక్స్, సైన్స్ ఎక్కువ స్కోర్ ఉన్న లాంగ్వేజ్(ఇంగ్లీష్/హిందీ) మార్కులను పరిగణనలోకి తీసుకొంటారు.
- పదకొండో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ సైన్స్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో అర్హత పొందాలంటే ప్రతి సబ్జెక్టులో కనీసం ఆరు మార్కులు రావాలి. అభ్యర్థుల మెరిట్ జాబితా రూపొందించేందుకు సైన్స్ గ్రూప్ అభ్యర్థులకు మెంటల్ ఎబిలిటీ, సైన్స్, మేథమెటిక్స్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులను; కామర్స్ గ్రూప్ అభ్యర్థులకు మెంటల్ ఎబిలిటీ, సోషల్ సైన్స్, మేథమెటిక్స్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. వీటిలో మొత్తం 60 మార్కులకుగాను జనరల్ బాలురకు 21, జనరల్ బాలికలకు 20; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18 మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 30
- **సెలెక్షన్ టెస్ట్ తేదీ:** 2025 ఫిబ్రవరి 8
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in, https://cbseitms.nic.in/2024/nvsxi_11/, https://cbseitms.nic.in/2024/nvsix/

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలు



హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలు; పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు: కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్)కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు: కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

- హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలిన వాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

ఐఎస్ఎంటీలో ఫ్లోర్ మిల్లింగ్ టెక్నాలజీ

సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎఫ్‌టీఆర్ఐ) ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మిల్లింగ్ టెక్నాలజీ(ఐఎస్ఎంటీ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫ్లోర్ మిల్లింగ్ టెక్నాలజీ'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఆప్టిట్యూడ్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మిల్లింగ్ అండ్ కాగ్నేట్ సబ్జెక్ట్‌లు, బేసిక్ సబ్జెక్ట్‌లు, అప్లయిడ్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. వీటితోపాటు రెండు వారాల ఇండస్ట్రియల్ ఇన్ ప్లాంట్ ట్రెయినింగ్, స్టడీ టూర్ కూడా ఉంటాయి.



- **మిల్లింగ్ అండ్ కాగ్నేట్ సబ్జెక్టులు:** డయాగ్రమ్ టెక్నిక్, మిల్ ఆపరేషన్, మిల్ మెషిన్, మిల్ ప్రాక్టీస్, ఆటోమేటిక్ మిల్లింగ్ ప్రాక్టీస్, సెరెల్ సైన్స్, బేకింగ్ టెక్నాలజీ మిల్లింగ్.
- **బేసిక్ సబ్జెక్టులు:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్
- **అప్లయిడ్ సబ్జెక్టులు:** మెకానిక్స్, ఎలక్ట్రికల్ టెక్నాలజీ-థియరీ అండ్ ప్రాక్టికల్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, టెక్నికల్ డ్రాయింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్, ప్యాకేజింగ్ టెక్నాలజీ, ఫీడ్ మిల్లింగ్, న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి(డిప్లొమా/డిగ్రీ)(ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్లోర్ మిల్లింగ్ ఇండస్ట్రీలో అనుభవం ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.2,50,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** నవంబరు 19
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** కోఆర్డినేటర్, ఐఎస్ఎంటీ, సీఎస్ఐఆర్-సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మైసూరు, కర్ణాటక-570020
- **వెబ్‌సైట్:** www.cftri.com

జాబ్ కార్నర్



హెచ్‌యూఆర్ఎల్‌లో ట్రెయినీలు

ఖాళీలు 212

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్), ఎన్‌టీపీసీ లిమిటెడ్, కోల్ ఇండియా లిమిటెడ్‌ల జాయింట్ వెంచర్...ఝార్ఖండ్ రాష్ట్రం సింద్రీలోని హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్(హెచ్‌యూఆర్ఎల్).... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ: 67 పోస్టులు
2. డిప్లొమా ఇంజనీర్ ట్రెయినీ: 145 పోస్టులు

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీలకు రూ.40,000; డిప్లొమా ఇంజనీర్ ట్రెయినీలకు రూ.23,000

వయోపరిమితి: జీఈటీలకు 30 ఏళ్లు; డీఈటీలకు 27 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: జీఈటీలకు రూ.750; డీఈటీలకు రూ.500

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21

వెబ్‌సైట్: https://hurl.net.in/

జూట్ కార్పొరేషన్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 20

కోల్‌కతాలోని జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(జేసీఐ)... ఏడాది(2024-25) అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: 18 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

శిక్షణ కాలం: నెలకు రూ.7000

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10

వెబ్‌సైట్: www.jutecorp.in/

సీఆర్ఐడీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

ఖాళీలు 4

హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్‌కు చెందిన సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్(సీఆర్ఐడీఏ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ(అగ్రికల్చర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 18

వేదిక: క్రీడా, సంతోష్‌నగర్, సైదాబాద్ పోస్టు, హైదరాబాద్.

వెబ్‌సైట్: www.icarcrida.res.in/

బెల్‌లో సీనియర్ ఇంజనీర్లు

ఖాళీలు 5

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)... పర్మినెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్), ఎంఈ/ఎంటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ మాస్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.600; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద మేనేజర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జాలహళ్లి పోస్ట్, బెంగళూరు' చిరునామాకు పంపాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 24

వెబ్‌సైట్: bel-india.in/


చిట్టి లిటిల్స్

సాయం చేయడం మంచిదే

ఒక గురువు గారి దగ్గర అజయుడు, విజయుడు అనే ఇద్దరు రాకుమారులు విద్యాభ్యాసం చేసేవారు. వారిద్దరి విద్య పూర్తి అయ్యే సమయానికి, వారి గురువుగారు వారిద్దరినీ దగ్గరికి పిలిచి, ఇలా చెప్పారు 'నాయనా మీ ఇద్దరి విద్యాభ్యాసం పూర్తి కావచ్చింది, ఇప్పుడునేను మీకు ఓ పరీక్ష పెట్టదలిచాను. ఇక్కడికి దూరంగా ఉన్న ఆటవికుల గుహలలో ఒక విలువైన రత్నంఉంది వారిదగ్గరకు వెళ్లి, ఎవరైతే ఆ రత్నాన్ని ముందుగా తెచ్చి, నాకు ఇస్తారో వారే విజేతగా ప్రకటించబడతారు' అన్నాడు, ఆ తరువాత ఇద్దరూ తమతమ గుర్రాలను తీసుకుని, ఆ ఆటవికుల గుహల వైపుగా ప్రయాణం సాగించారు. వారికి దారిలో ఒళ్లంతా గాయాలతో రక్తం ఓడుతూ నీరసంగా పడిపోయిఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. అజయుడు ఇతని గోలమనకు ఎందుకు విజయా మన దారిన మనం పోదాం పద అంటూ ముందుకు సాగిపోయాడు. విజయుడు మాత్రం అక్కడే ఆగి,ఆ గాయపడిన మనిషికి సాయం చేసి, నీళ్లు తాగించి, ఆ తరువాతే గుహల వద్దకు ప్రయాణమయ్యాడు. విజయుడు అక్కడికి చేరేసరికే అజయుడు ఆ ఆటవికుల దగ్గరకు చేరి ఉన్నాడు. ఆలస్యంగా చేరుకున్న మిత్రునిచూసి అజయుడు ఇలా అన్నాడు ఎందుకు అందరికీ సాయం చేయాలనే కోరిక వల్ల నీ సమయం ఇలా వృథా చేసుకుంటావు? చూడు ఎంత ఆలస్యంగా చేరుకున్నావో? అన్నాడు దానికి విజయుడు ఇలా జవాబు చెప్పాడు. 'అతను ఎవరోకాదు ఈ ఆటవికుల చేతిలో గాయపడిన వాడే అతనితో నేను కాసేపు ఉండటం వలనే వీరితోఎలా మాట్లాడాలి వీరు ఎటువంటి వారు ఆ అమూల్యమైన రత్నాన్ని సాధించాలంటే ఏం చేయాలి వంటి విషయాలన్నీ అతనే నాకు చెప్పి పంపాడు. నేను సాటి మనిషి ఆపదలో ఉన్నాడని ఆదుకోవాలి అనుకున్నాను. కానీ అక్కడ కూడా మనకు మేలే జరిగింది చూడు' అన్నాడు ఈ మాటలు విన్న అజయుడు విజయుడికంటే ముందుగా ఆటవికుల వద్దకు వెళ్లి, రత్నం కోసం ప్రయత్నం చేసాడు దొరికిన రత్నాన్ని తీసుకుని, అజయుడు ముందుగా ఆశ్రమానికి చేరుకుని ' గురుదేవా,,ఇదిగో మీరు అడిగిన అమూల్యమైన రత్నం నేను ముందుగా వచ్చాను కాబట్టి, నన్ను విజేతగా ప్రకటించండి అన్నాడు. దానికి గురువుగారు నవ్వి, 'నువ్వు ముందుగా చేరుకున్నది నిజమే కానీ దారిలో గాయాలతో పడి ఉన్న సాటి మనిషిని అశ్రద్ధ చేసి ముందుకు సాగిపోయావు అలాగే ఆటవికుల గురించి,రత్నం గురించి విలువైన సమాచారం సేకరించి నీకు చెప్పినది నీమిత్రుడు విజయుడు. వాస్తవానికి రత్నం అతనే తీసుకుని రావాలి. నువ్వు పందెంలో గెలిచి తీరాలనే ఉత్సాహంతో మానవతను, మిత్ర ,ధర్మాన్ని కూడా విస్మరించావు, మంచి పాలకుడివి కావాలి అంటే ముందు మంచి మనిషివి కావాలి అది తెలుసుకో అని చెప్పి, ఆలస్యంగా వచ్చినా సరే అని విజయుడిని ఆ పోటీలో విజేతగా ప్రకటించాడు.




పక్షులు ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 426

			7			1	4	
	4							7
5		2		3				
		6				2		
7	9		5		2		8	3
		1				7		
				2		4		9
8							1	
	1	7			6			

సుడోకు - 425 సమాధానం

7	5	2	9	3	6	8	4	1
3	8	9	4	5	1	6	2	7
6	1	4	8	2	7	3	5	9
1	9	6	5	7	4	2	8	3
8	4	3	2	1	9	7	6	5
5	2	7	3	6	8	9	1	4
2	3	1	6	9	5	4	7	8
4	6	5	7	8	3	1	9	2
9	7	8	1	4	2	5	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.